

ESTD: 1999

www.voodayam.com

వుదయం

సంపుటి : 27
సంచిక : 244 | హైదరాబాద్ | 07-11-2026 శనివారం | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on



గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

రాష్ట్రానికి భారీ పెట్టుబడులు

హైదరాబాద్, నవంబర్ 6 (వుదయం) :




తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా, ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలకు ఆకర్షణీయ కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పికో వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి జారోడ్ యస్టర్, ఏఐసీఓ ప్రతినిధి జి. సీతారాం, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఆకర్షించేలా తెలంగాణలో పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వపరమైన సహకారం అందిస్తూ పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. కొత్త సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ప్రారంభించడం వల్ల ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు యువతకు నాణ్యమైన ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం తొలిసారిగా ప్రపంచస్థాయి పెట్టుబడుల సదస్సు నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని రూపొందించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను అంతర్జాతీయ సమాజానికి పరిచయం చేసేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుందని అభిప్రాయపడ్డారు.

క్రీడారంగంలో ప్రపంచ శక్తిగా భారత్

ఆసియా పారా క్రీడల్లో 114 పతకాలతో భారత్ రికార్డు

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ఎఎంస్) :



క్రీడారంగంలో భారత్‌ను ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం పటిష్ఠమైన క్రీడా వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారుల ప్రతిభను గుర్తించడం, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం, ఖేలో ఇండియా కేంద్రాల ఏర్పాటు, ఒలింపిక్స్ లక్ష్యంగా అత్యుత్తమ శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. లక్ష్య ఒలింపిక్ పోడియం పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయి శిక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆసియా దివ్యాంగ క్రీడలు 2026లో రికార్డు స్థాయిలో 114 పతకాలు సాధించిన భారత క్రీడాకారుల బృందాన్ని ప్రధానమంత్రి అభినందించారు. న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ క్రీడా సముదాయంలో శుక్రవారం క్రీడాకారులతో సమావేశమైన ఆయన, వారి అద్భుత విజయాలను కొనియాడారు. ఈ విజయాలను స్ఫూర్తిగా తీసుకుని 2028లో లాస్ ఏంజెలెస్‌లో జరగనున్న క్రీడా పోటీలకు మరింత పట్టుదలతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులతో పాటు వారి కుటుంబ సభ్యులు, శిక్షకులు, మార్గదర్శకులను కూడా అభినందించారు. ఎర్రకోట నుంచి గతంలో తాను చేసిన ప్రసంగంలో ఒలింపిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చిన విషయాన్ని మోదీ గుర్తుచేశారు. ఈ కార్యక్రమాల్లో దివ్యాంగ క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఆసియా దివ్యాంగ క్రీడల్లో భారత బృందం సాధించిన విజయాలు దేశం అంతర్జాతీయ క్రీడారంగంలో శక్తిమంతంగా ఎదుగుతోందనడానికి నిదర్శనమని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

ఆంక్షలు ఎత్తివేయాలి

నష్టపరిహారం చెల్లించా

యుద్ధం వేళ శాంతి చర్చలకు ఇరాన్ షరతులు

అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ చర్చల సందడి

యుద్ధం వేళ శాంతి చర్చలకు ఇరాన్ షరతులు



టెహ్రాన్: అమెరికాతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రతిపాదనలను తెరపైకి తీసుకొచ్చింది. సైనిక చర్యల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇస్తున్నప్పటికీ, శాంతి చర్చలకు సిద్ధమంటూ ఇరాన్ కొత్త అణు ప్రతిపాదనను పంపించింది. అయితే చర్చలు ముందుకు సాగాలంటే తాము విధించిన ఏడు ప్రధాన షరతులకు అమెరికా అంగీకరించాలని టెహ్రాన్ స్పష్టం చేసింది. ఈ షరతులను అంగీకరించిన తర్వాతే అణు కార్యక్రమంపై చర్చలు ప్రారంభిస్తామని తేల్చిచెప్పింది. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ ప్రతిపాదనలు అమెరికాకు చేరినట్లు సమాచారం. ఇరాన్ పంపిన ఏడు డిమాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు. అయితే అంతర్జాతీయ వార్తా సంస్థల్లో వెలువడిన కథనాల ప్రకారం.. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన నావికా దిగ్బంధాన్ని తొలగించడం, ఆర్థిక ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం, విదేశాల్లో నిలిపివేసిన ఇరాన్ ఆస్తులను తిరిగి విడుదల చేయడం వంటి అంశాలను ప్రధానంగా ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా యుద్ధం కారణంగా తమ దేశానికి జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని ఇరాన్ కోరుతున్నట్లు సమాచారం. లెబనాన్ సహా ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణలకు ముగింపు పలకాలని, ఇరాన్ భూభాగాలపై అమెరికా దాడులను పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేసినట్లు అంతర్జాతీయ కథనాలు పేర్కొంటున్నాయి. ఈ అంశాలన్నింటిపై స్పష్టమైన హామీ లభించినప్పుడే శాంతి ప్రక్రియలో ముందుకు వెళ్తామని ఇరాన్ వైఖరిగా తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించి అత్యంత శుద్ధి చేసిన యురేనియం నిల్వలను పూర్తిగా అప్పగించాలని అమెరికా పట్టుబడుతోంది. ఈ నిల్వలు అణ్వాయుధాల తయారీకి ఉపయోగపడే ప్రమాదం ఉందన్న ఆందోళనతో వాటిని తొలగించాలని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కోరుతోంది.

మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్యా అవకాశాలు



హైదరాబాద్, నవంబర్ 6 (వుదయం) :

మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. మైనార్టీల విద్య, సామాజిక, ఆర్థిక పురోగతితో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తూ, అక్కడి ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత శాసనసభ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ప్రజాభవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, సంక్షేమ పథకాల అమలు, విద్యాసంస్థల నిర్మాణాలు, అధ్యయన కేంద్రాల ఏర్పాటు, పాతబస్తీ అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. విద్యా అవకాశాలను పెంపొందించేందుకు అవసరమైన నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రహదారుల విస్తరణ కోసం వినియోగించిన వక్ఫ్ భూములకు సంబంధించి జీహెచ్‌ఎంసీ నుంచి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన నిధుల్లో రూ.25 కోట్లను ఈ భవన నిర్మాణానికి కేటాయించాలని సూచించారు. ఇందుకు సంబంధించి సమగ్ర కార్యాచరణ రూపొందించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. భవనం అందుబాటులోకి వస్తే మైనార్టీ విద్యార్థుల కోసం అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు సంక్షేమ శాఖకు సంబంధించిన వివిధ కార్యాలయాలను కూడా అక్కడ నిర్వహించవచ్చని తెలిపారు. మైనార్టీ విద్యాసంస్థల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఉండదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

చర్చకు ప్రధాని మోదీని ఒప్పించండి..

న్యూఢిల్లీ, నవంబర్ 6 (ఎఎంస్) :



ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణపై పార్లమెంట్‌లో చర్చ జరగాలన్న ప్రతిపాదనకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఘాటుగా స్పందించారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించాలని అమిత్ షాకు సూచించారు. ప్రజాస్వామ్యంలో చర్చలకు సిద్ధంగా ఉండాలని, తన సవాలును స్వీకరించేలా ప్రధానిని కోరాలని అన్నారు. హర్యానాలోని కర్నాల్‌లో గురువారం భాజపా నిర్వహించిన 'ప్రజాస్వామ్య పరిరక్షణ.. అరాచకత్వానికి చరమగీతం' పాదయాత్రలో అమిత్ షా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ కార్యకలాపాలకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. కీలకమైన ప్రజా సమస్యలపై చర్చించకుండా సభ నుంచి బయటకు వెళ్లడం, నిరసనలు చేపట్టడం కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిగా మారిపోయిందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటే చర్చలకు అత్యున్నత వేదిక అని పేర్కొన్న అమిత్ షా, రాహుల్ గాంధీ సభ సజావుగా సాగేందుకు సహకరించడం లేదని అన్నారు. ముఖ్యమైన అంశాలపై చర్చించేందుకు ముందుకు రాకుండా సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ కార్యకలాపాలను అడ్డుకుంటూ, వీధుల్లో జనసమూహాలను సమీకరించి అరాచక పరిస్థితులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు.


హిప్నోథెరపీ నిపుణులకు


జేమ్స్ ఎస్డైల్ పురస్కారాలు

హైదరాబాద్, నవంబర్ 6 (వుదయం) :

దేశవ్యాప్తంగా హిప్నాటిజం, హిప్నోథెరపీ రంగాల్లో పనిచేస్తున్న నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన జాతీయ హిప్నాటిజం సదస్సు వృత్తిపరమైన గుర్తింపు, పరస్పర సహకారం, సంస్థాగత అభివృద్ధికి బాటలు వేసింది. ఈ సదస్సులో మూడు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. నవంబర్ 4ను జాతీయ హిప్నాటిజం దినోత్సవంగా నిర్వహించాలనే ప్రతిపాదన, జేమ్స్ ఎస్డైల్ పురస్కారాలు 2026 ప్రదానం, భారతీయ హిప్నాటిజం మండలి ఏర్పాటు వీటిలో ప్రధానమైనవి. నవంబర్ 4న జాతీయ హిప్నాటిజం దినోత్సవం భారతదేశానికి హిప్నాటిజం రంగంలో ఉన్న చారిత్రక గుర్తింపును భావితరాలకు పరిచయం చేయడంతో పాటు శాస్త్రీయ పరిశోధనలు, బాధ్యతాయుతమైన అభ్యాసం, ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే ఉద్దేశంతో నవంబర్ 4ను జాతీయ హిప్నాటిజం దినోత్సవంగా నిర్వహించాలని ఈ కార్యక్రమ వ్యవస్థాపకుడు శేషి కిరణ్ చెరుకు ప్రతిపాదించారు. 1846 నవంబర్ 4న బెంగాల్ ప్రభుత్వ అధికారిక వ్యవహారాల్లో డాక్టర్ జేమ్స్ ఎస్డైల్‌కు సంబంధించిన ప్రస్తావనలు చోటుచేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఈ తేదీని ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఇంతే కదా...!







చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో కొత్త స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం

- నవంబర్ 6న చర్లపల్లిలో కాంప్లెక్స్ ప్రారంభం
- బాక్స్ క్రికెట్, ఎన్ఈటీ క్రికెట్ సదుపాయాలు
- యువత, స్థానిక క్రీడాకారులకు కొత్త వేదిక
- శ్రీధర్ బాబు, ఈటల రాజేందర్ హాజరు



కాప్రా (వుదయం ప్రతినిధి) నవంబర్ 6, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతం లోని ఫేజ్ 2 ప్రొఫెసర్ జయశంకర్ పబ్లిక్ పార్క్‌లో నవంబర్ 6న కొత్త ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బాక్స్ క్రికెట్, ఎన్ఈటీ క్రికెట్ సదుపాయాలతో ఏర్పాటైన ఈ కాంప్లెక్స్‌ను చర్లపల్లి నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీఆర్ ఇంజినీరింగ్ వర్క్స్ రాము ఆధ్వర్యంలో కాంప్లెక్స్ నిర్మాణం జరిగింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కూడా కార్యక్రమానికి హాజరై కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక పారిశ్రామిక ప్రాంతంలో క్రీడా సదుపాయం అందుబాటులోకి రావడం ద్వారా యువత, స్థానిక క్రీడాకారులకు కొత్త వేదిక ఏర్పడిందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచడం, స్థానిక క్రీడాకారులకు మెరుగైన వేదిక అందించడం కాంప్లెక్స్ ఏర్పాటులోని లక్ష్యాలుగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రాంగణం ఈ అవసరాలకు ఉపయోగపడుతుందని ఆయన ఆకాంక్షించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందిస్తాయని లక్ష్మారెడ్డి అన్నారు.

విద్య, తాగునీరు, ఉపాధి పనులపై సంజయ్ జాజు ప్రత్యేక ఆదేశాలు

విద్య, తాగునీరు, ఉపాధి, పింఛన్లు, ఇళ్ల పనులపై ప్రత్యేక దృష్టి



రంగారెడ్డి జిల్లా. కలెక్టర్ ఆఫీస్ హైదరాబాద్ నుంచి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు విద్య, తాగునీరు, ఉపాధి, పింఛన్లు, గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, తాగునీటి సమస్యలు రాకుండా చేతిపంపుల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ చేపట్టాలని సంజయ్ జాజు సూచించారు. వివిధ జీరాంజీ పథకంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతు కూలీలకు పెద్దఎత్తున ఉపాధి కల్పించాలని కోరారు. ఇటీవల 5.38 లక్షల కూలీలకు ఉపాధి పనులు కల్పించడం రికార్డుగా నిలిచిందని తెలిపారు. జలసిరి పనులను పెంచి నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఆసరా పింఛన్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. రెండో విడత మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, గృహప్రవేశం చేసిన లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు దీపావళి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, ఇతర అవసరాల భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మడ్గుల్ మండలంలోని వెంకటాపురం రిజర్వాయర్‌కు సంబంధించిన 1,056 ఎకరాల భూసేకరణ అవార్డు 2020లో జారీ అయినా నిధులు చెల్లించకపోవడంతో పరిహారంలో వ్యత్యాసం ఏర్పడిందని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. భూయజమానులతో మళ్లీ చర్చించి నిబంధనల ప్రకారం రీ అవార్డు అంశాన్ని పరిశీలించాల్సి ఉందన్నారు. మొండి గౌరెల్లి భూసేకరణ కేసులో అవార్డు జారీ చేశామని, పరిహారం చెల్లింపులు చేపడతామని అధికారులు తెలిపారు. మిగిలిన పీజేపీఏస్ కేసులను కూడా త్వరగా పరిష్కరిస్తామని వెల్లడించారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణం, తాగునీటి శాఖల పనితీరును వారానికోసారి సమీక్షించాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో రోజువారీ సమన్వయం చేసి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కురుమూర్తి బ్రహ్మోత్సవాల నిర్వహణకు శాఖలన్నీ సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదేశం

- ఉత్సవాల పనులు 14లోగా పూర్తిచేయాలి
- ఉత్సవాలు 10 నుంచి 25 వరకు; పనులు 14లోగా పూర్తిచేయాలి



మహబూబ్‌నగర్ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 25 వరకు జరగనున్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అమ్మాపురంలోని కురుమూర్తి దేవస్థానం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేయించి దుకాణాల వద్ద చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. రహదారి గుంతల మరమ్మతులు, పార్కింగ్, బారికేడ్లు, పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మల తొలగింపునకు ఆర్‌అండ్‌బీ శాఖ చర్యలు చేపట్టాలి. తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, కొత్త నిర్మాణాలను జాతర ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు సిద్ధం చేయాలని, వైద్య శిబిరాల్లో మందులు, పాముకాటు నివారణ ఔషధాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే తెలిపారు. పోలీసు శాఖ మఫ్టీలో గస్తీ నిర్వహించి దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలను అడ్డుకోవాలి. మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘాకు ఎక్సైజ్ శాఖ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఆర్టీసీ కొత్తకోట, ఆత్మకూరు, నారాయణపేట, చిన్నచింతకుంట మార్గాల్లో ప్రత్యేక బస్సులు నడపనుంది. గత ఏడాది 200 బస్సులు నడపగా, ఈసారి కూడా అదే సంఖ్యలో బస్సులు నడిపేందుకు ఐదు డిపోల నుంచి 100 మంది సిబ్బందిని కేటాయించనున్నారు.

శేషాచల కాలనీలో రేషన్ దుకాణాన్ని శ్రీగణేష్ తనిఖీ చేశారు

- ఎమ్మెల్యే గణేష్ తనిఖీ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు



కింద్రాబాద్ కంటోన్మెంట్ 6: హైదరాబాద్‌లోని కంటోన్మెంట్ వార్డ్ నంబర్ 5 పరిధిలోని హైదరాబాద్ శేషాచల కాలనీలో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ తనిఖీ చేశారు. రేషన్ సరుకుల పంపిణీ, బియ్యం నాణ్యత, ఇతర నిత్యావసర వస్తువులపై లబ్ధిదారులతో ఆయన నేరుగా మాట్లాడారు. మహిళలతో సహా అక్కడికి వచ్చిన లబ్ధిదారులను బియ్యం నాణ్యత, సరుకులు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పంపిణీ విధానంపై వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం, అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఎదురైన ఇబ్బందులు తగ్గాయని, నాణ్యమైన సన్నబియ్యం అందడం ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని శ్రీగణేష్ చెప్పారు.
రేషన్ పంపిణీలో అవకతవకలు జరగకుండా, ప్రభుత్వం అందించే సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా చేరేలా చూడాలని దుకాణదారుడికి సూచించారు. నాణ్యమైన రేషన్ సరుకులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. రేషన్ దుకాణ తనిఖీలో లబ్ధిదారుల అభిప్రాయాలను ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలుసుకున్నారు.

ఆశా కార్యకర్త కృష్ణవేణి కుటుంబానికి ప్రభుత్వ సహాయం కోరిన సీఐటీయూ

- బీమా సౌకర్యం కల్పించాలి
- పని భారం తగ్గించాలి
- కృష్ణవేణి కుటుంబాన్ని ఆదుకోవాలి
- ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలి
- కుటుంబానికి సాయం చేయాలి



శంకర్ పల్లి నవంబర్ 06 (వుదయం) శంకర్‌పల్లి మున్సిపాలిటీ సింగాపూర్ వార్డులో ఆశా కార్యకర్త కృష్ణవేణి అకాల మరణంపై సీఐటీయూ సానుభూతి తెలిపింది. నవంబర్ 6న శంకర్‌పల్లిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆశా కార్యకర్తలపై పని భారం అధికమైందని దేవేందర్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వారు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆశా కార్యకర్తలకు వెంటనే బీమా సౌకర్యం కల్పించాలని, పని భారం తగ్గించాలని దేవేందర్ డిమాండ్ చేశారు. కృష్ణవేణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కూడా కోరారు. ఆశా కార్యకర్తలపై ఆన్‌లైన్ పని భారం రోజురోజుకూ పెరుగుతోందని దేవేందర్ తెలిపారు. పెరుగుతున్న ఆన్‌లైన్ విధానం వారి బాధ్యతలను మరింత భారంగా మారుస్తోందని చెప్పారు. ఆశా కార్యకర్తలకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని దేవేందర్ విమర్శించారు.

అల్వాల్ డివిజన్‌లో రూ.83 లక్షల సీసీ, బీటీ రోడ్ల పనులు ప్రారంభం

కార్యక్రమంలో డిఈ మహేష్, ఏఈ అరుణ్, మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



అల్వాల్, నవంబర్ 6: భీమ్‌లో నవంబర్ 6న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సీసీ, బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. అల్వాల్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అల్వాల్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం రూ.83 లక్షల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. వాసవి నగర్ కాలనీ, భీమ్ రావు నగర్‌లలో రూ.8 లక్షల చొప్పున సీసీ రోడ్లు నిర్మిస్తారు. సంపతీ చిత్తారీ కాలనీలో రూ.24 లక్షలు, రిట్రీట్ కాలనీలో రూ.18 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపడతారు.
బీహెచ్ఈఎల్ కాలనీలో రూ.25 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించనున్నారు.
పనులు పూర్తయితే స్థానికుల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే రహదారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు.

కోకాపేట మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి 5 కోట్లు మంజూరు



- 5 కోట్ల మంజూరుకు అభినందనలు
- మహేశ్ గౌడ్‌కు ప్రతినిధుల అభినందనలు

జిల్లా రంగారెడ్డి గండిపేట్ మండల్ హైదరాబాద్లోని గండిపేట ఎన్‌సీసీ అర్బన్ విల్లాస్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ ఆధ్వర్యంలోని ప్రతినిధులు కలిశారు. కోకాపేటలో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 5 కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు వారు మహేశ్ గౌడ్‌కు అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు పటేల్ నేతృత్వంలో ప్రతినిధులు ఈ భేటీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 19 ద్వారా 5 కోట్లు మంజూరు చేసిందని వారు పేర్కొన్నారు. ఆ నిర్ణయానికి అభినందనలు తెలిపిన ప్రతినిధులు, జీఓ నంబర్ 14 బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని మహేశ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతినిధుల అభిప్రాయాన్ని మహేశ్ గౌడ్ సానుకూలంగా విని, అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మంజూరు ఉత్తర్వుతో పాటు జీఓలోని నిబంధనపై కూడా చర్చ జరిగినట్లు సమావేశ వివరాలు వెల్లడించాయి. భవన నిర్మాణానికి నిధులు రావడాన్ని స్వాగతిస్తూనే, బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాన్ని సవరించాల్సిన అవసరాన్ని ప్రతినిధులు ప్రస్తావించారు. భేటీలో టీపీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యుడు గాలి అనిల్ కుమార్ పటేల్ పాల్గొన్నారు. మహేశ్ గౌడ్ స్పందనను ప్రతినిధులు సానుకూలంగా స్వీకరించారు.

సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం


- జీవో 641 రద్దు చేయాలని జేఏసీ డిమాండ్



(రంగారెడ్డి జిల్లా కొత్తూరు) రంగారెడ్డి జిల్లాలోని సిద్ధాపూర్ వద్ద డంపింగ్ యార్డ్ ఏర్పాటును రద్దు చేయకపోతే ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని షాద్‌నగర్ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ కేశంపేట ఎంపీపీ వై రవీందర్ యాదవ్ హెచ్చరించారు. కొత్తపేట, కోనాయిపల్లి తదితర గ్రామాల ప్రజలు, నాయకులతో కలిసి నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. జీవో 641ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వం ప్రజల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని రవీందర్ యాదవ్ డిమాండ్ చేశారు. సిద్ధాపూర్ పరిసరాల్లో రోజుకు సుమారు 4 వేల మెట్రిక్ టన్నుల చెత్తను నిర్వహించే ప్రణాళిక ఉందని, అది చుట్టుపక్కల 50 నుంచి 60 గ్రామాల ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణానికి ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పచ్చని పంట పొలాలు, నివాస ప్రాంతాలు, దర్గా వంటి పవిత్ర స్థలాల సమీపంలో రూ.800 కోట్లకు పైగా వ్యయంతో ప్రాజెక్టు చేపట్టడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ వల్ల భూగర్భజలాలు, గాలి కలుషితమై ప్రజారోగ్యంపై ప్రభావం పడటంతో పాటు వ్యవసాయం, భూముల విలువలు దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ అనుభవాలను సిద్ధాపూర్ ప్రాంతానికి తీసుకురావద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పోరాటం ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రాంత ప్రజల జీవన్మరణ సమస్య అని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు జేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడుతున్నారని తెలిపారు. ఉద్యమానికి బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ సంపూర్ణ మద్దతు ఉందని చెప్పారు. ప్రభుత్వం ఆందోళనను పట్టించుకోకుండా ముందుకు సాగితే హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి, షాద్‌నగర్ చౌరస్తాలను దిగ్బంధించడంతో పాటు సచివాలయాన్ని ముట్టడిస్తామని రవీందర్ యాదవ్ హెచ్చరించారు.

32 మంది బాలికలకు సైకిళ్లు


- 32 మంది బాలికలకు సైకిళ్ల పంపిణీ
- 6, 7, 8 తరగతుల 32 మంది బాలికలకు సైకిళ్లు అందజేత



జిల్లా రంగారెడ్డి గండిపేట్ మండల్ గండిపేట్ మండల్లో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ జరిగింది. సీబీఎస్ వెంకటరమణ, రాజ్యలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖానాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 6, 7, 8 తరగతుల్లో చదువుతున్న 32 మంది బాలికలకు నిర్వాహకులు సైకిళ్లు అందజేశారు. పాఠశాల విద్యార్థినుల ప్రయోజనం కోసం చేపట్టిన కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. బాలికలు చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని ప్రకాష్ గౌడ్ అన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేది విద్య మాత్రమేనని పేర్కొన్నారు.

మన చికెన్ మటన్ మార్ట్ ప్రారంభోత్సవంలో నవీన్‌రెడ్డి పాల్గొన్నారు

- నవీన్‌రెడ్డి మార్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు
- షాద్‌నగర్‌లో మార్ట్ ప్రారంభోత్సవం జరిగింది



షాద్‌నగర్, నవంబర్ 6, (వుదయం): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో అరుణ్‌కుమార్, దుర్గేష్ ఏర్పాటు చేసిన మన చికెన్ మటన్ మార్ట్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి ముఖ్యఅ తిథిగా హాజరయ్యారు. మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాంసాహారులకు నాణ్యమైన, తాజా, పరిశుభ్రమైన మాంసాన్ని అందించి వినియోగదారుల నమ్మకం పొందాలని నవీన్‌రెడ్డి సూచించారు. వ్యాపారంలో విజయం సాధించాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.

కాప్రా ఎమ్ఆర్ఓ కార్యాలయ భవనంపై ఎమ్మెల్యే చర్చ

- కొత్త భవనానికి ప్రభుత్వ భూమి వివరాలు పరిశీలించారు.



కాప్రా (వుదయం ప్రతినిధి)
కాప్రాలో నవంబర్ 6న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ఎమ్ఆర్ఓ కార్యాలయాన్ని సందర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పర్యటన జరిగింది. ఎమ్ఆర్ఓ మతీన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కాప్రా ప్రాంతంలో కొత్త ఎమ్ఆర్ఓ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వ భూమి వివరాలు, ఇతర అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఉన్న పాత ఎమ్ఆర్ఓ కార్యాలయ భవనం స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కొత్త భవనం నిర్మించాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. నూతన కార్యాలయ నిర్మాణానికి అవసరమైన వివరాలను సిద్ధం చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

ధంతేరస్ రోజున మార్కెట్ భారీ లాభాలు


- సెన్సెక్స్ 1,718.01 పాయింట్లు పెరిగింది.



ముంబైలో ధంతేరస్ సందర్భంగా భారత స్టాక్ మార్కెట్ భారీ లాభాలతో ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,718.01 పాయింట్లు పెరిగి 81,028.02 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 493.75 పాయింట్లు ఎగిసి 25,030.35 వద్ద స్థిరపడ్డాయి. ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలు, పెట్టుబడిదారుల కొనుగోళ్లు ఈ పెరుగుదలకు కారణమయ్యాయి. సెన్సెక్స్‌కు ఇది వరుసగా ఏడో లాభాల సెషన్. బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ 30 లక్షల కోట్ల రూపాయలు పెరిగి 503 లక్షల కోట్లకు చేరింది. ప్రైవేట్ బ్యాంకుల షేర్లలో అత్యధిక లాభాలు నమోదయ్యాయి. విదేశీ పెట్టుబడిదారుల తిరిగి ప్రవేశం మార్కెట్ ర్యాలీకి మరో ప్రధాన కారణమైంది.

గ్రేటర్ హైదరాబాద్







కరువు ప్రభావిత రైతులకు బ్యాంకులు సకాలంలో రుణ ఉపశమనం అందించాలి

రంగారెడ్డి జిల్లా నవంబర్ 06 (వుదయం)

కరువు ప్రభావిత రైతులకు ఆర్థికంగా అండగా నిలవాలని, అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం దీర్ఘకాలిక రుణాలుగా పునర్వ్యవస్థీకరించి సకాలంలో ఉపశమనం కల్పించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డాక్టర్ కిరణ్మయి బ్యాంకర్లకు సూచించారు.జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ కె.పి. ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC) సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.03, తేదీ 24102026 ప్రకారం ఆర్బీఐ మార్గదర్శకాలు, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (SLBC) తీర్మానాలను బ్యాంకులు అమలు చేయాలని సూచించారు.జిల్లాలో మొత్తం 18 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 5 తీవ్ర కరువు ప్రభావిత మండలాలు, 13 మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలు ఉన్నాయని తెలిపారు. మధ్యస్థ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల మారటోరియంతో పాటు తదుపరి 24 నెలల వరకు, తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో 12 నెలల మారటోరియంతో పాటు తదుపరి 48 నెలల వరకు రుణాల చెల్లింపు గడువు కల్పించే విధానాన్ని వివరించారు.లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ, బ్యాంకర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి అర్హులైన రైతులను గుర్తించి, రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని, అవసరమైన కొత్త రుణాలను సకాలంలో అందించాలని కోరారు.ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ రుణాల పునర్వ్యవస్థీకరణ విధానం, అర్హతలు, అమలు ప్రక్రియపై వివరించగా, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ హర్ష రైతులకు అందించాల్సిన రుణ ఉపశమన చర్యలను వివరించారు. పంటల బీమా పరిహారం అందే వరకు వేచి చూడకుండా అర్హత మేరకు అదనపు ఆర్థిక సహాయం, తాజా రుణాలు అందించాలని సమావేశంలో సూచించారు.రైతులపై రుణ వసూళ్ల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, కరువు పరిస్థితుల్లో వారికి అండగా నిలవాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఎల్ డి ఎం సుశీల్ కుమార్, అన్ని బ్యాంకుల ప్రతినిధులు, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట నారాయణ, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, అధికారులు

గుమ్మడిదల శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి కీలక ముందడుగు

- **ఐదు రోజుల్లోగా క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక, సమగ్ర అంచనా వ్యయం సిద్ధం చేయాలని TTD చీఫ్ ఇంజనీర్ ఆదేశం**

గుమ్మడిదల , నవంబర్ 6 (వుదయం):

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల లోని శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణం దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) కీలక చర్యలు చేపట్టింది. ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి TTD చైర్మన్ బి.ఆర్. నాయుడుకు చేసిన విజ్ఞప్తిపై అధికారులు సానుకూలంగా స్పందించారు.

ఈ మేరకు TTD చీఫ్ ఇంజనీర్ మనోహరం ఆలయ పునర్నిర్మాణ ప్రతిపాదనపై క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి, సమగ్ర నివేదికతో పాటు నిర్మాణానికి అవసరమైన అంచనా వ్యయాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ ఆదేశాలకు సంబంధించిన అధికారిక లేఖను తిరుమలలోని తన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ మనోహరం దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, కిచ్చన్నగారి ప్రకాష్ రెడ్డికి అందజేశారు.

క్షేత్రస్థాయి పరిశీలనలో TTD ఇంజినీరింగ్ అధికారులు, స్థపతి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ (HDPP) విభాగం సిబ్బంది, ఆలయ కమిటీ ప్రతినిధి పాల్గొననున్నారు. ఐదు రోజుల్లోగా పరిశీలన నివేదికతో పాటు సమగ్ర నిర్మాణ వ్యయ అంచనాలను సమర్పించాలని అధికారులు గడువు విధించారు. ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఎన్నో ఏళ్లుగా భక్తులు ఎదురుచూస్తున్న శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి TTD నుంచి సానుకూల స్పందన లభించడంతో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చి, శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి ఆలయం తిరిగి నూతన వైభవాన్ని సంతరించుకోవాలని గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



ముషీరాబాద్ సదర్ ఉత్సవాలకు సర్వం సిద్ధం.. హర్యానా, పంజాబ్ నుంచి ప్రత్యేక దున్నపోతులు!

- **యువరాజ్ టూ' ప్రత్యేక ఆకర్షణ.. ఉత్సవాలకు ఘన స్వాగతం**

ముషీరాబాద్, నవంబర్ 06(వుదయం)

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, పశుసంపద వైభవానికి ప్రతీకగా నిలిచే ముషీరాబాద్ సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ సత్తార్‌బాగ్, నారాయణగూడ ప్రాంతాల్లో నిర్వహించనున్న సదర్ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా తీసుకొస్తున్న భారీ దున్నపోతులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. ముఖ్యంగా 'యువరాజ్ టూ' దున్నపోతు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సదర్ ఉత్సవాల ప్రాముఖ్యతను వివరిస్తూ, యాదవుల ఐక్యతను చాటిచెప్పేలా వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తలసాని సాయి యాదవ్,ముఠా జైసింహాతో పాటు పలువురు యాదవ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలను ప్రజలందరూ తిలకించి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి అడ్డంకులెందుకు?

- **అధికారుల తీరుపై కాటా శ్రీనివాస్ గౌడ్ అసహనం**

అక్రమ నిర్మాణాలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్

జిన్నారం నవంబర్ 6 (వుదయం)



గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయ పనులపై వివాదం నెలకొంది. ఆలయ నిర్మాణానికి అధికారులు ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారంటూ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. గురువారం స్థానిక నాయకులు, అయ్యప్ప దేవాలయ కమిటీ ప్రతినిధులతో కలిసి నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఆలయ నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు సంబంధించిన ఆలయ నిర్మాణం విషయంలో అధికారులు సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. ఒకవేళ నిర్మాణానికి సంబంధించి నిబంధనల సమస్యలు ఉంటే వాటిని పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని కోరారు. అదే సమయంలో మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాల అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన సర్వే నంబర్లపై ఫిర్యాదు చేస్తానని, వాటిపైనా అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ నిర్మాణంపై ఒక విధంగా, ఇతర అక్రమ నిర్మాణాలపై మరో విధంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి అధికారులు సత్వరమే సహకరించి పనులు ముందుకు సాగేలా చూడాలని కాటా శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, గడ్డపోతారం కాంగ్రెస్ నాయకులు, బాలు గారి శ్రీనివాస్, శంకర్, శ్రీనివాస్, మణి, అయ్యప్ప దేవాలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డపోతారంలో అయ్యప్ప మండల దీక్షలు ప్రారంభం



జిన్నారం ,నవంబర్ 6 (వుదయం)

కార్తీక మాసం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్న వేళ గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో అయ్యప్ప స్వామి భక్తులు 41 రోజుల మండల దీక్షలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ప్రదీప్ గురుస్వామి ఆధ్వర్యంలో పలువురు యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారణ చేసి మండల దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా గురుస్వాముల సమక్షంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భజనలు, శరణుఘోషలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. మాలధారణ చేసిన స్వాములు 41 రోజుల పాటు నియమ నిష్ఠలు, భక్తి భావంతో దీక్షను కొనసాగించనున్నారు. స్వామి నామ స్మరణ, పూజలు, భజనలతో ఆధ్యాత్మిక జీవనాన్ని గడుపుతూ అయ్యప్ప స్వామి అనుగ్రహం పొందేందుకు సిద్ధమయ్యారు. యువత పెద్ద సంఖ్యలో దీక్షలు స్వీకరించడం పట్ల అయ్యప్ప భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంతో గడ్డపోతారం పరిసర ప్రాంతాల్లో అయ్యప్ప శరణుఘోష మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

జేబీఐటి కళాశాల విద్యార్థిని వైష్ణవి మృతి పై ప్రభుత్వం విచారణ జరపాలి

ఐస రాష్ట్ర కో కన్వీనర్ చరణ్ గౌడ్ .

చేవెళ్ల నవంబర్ 06 (వుదయం)



ఐస ఆధ్వర్యంలో జె బి ఐ టి కళాశాల వద్ద విద్యార్థి వైష్ణవి మృతి పై ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా ఐస రాష్ట్ర కోకన్వీనర్ చరణ్ మాట్లాడుతూ..కళాశాలలో ప్రొఫెసర్ ఉపేందర్ వేధింపుల వల్ల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిందని దీనిపై ప్రభుత్వం పూర్తి విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకొని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు జె బి ఐ టి కళాశాలలో విద్యార్థులు ప్రొఫెసర్ల ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనికి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జెబిఐటి కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు కళాశాలలో వేధింపుల వల్ల గతంలో కూడా చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని అన్నారు జె బి ఐ టి కళాశాలలో విద్యార్థుల సమస్యలపై ఐస పోరాటం చేస్తుందని ఎవరు కూడా ఆత్మహత్యకు పాల్పడవద్దని ఐస విద్యార్థులకు భరోసా కల్పించింది.ఈ కార్యక్రమంలో ఐస జిలా కో కన్వీనర్ రేశ్వంత్,పవన్, అభి వినోద్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు .

తెల్లాపూర్ లో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్..

- **1.904 కిలోల గంజాయి స్వాధీనం..**

రామచంద్రాపురం, నవంబరు 6 (వుదయం)



బీహార్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించి విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను కొల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.904 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్‌లోని జె.పి. కాలనీలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు నవంబరు 6న పోలీసులకు సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టి ఇర్ఫాన్ ఆలం (22), అజహరుద్దీన్ అన్సారీ (22)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న నల్లరంగు బ్యాగును పరిశీలించగా రెండు ప్యాకెట్లలో 1.904 కిలోల గంజాయి లభించింది.విచారణలో ఈ నెల 2న బీహార్ సరిహద్దు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి వద్ద సుమారు రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు నిందితులు వెల్లడించారు. రైలు మార్గంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి జె.పి. కాలనీలోని తమ నివాసంలో ఉంచినట్లు తెలిపారు. లేబర్ క్యాంపుల్లో పనిచేసే కార్మికులకు విక్రయించి సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు.

నిందితుల నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు చేసుకోవాలి

ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వాములు కావాలి!

ముషీరాబాద్, నవంబర్ 06 (వుదయం)



రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను సేకరించారు.ఈ సందర్భంగా రత్న సాయిచంద్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, అదే విధంగా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకుని తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రతి గ్రాడ్యుయేట్ నమోదు కావాలి.. ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలంగా మారాలి అనే సంకల్పంతో ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

హకీంపేట ఫ్యాక్టరీతో ఆయిల్‌పామ్ సాగుకు మరింత ప్రోత్సాహం

ఖుదాన్ పూర్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం

పూడూర్ నవంబర్ 7: (వూదయం)

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం లోని పరిగి మండలం ఖుదావందాపూర్ గ్రామంలో ఎకో పామ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అధికారి టీ. విజయ్ కుమార్, క్షేత్రస్థాయి అధికారి నవీన్ చారి, క్లస్టర్ అధికారి ప్రక్యాత్, పాల్గొన్నారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానాలు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, మొక్కల సంరక్షణ మరియు దిగుబడి పెంపుపై వివరించారు.ఆయిల్‌పామ్ నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమై, సరైన యాజమాన్యంతో సుమారు 30 సంవత్సరాల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఏడాది పొడవునా గెలల దిగుబడి, ప్రారంభ దశలో అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం, సరైన నీటి మరియు ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడి పొందవచ్చని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు.

హకీంపేట ఆయిల్‌పామ్ కర్మాగారం అందుబాటులోకి రావడంతో రైతులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా ఫ్యాక్టరీకి గెలలను విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనివల్ల స్థానిక రైతులకు మార్కెటింగ్ సౌకర్యం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.ప్రస్తుతం పుదుర్ మండలంలో 307 ఎకరాల్లో, వికారాబాద్ జిల్లాలో మొత్తం 4,052 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదయ్య, ఉపసర్పంచ్ నర్సింలు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు,పెద్ద సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత జీవితంపై నిరాధార ఆరోపణలు చేయడం దుర్మార్గమైన చర్య

బల్మూరి వెంకట్‌పై అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన కనకాల శివాజీ కురుమ

ముషీరాబాద్, నవంబర్ 06(వుదయం)



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ గారు, ఆయన దంపతుల వైవాహిక జీవితంపై నిరాధార ఆరోపణలు చేస్తూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనకాల శివాజీ కురుమ అన్నారు.

ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజు యాదవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, అయితే వాటికి కొన్ని హద్దులు ఉండాలని శివాజీ కురుమ స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం నాయకుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకుని, ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల మెప్పు పొందేందుకు అసత్య ప్రచారాలు చేస్తూ ఇతరుల గౌరవ మర్యాదలకు భంగం కలిగించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.ప్రజా జీవితంలో ఉన్న నాయకుల పనితీరు, విధానాలపై విమర్శలు చేయవచ్చని, కానీ వారి కుటుంబ సభ్యుల వ్యక్తిగత జీవితాలను వివాదాల్లోకి లాగడం తగదని హితవు పలికారు. ఇకనైనా రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటామని, ఇలాంటి అసత్య ప్రచారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కనకాల శివాజీ కురుమ స్పష్టం చేశారు.

జాతీయ రహదారిపై దారి దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- **మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులు పట్టివేత.. మరో నిందితుడి కోసం గాలింపు**
- **సంగారెడ్డి జిల్లాలో మూడు, కర్ణాటకలో ఒక దారి దోపిడీ కేసు ఛేదింపు**
- **నకిలీ తుపాకీ, రెండు కత్తులు, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం**
- **మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోష్ పంకజ్**

సంగారెడ్డి, నవంబర్ 6 (వుదయం):



జాతీయ రహదారులపై రాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాల్లో నిలిపి ఉంచిన కార్లను లక్ష్యంగా చేసుకొని, అందులో ప్రయాణిస్తున్న వారిని నకిలీ తుపాకీ, కత్తులతో బెదిరించి బంగారు ఆభరణాలు, నగదును దోచుకుంటున్న అంతర్రాష్ట్ర ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. సంగారెడ్డి జిల్లాలో నమోదైన మూడు దారి దోపిడీ కేసులతో పాటు కర్ణాటకలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్‌లో జరిగిన మరో దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు.శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఈ కేసుల వివరాలను వెల్లడించారు. సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఇదీ దోపిడీ చేసే విధానం!నిందితులు రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై ప్రయాణిస్తూ అత్యవసర కారణాలతో రోడ్డు పక్కన ఒంటరిగా నిలిపి ఉంచిన కార్లను లక్ష్యంగా చేసుకునేవారు. తమ ద్విచక్రవాహనాన్ని కొంత దూరంలో నిలిపి, ముఖాలు గుర్తుపట్టకుండా మంకీ క్యాప్‌లు ధరించి కార్ల వద్దకు వెళ్లేవారు. వెంట తెచ్చుకున్న నకిలీ తుపాకీ, కత్తులతో కార్లలో ఉన్నవారిని బెదిరించి బంగారు ఆభరణాలు, నగదును దోచుకునేవారు. అనంతరం ద్విచక్రవాహనంపై మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి పారిపోయేవారు. దోచుకున్న బంగారు ఆభరణాలను అక్కడ పరిచయమున్న వ్యక్తి ద్వారా బంగారు దుకాణాల్లో విక్రయించి డబ్బులు పంచుకునేవారని విచారణలో వెల్లడైంది.నాలుగు దోపిడీ కేసుల్లో ప్రమేయం 2026 అక్టోబర్ 17న చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్ 65పై కారులో ఉన్నవారిని బెదిరించి రెండు బంగారు గాజులు, పుస్తెల తాడు, బంగారు, డైమండ్ నెక్లెస్, ఉంగరం, రూ.2,500 నగదును దోచుకున్నారు.అక్టోబర్ 25న అర్ధరాత్రి సదాశివపేట పరిధిలోని ఆరూరు గ్రామ శివారులో నిలిపి ఉంచిన మరో కారులోని వ్యక్తులను బెదిరించి బంగారు ఆభరణాలు, నగదును దోచుకున్నారు. అదే రోజు తెల్లవారుజామున కోహీర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కారును లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడ్డారు. అక్టోబర్ 22, 23 తేదీల మధ్య రాత్రి కర్ణాటకలోని హుమ్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ఇదే తరహా నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది.నేర చరిత్ర ఉన్న నిందితులు ప్రధాన నింది తుడు హసన్ సమీర్ షేక్‌పై మహారాష్ట్రలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలోనే దోపిడీలు, దొంగతనాలకు సంబంధించి పలు కేసులు నమోదయ్యాయి. మరో నిందితుడు సంతోష్ సెగర్ ధగుడుపైనా ఆయుధాల చట్టం, దోపిడీకి సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

భారీగా వస్తువుల స్వాధీనం

నిందితుల నుంచి నేరాలకు ఉపయోగించిన నీలం రంగు యమహా ఆర్15 వాహనం, ఒక నకిలీ ఎయిర్ పిస్టల్, రెండు కత్తులు, రెండు నల్ల క్యాప్‌లు, మూడు స్వెట్టర్లు, ఒక బ్యాగ్, రెండు ఆధార్ కార్డులు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దోచుకున్న బంగారు ఆభరణాలను లాతూర్‌లో విక్రయించినట్లు వెల్లడికావడంతో వాటి కొనుగోలుకు సహకరించిన వ్యక్తి, బంగారు దుకాణం వివరాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.రాత్రి ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలిరాత్రి సమయాల్లో ప్రయాణించేవారు నిర్మానుష్య ప్రాంతాల్లో వాహనాలను నిలిపి ఉంచవద్దని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పెట్రోల్ బంకులు, ధాబాలు, హోటళ్లు వంటి జన సంచారం ఉన్న సురక్షిత ప్రాంతాల్లోనే వాహనాలను నిలపాలన్నారు. వాహనం బ్రేక్‌డౌన్, టైర్ పంక్చర్ వంటి సమస్యలు ఎదురైతే డయల్ 112కు లేదా జాతీయ రహదారి పెట్రోలింగ్ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.ఈ కేసులను ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన సీసీఎస్, జహీరాబాద్ సబ్ డివిజన్, సదాశివపేట పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

IN THE COURT OF THE HON'BLE III JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD
O.S. NO. 3467 OF 2026

Between :
Gopi Lavanya & 2 Others ... Plaintiffs
AND
1. The Tahsildar, Nampally Mandal, Hyderabad
2. All Concerned ... Defendants

PUBLIC NOTICE
To: ALL CONCERNED / PUBLIC AT LARGE

Notice is hereby given to the public at large that the Plaintiffs (1) Gopi Lavanya, W/o late Gopi Sree Hari, (2) Gopi Neharika, and (3) Gopi Jagdeeshwari, both daughters of late Gopi Sree Hari, residents of H.No. 14-8-430, Sheetala Mata Temple, Near Gandhi Statue, Puranapool, Karwan, Asifnagar, Hyderabad, Telangana, have filed the above-numbered suit against the Tahsildar, Nampally Mandal and All Concerned. The Plaintiffs have instituted this suit seeking a Declaration of Legal Heirs, praying that this Hon'ble Court may be pleased to declare Plaintiff Nos. 1 to 3 as the sole surviving legal heirs of Late Gopi Sree Hari (also known as G. Sree Hari), who passed away on 25-02-2017 at Hyderabad. Any person or persons having any objection, claim, or interest in the estate of the deceased Gopi Sree Hari, or objecting to the grant of such legal heirship declaration in favour of the Plaintiffs, may appear before this Hon'ble Court (III Junior Civil Judge, CCC, Hyderabad) either in person or through Advocate on the next date of hearing fixed on 02-12-2026 at 10:30 AM, to file their formal written objections. Take notice that if no objections are received and no appearance is made on your behalf on the said date, the matter will be heard, evaluated, and decided in your absence in accordance with the law.

By Order of the Court
Sd/-
M/s. ANITHA RAGHAVULA
ADVOCATE
Counsel for Plaintiffs
H. No. 2-1-61, First Floor, Upperpally, Rajendranagar, Ranga Reddy District, Telangana – 500048. Mob: 9666662751
Email: ar01attorney@gmail.com




" ఇప్పటి వరకు తనదైన శైలిలో నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగిన ట్రంప్‌నకు ఇకపై కాంగ్రెస్‌లో ప్రతిపక్షం నుంచి గట్టి సవాళ్లు ఎదరయ్యే అవకాశం ఉంది. డెమొక్రాట్ల బలం పెరగడంతో ట్రంప్ ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకు రావడం, కీలక నియామకాలు చేపట్టడం అంత సులభం కాదు. తాజాగా డెమొక్రాట్లకు లభించిన ఆధిక్యం ట్రంప్ రాజకీయ వ్యూహాలకు సవాలుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా కొత్త చట్టాల ఆమోదం, బడ్జెట్ నిర్ణయాలు, కీలక ప్రభుత్వ నియామకాల విషయంలో రాజకీయ చర్చలు తప్పనిసరి అవుతాయి. "

- శశిథరూర్, కాంగ్రెస్ ఎంపి

వే'మన' పద్యం

కానివానిచేత గాసు వీసంబిచ్చి
వెంట దిరుగువాడె వెట్టివాడు
పిల్లి తిన్న కోడి పిలిచినా పలుకునా
విశ్వదాభిరామ వినురవేమ



సంపాదకీయం

ప్రజల తీర్పు.. ట్రంప్‌కు హెచ్చరిక


అమెరికా రాజకీయాల్లో 2026 మధ్యంతర ఎన్నికలు అనూహ్య పరిణామాలకు వేదికగా నిలిచాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఓటర్లు గట్టి షాక్ ఇచ్చినట్లు ఈ ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ప్రతినిధుల సభతో పాటు సెనెట్‌పైనా డెమొక్రాట్లు ఆధిపత్యం సాధించడం ట్రంప్ పాలనపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తికి నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో రిపబ్లికన్లకు కంచుకోటలుగా ఉన్న రాష్ట్రాల్లోనూ డెమొక్రాట్లు విజయాలు సాధించడం అమెరికా రాజకీయాల్లో మారుతున్న ప్రజాభిప్రాయానికి అద్దం పడుతోంది. 2024 ఎన్నికల్లో రెండు సభలపైనా పట్టు సాధించిన రిపబ్లికన్లు, రెండేళ్లు తిరగకముందే రాజకీయంగా వెనుకబడటం గమనార్హం. సెనెట్‌లో రిపబ్లికన్ల నుంచి ఏడు స్థానాలను డెమొక్రాట్లు చేజిక్కించుకోవడం, ప్రతినిధుల సభలోనూ గణనీయమైన ఆధిక్యత సాధించడం ట్రంప్ రాజకీయ ప్రతిష్టకు ఎదురైన పెద్ద దెబ్బగా భావించవచ్చు. ఈ ఫలితాలను కేవలం పార్టీల మధ్య అధికార మార్పిడిగా చూడటం సరికాదు. ఇవి ట్రంప్ అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాలపై ప్రజలు వ్యక్తం చేసిన అసంతృప్తికి ప్రతిబింబం. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ తన వ్యక్తిగత ప్రతిష్టనే ప్రధాన అస్త్రంగా మలుచుకున్నారు. రిపబ్లికన్ అభ్యర్థుల విజయానికి తన నాయకత్వమే కీలకమని ప్రచారం చేసుకున్నారు. ఓటర్లు తననే ఎన్నికల బరిలో ఉన్నట్లు భావించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అయితే ఫలితాలు ప్రతికూలంగా రావడంతో, తాను కూడా బ్యాలెట్‌పై ఉండి ఉంటే రిపబ్లికన్లు భారీ మెజారిటీతో గెలిచేవారని వ్యాఖ్యానించడం ఓటమి వాస్తవాన్ని అంగీకరించలేని వైఖరికి నిదర్శనం. మరోవైపు, ఎన్నికల ఫలితాలను అంగీకరిస్తానని, డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తానని చెప్పడం రాజకీయ వాస్తవాలను గుర్తించినట్లుగా కనిపిస్తోంది.ట్రంప్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడానికి ప్రధాన కారణం ఆర్థిక పరిస్థితులే. నిత్యావసర వస్తువుల ధరలు, పెరుగుతున్న జీవన వ్యయం, దిగుమతులపై విధించిన సుంకాలు, ఆర్థిక అనిశ్చితి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేశాయి. అంతర్జాతీయ పరిణామాలు, ఇరాన్‌తో యుద్ధ పరిస్థితులు, ప్రభుత్వ వ్యవహారాల్లో అవినీతి ఆరోపణలు, పాలనా తీరుపై విమర్శలు కూడా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. ప్రజలకు కావాల్సింది రాజకీయ ఆర్భాటం కాదు.. మెరుగైన జీవన ప్రమాణాలు, ఆర్థిక భద్రత, సుస్థిరమైన పాలన అన్న విషయాన్ని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది.రాయిటర్స్ వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ గణాంకాలు కూడా ప్రజల ఆలోచనా ధోరణిని తెలియజేస్తున్నాయి. దాదాపు 90 శాతం మంది ఓటర్లు జీవన వ్యయాన్ని తమ ఓటును ప్రభావితం చేసిన ప్రధాన అంశంగా పేర్కొన్నట్లు సమాచారం. దేశం పయనిస్తున్న తీరుపై మూడింట రెండొంతుల మంది అసంతృప్తి వ్యక్తం చేయగా, అధ్యక్షుడి అధికారాలపై కాంగ్రెస్ మరింత సమర్థవంతమైన నియంత్రణలు విధించాలని 70 శాతం మంది అభిప్రాయపడినట్లు వెల్లడైంది. ఈ గణాంకాలు ప్రజల ప్రాధాన్యతలకు, ప్రభుత్వ విధానాలకు మధ్య పెరుగుతున్న అంతరాన్ని స్పష్టం చేస్తున్నాయి.ట్రంప్ రాజకీయ శైలిలో అధికార కేంద్రీకరణ మరో ఆందోళనకరమైన అంశం. తన నిర్ణయాలను ప్రశ్నించే వారిని ప్రత్యర్థులుగా చూడటం, ప్రభుత్వ సంస్థలపై వ్యక్తిగత ఆధిపత్యం ప్రదర్శించాలనే ధోరణి, విమర్శలను సహించలేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థల స్ఫూర్తికి విరుద్ధం. అమెరికా రాజ్యాంగ వ్యవస్థలో అధ్యక్షుడి అధికారాలను నియంత్రించడంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తుంది. రెండు సభలూ డెమొక్రాట్ల ఆధీనంలోకి రావడం వల్ల ప్రభుత్వ విధానాలపై పర్యవేక్షణ, విచారణలు, అధికార దుర్వినియోగంపై ప్రశ్నించే అవకాశాలు వారికి మరింత పెరుగుతాయి. ఇది అధికార సమతుల్యతకు బలం చేకూర్చే పరిణామం.ఈ ఎన్నికల్లో సంప్రదాయ రిపబ్లికన్ ఓటర్లలోనూ వచ్చిన మార్పు ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన విషయం. టెక్సాస్, కాన్సాస్, సౌత్ కరోలినా వంటి రాష్ట్రాల్లో డెమొక్రాట్లకు లభించిన విజయాలు రాజకీయ విధేయత కంటే ప్రజా సమస్యలే ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయనే సంకేతాన్నిస్తున్నాయి. పార్టీ అనుబంధం కంటే ఆర్థిక పరిస్థితులు, ఉపాధి, ధరల పెరుగుదల, ప్రజాసంక్షేమం వంటి అంశాలకే ఓటర్లు ప్రాధాన్యత ఇస్తున్నారన్నది ఈ పరిణామాల సారాంశం.అయితే, ఈ ఓటమి నుంచి ట్రంప్ ఎలాంటి గుణపాఠం నేర్చుకుంటారన్నదే ఇప్పుడు కీలకం. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు. ప్రజల విశ్వాసం ఉన్నంతవరకే నాయకులకు పాలించే హక్కు ఉంటుంది. వ్యక్తిగత అహంకారం, ప్రచార ఆర్భాటం, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపలేవు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, జీవన వ్యయం వంటి సమస్యలను పరిష్కరించడంలో విఫలమైతే ఎంతటి ప్రజాదరణ ఉన్న నాయకుడికైనా ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు.అమెరికా ఓటర్లు ఇచ్చిన ఈ తీర్పు ఒక్క ట్రంప్‌కే పరిమితమైన హెచ్చరిక కాదు. ప్రపంచవ్యాప్తంగా అధికారంలో ఉన్న పాలకులందరికీ ఇది ఒక గుణపాఠం. ప్రజల ఆకాంక్షలను విస్మరించి, వ్యక్తిగత ప్రతిష్టకు, రాజకీయ ఆధిపత్యానికి ప్రాధాన్యతనిచ్చే నాయకత్వం ఎంతోకాలం మనుగడ సాగించలేదని ఈ ఎన్నికలు మరోసారి నిరూపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికారం పాలకుల వ్యక్తిగత ఆస్తి కాదు.. ప్రజలు అప్పగించిన బాధ్యత మాత్రమే. ఆ బాధ్యతను విస్మరిస్తే ప్రజల తీర్పు ఎంతటి నాయకుడినైనా నిలదీస్తుందన్న సత్యాన్ని ట్రంప్‌కు ఈ ఎన్నికలు గుర్తుచేస్తున్నాయి.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

అంతఃశక్తికి అక్షరరూపం – అల్లామా ఇక్బాల్

చరిత్రలో ఎన్నో సాహిత్య ప్రక్రియలు పుట్టుకొస్తుంటాయి, కాలగమనంలో కనుమరుగవుతుంటాయి. కానీ కొన్ని ఆలోచనలు మాత్రం కాలప్రవాహాన్ని ఎదురీదుతూ తరతరాల ఆలోచనా విధానాలను ప్రభావితం చేస్తుంటాయి. కేవలం భావోద్వేగాలకే పరిమితం కాకుండా, మనిషి అంతరంగాన్ని మేల్కొలిపి, అతడిని కొత్తగా ఆలోచింపజేసే తాత్వికత అరుదుగా కనిపిస్తుంది. అలాంటి విశిష్ట మేధావి అల్లామా ముహమ్మద్ ఇక్బాల్. దక్షిణాసియా సాహిత్య చరిత్రలో కవిగా, దార్శనికుడిగా ఆయనది ప్రత్యేక స్థానం. 1877 నవంబర్ 9న అప్పటి బ్రిటిష్ భారతదేశంలోని సియాల్‌కోట్‌లో ఇక్బాల్ జన్మించారు. ప్రస్తుతం ఆ ప్రాంతం పాకిస్థాన్‌లో ఉంది. చిన్ననాటి నుంచే భాష, సాహిత్యం, తత్వశాస్త్రంపై ఆసక్తి పెంచుకున్న ఆయన సంప్రదాయ విద్యతోపాటు ఆధునిక విద్యనూ అభ్యసించారు. సియాల్ కోట్ లో ప్రాథమిక విద్య పూర్తి చేసిన తరువాత లాహోర్‌లో ఉన్నత విద్య కొనసాగించారు. అనంతరం యూరప్‌కు వెళ్లి కేంబ్రిడ్జ్‌లో తత్వశాస్త్రం అభ్యసించారు. జర్మనీలోని మ్యూనిచ్ విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. తూర్పు తాత్విక సంప్రదాయాలతోపాటు పాశ్చాత్య తత్వచింతనను కూడా లోతుగా అధ్యయనం చేయడం ఆయన ఆలోచనలకు విశాలమైన దృష్టిని అందించింది.*కవిత్వంలో కొత్త ఆలోచనా ప్రపంచం*ఇక్బాల్ కవిత్వంలో ప్రధానంగా కనిపించేది మనిషి అంతర్గత శక్తిపై ఆయనకు ఉన్న అపారమైన నమ్మకం. మనిషి తన పరిస్థితులకు బానిసగా మిగిలిపోకూడదని, తనలోని సామర్థ్యాన్ని గుర్తించి జీవితాన్ని తన చేతులతో మలచుకోవాలని ఆయన బలంగా విశ్వసించారు. ఈ భావనకు ఆయన 'ఖుదీ' అనే పేరు పెట్టారు. ఉర్దూ, పర్షియన్ భాషల్లో ఉపయోగించిన ఈ పదానికి కేవలం ఆత్మాభిమానం లేదా అహంకారం అనే అర్థం మాత్రమే లేదు. తన ఉనికిని గుర్తించడం, వ్యక్తిత్వాన్ని బలపరచుకోవడం, స్వతంత్రంగా ఆలోచించడం, జీవితానికి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం వంటి విస్తృత భావాలు ఇందులో ఇమిడి ఉన్నాయి.ఇక్బాల్ దృష్టిలో నిజమైన వ్యక్తిత్వం అంటే ఇతరులపై ఆధిపత్యం చెలాయించడం కాదు. తన బలహీనతలను అధిగమించి, తన శక్తిని సమాజానికి ఉపయోగపడేలా మలచుకోవడం. మనిషి తనను తాను తక్కువగా భావించుకుంటూ, విధిపై భారం వేసి కూర్చుంటే అభివృద్ధి సాధ్యం కాదని ఆయన భావించారు. ఆత్మవిశ్వాసం, కృషి, ధైర్యం, నిరంతర ప్రయత్నంతోనే వ్యక్తి తన స్థాయిని పెంచుకోగలడని వివరించారు. 1915లో ప్రచురితమైన ఆయన పర్షియన్ రచన



'అస్రార్‌ఎఖుదీ' ఈ తాత్విక ఆలోచనకు ప్రధాన ఉదాహరణ.ఇక్బాల్ కవిత్వంలో యువతకు ప్రత్యేక స్థానం ఉంది. యువతను కేవలం వయసులో చిన్నవారిగా కాకుండా, కొత్త ఆలోచనలకు, సాహసానికి, మార్పుకు ప్రతీకలుగా చూశారు. యువతలోని ఉత్సాహం సరైన లక్ష్యంతో కలిసినప్పుడు సమాజం కొత్త దిశలో ప్రయాణిస్తుందని నమ్మారు. ఈ భావాన్ని వ్యక్తం చేయడానికి ఆయన తరచుగా 'షాహీన్' (డేగ) ను ప్రతీకగా ఉపయోగించారు. ఎత్తైన ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే డేగలా యువత కూడా చిన్న చిన్న ఆశలకు పరిమితం కాకుండా విశాలమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. సౌకర్యాలకు అలవాటుపడి సాహసాన్ని మరచిపోయే జీవితం కంటే సవాళ్లను ఎదుర్కొంటూ ఎదిగే జీవితమే గొప్పదని ఆయన కవిత్వం చెబుతుంది.*దేశభక్తి నుంచి విశ్వమానవ ఆలోచనల వరకు*ఇక్బాల్ సాహిత్య ప్రయాణాన్ని పరిశీలిస్తే ఆయన ఆలోచనల్లో వచ్చిన పరిణామం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రారంభ రచనల్లో భారతదేశంపై ప్రేమ, ప్రకృతి సౌందర్యం, దేశ ఐక్యత ప్రధానంగా కనిపిస్తాయి. ఆయన రచించిన 'సారే జహాఁ సే అచ్ఛా హిందోస్తాన్ హమారా' గీతం ఇప్పటికీ భారతదేశంలో ఎంతో ప్రజాదరణ పొందుతోంది. దేశభక్తిని చాటే ఈ గీతం ఒకప్పుడు భారతీయులందరిలో ఐక్యతా భావాన్ని పెంపొందించింది. పిల్లల కోసం ఆయన రాసిన 'లబ్ పే ఆతీ హై దువా బన్ కే తమన్నా మేరీ' ప్రార్థనా గీతం కూడా తరతరాలుగా పాడబడుతోంది.తరువాతి కాలంలో ఆయన ఆలోచనలు మరింత విస్తృతమైన తాత్విక, సామాజిక, ఆధ్యాత్మిక అంశాల వైపు సాగాయి. ముఖ్యంగా ముస్లిం సమాజంలో కనిపిస్తున్న నిర్లక్ష్యం, ఆలోచనారాహిత్యం, గత వైభవంపై మాత్రమే ఆధారపడే ధోరణిని ఆయన ప్రశ్నించారు. ఒకప్పుడు విజ్ఞానం, పరిశోధన, సాహిత్యం, కళలు, తత్వశాస్త్ర రంగాల్లో ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిన సమాజం తిరోగమనంలోకి వెళ్లడానికి కారణాలేమిటని విశ్లేషించారు. గతాన్ని గొప్పగా చెప్పుకోవడం మాత్రమే సరిపోదని, ఆ చరిత్ర నుంచి స్ఫూర్తి పొంది వర్తమానాన్ని మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన విమర్శ పాశ్చాత్య ప్రపంచంపై గుడ్డి వ్యతిరేకత కాదు. అక్కడి నుంచి విజ్ఞానాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని స్వీకరించాల్సిన అవసరాన్ని గుర్తిస్తూనే, పాశ్చాత్య భౌతికవాదాన్ని గుడ్డిగా అనుసరించడాన్ని ప్రశ్నించారు. తూర్పు సమాజాల్లో పేరుకుపోయిన మూఢనమ్మకాలు, జడత్వం, సంప్రదాయాల పేరుతో ఆలోచనలను అణచివేసే ధోరణిని కూడా సమర్థించలేదు. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే దాన్ని పరిశీలించే వివేచన ఉండాలని, కొత్త జ్ఞానాన్ని స్వీకరించే విశాల హృదయం అవసరమని ఆయన ఆలోచనలు స్పష్టం చేస్తాయి.*మతచింతనకు ఆధునిక దృష్టి*ఇక్బాల్‌ను కేవలం కవిగా మాత్రమే అర్థం చేసుకోవడం ఆయన వ్యక్తిత్వాన్ని పరిమితం చేయడమే అవుతుంది. మతం, తత్వశాస్త్రం, విజ్ఞానం, సమాజం మధ్య ఉన్న సంబంధాలపై ఆయన లోతుగా ఆలోచించారు. మతాన్ని కేవలం ఆచారాలు, సంప్రదాయాల సమాహారంగా కాకుండా మనిషి జీవితానికి నైతిక దిశను చూపే శక్తిగా చూశారు. విశ్వాసం మనిషిని చైతన్యవంతుడిగా, బాధ్యతాయుతుడిగా తీర్చిదిద్దాలని భావించారు.ఆయన ఆంగ్లంలో చేసిన ప్రసంగాలు 'The Reconstruction of Religious Thought in Islam' పేరుతో గ్రంథంగా వెలువడ్డాయి. ఈ రచనలో మతపరమైన ఆలోచనలను ఆధునిక కాలపు ప్రశ్నలతో అనుసంధానించే ప్రయత్నం చేశారు. విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రపంచాన్ని అర్థం చేసుకునే మనిషి దృక్పథంలోనూ మార్పులు వస్తున్నాయని గుర్తించారు. అలాంటి పరిణామాలను ఎదుర్కొనేందుకు మతచింతనలోనూ సృజనాత్మకత, పరిశీలన, పునరాలోచన అవసరమని ప్రతిపాదించారు. విశ్వాసం, హేతుబద్ధమైన ఆలోచన పరస్పర విరుద్ధమైనవిగా చూడకూడదన్నది ఆయన భావనల్లో ముఖ్యమైన అంశం. ఇక్కడే ఇక్బాల్ ప్రత్యేకత కనిపిస్తుంది. ఒకవైపు ఆధ్యాత్మిక విలువలకు ప్రాధాన్యత ఇస్తూనే, మరోవైపు మనిషి ఆలోచనా స్వేచ్ఛను సమర్థించారు. ప్రశ్నించకుండా అనుసరించడం నిజమైన జ్ఞానం కాదని, ప్రతి కాలం తన సమస్యలను తానే అర్థం చేసుకుని పరిష్కారాలను వెతుక్కోవాలని భావించారు. గతంలోని గొప్ప ఆలోచనలను గౌరవించడం అంటే వాటిని యథాతథంగా పునరావృతం చేయడం కాదు. వాటి స్ఫూర్తితో వర్తమానానికి అవసరమైన కొత్త మార్గాలను అన్వేషించడమేనని ఆయన రచనలు సూచిస్తాయి.*సాహిత్యం నుంచి సామాజిక చైతన్యం వరకు*ఇక్బాల్ రచనలు ఉర్దూ, పర్షియన్ సాహిత్యానికి కొత్త ఆలోచనా పరిమాణాలను అందించాయి. ఆయన కవిత్వంలో భావగాంభీర్యం, తాత్విక లోతు, సామాజిక స్పృహ, భాషా సౌందర్యం కలగలిసి కనిపిస్తాయి. 'బాంగ్‌ఎదరా', 'అస్రార్‌ఎఖుదీ', 'రుమూజ్‌ఎబేఖుదీ', 'పయామ్‌ఎమష్రిఖ్', 'జబూర్‌ఎఅజమ్', 'జావీద్ నామా', 'బాల్‌ఎజిబ్రీల్', 'జర్బ్‌ఎకలీమ్' ఆయన ప్రముఖ రచనలు. వీటిలో ఒక్కో గ్రంథం ఒక్కో ఆలోచనా ప్రపంచాన్ని పరిచయం చేస్తుంది.ముఖ్యంగా 'షిక్వా', 'జవాబ్ ఎషిక్వా' కవితలు ఆయన సృజనాత్మక ప్రతిభకు నిదర్శనాలు. సమాజం ఎదుర్కొంటున్న పతనాన్ని ప్రశ్నిస్తూ, ఆ పరిస్థితులకు కారణాలను ఆత్మపరిశీలన ద్వారా వెతకాలని ఈ కవితలు సూచిస్తాయి. పరిస్థితులను నిందించడం వల్ల ప్రయోజనం లేదని, మనిషి తనలోని లోపాలను గుర్తించి మార్పు దిశగా అడుగులు వేయాలని వాటి అంతరార్థం. ఒక సమాజం గత విజయాలను గుర్తుచేసుకుంటూ వర్తమాన బాధ్యతలను విస్మరిస్తే అభివృద్ధి సాధించలేదనే సందేశం ఇందులో కనిపిస్తుంది.
ఆయన కవిత్వంలో ప్రకృతి కూడా సాధారణ వర్ణనకు పరిమితం కాదు. పర్వతాలు, నదులు, ఆకాశం, పక్షులు, నక్షత్రాల వంటి ప్రకృతి దృశ్యాల ద్వారా మనిషి అంతర్గత సంఘర్షణలను, ఆశలను, స్వేచ్ఛా కాంక్షను వ్యక్తం చేశారు. స్పెయిన్‌లోని కార్డోబా మసీదును నేపథ్యంగా చేసుకుని రాసిన 'మస్జిద్‌ఎకుర్తుబా' కవిత చరిత్ర, కళ, ఆధ్యాత్మికత, కాలగమనంపై ఆయనకున్న లోతైన అవగాహనకు గొప్ప ఉదాహరణ.*రాజకీయ ఆలోచనల్లోనూ ప్రత్యేక ముద్ర*ఇక్బాల్ సాహిత్యానికే పరిమితం కాలేదు. అప్పటి భారతదేశ రాజకీయ పరిణామాలపై కూడా ఆసక్తి చూపారు. ముఖ్యంగా భారతీయ ముస్లింల సామాజిక, సాంస్కృతిక, రాజకీయ భవిష్యత్తుపై లోతుగా ఆలోచించారు. 1930 డిసెంబర్‌లో అలహాబాద్‌లో జరిగిన అఖిల భారత ముస్లిం లీగ్ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన, తన ప్రసంగంలో పంజాబ్, వాయవ్య సరిహద్దు ప్రావిన్స్, సింధ్, బలూచిస్తాన్‌లను కలిపి ఒక స్వయంప్రతిపత్తి గల రాజకీయ వ్యవస్థగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.ఇక్బాల్ 1938 ఏప్రిల్ 21న లాహోర్‌లో మరణించారు. 1947లో పాకిస్థాన్ ఏర్పడకముందే ఆయన కన్నుమూశారు. భారత ఉపఖండ చరిత్రలో ఆయనకు ఉన్న స్థానం, రాజకీయ చర్చలపై చూపిన ప్రభావం విస్మరించలేనివి.*కాలాన్ని దాటిన ఆలోచనల వారత్వం*ఇక్బాల్‌కు తూర్పు, పాశ్చాత్య ప్రపంచాల సాహిత్యం, తత్వశాస్త్రాలపై విస్తృత పరిచయం ఉండేది. మౌలానా రూమీ ఆధ్యాత్మిక కవిత్వం ఆయనను ప్రభావితం చేసింది. పాశ్చాత్య తత్వవేత్తల ఆలోచనలను కూడా అధ్యయనం చేశారు. అయితే ఎవరి భావజాలానికీ పూర్తిగా బానిస కాకుండా తనదైన ఆలోచనా మార్గాన్ని నిర్మించుకున్నారు. తూర్పు ఆధ్యాత్మికతలోని లోతును, పాశ్చాత్య ప్రపంచంలోని పరిశోధనా దృక్పథాన్ని సమన్వయం చేయాలనే ప్రయత్నం ఆయన రచనల్లో కనిపిస్తుంది.
ఆయన కవిత్వం అనేక భాషల్లోకి అనువాదమైంది. ప్రపంచవ్యాప్తంగా సాహితీవేత్తలు, తత్వవేత్తలు, పరిశోధకులు ఆయన రచనలపై అధ్యయనాలు చేశారు. పాకిస్థాన్‌లో జాతీయ కవిగా గౌరవం పొందినప్పటికీ, ఆయన సాహిత్య ప్రభావం ఒక దేశానికో, ఒక భాషకో పరిమితం కాలేదు. భారతదేశంలోనూ ఆయన రచనలకు విశేష ఆదరణ ఉంది. ముఖ్యంగా 'సారే జహాఁ సే అచ్ఛా' గీతం భారతీయుల సాంస్కృతిక జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.
నేటి సమాజానికి ఇక్బాల్ సందేశం
ఇక్బాల్ జీవితం, సాహిత్యాన్ని నేటి పరిస్థితులతో పోల్చి చూస్తే ఆయన ఆలోచనల ప్రాసంగికత మరింత స్పష్టమవుతుంది. సాంకేతికంగా ప్రపంచం ఎంతో ముందుకు వెళ్లింది. సమాచార విప్లవం మనిషికి అపారమైన అవకాశాలను అందించింది. అయినప్పటికీ ఆత్మవిశ్వాసం లోపించడం, ఆలోచనల్లో సంకుచితత్వం, ఇతరులపై ఆధారపడే మనస్తత్వం, సామాజిక బాధ్యత పట్ల నిర్లక్ష్యం వంటి సమస్యలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి.ఇలాంటి సమయంలో ఇక్బాల్ ప్రతిపాదించిన 'ఖుదీ' భావనను కొత్త కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తి తన సామర్థ్యాన్ని గుర్తించాలి. ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకోవాలి. జ్ఞానాన్ని సంపాదించాలి. తన విజయాన్ని కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకు పరిమితం చేయకుండా సమాజ అభివృద్ధికి ఉపయోగించాలి. యువతలో కలలు ఉండాలి. ఆ కలలను నిజం చేసే పట్టుదల కూడా ఉండాలి. గత వైభవాన్ని చెప్పుకోవడమే కాకుండా భవిష్యత్తును నిర్మించే ఆలోచనలను పెంచుకోవాలి.అల్లామా ఇక్బాల్ 1938లో భౌతికంగా ఈ ప్రపంచాన్ని విడిచివెళ్లినా, ఆయన ఆలోచనలు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. ఎందుకంటే ఆయన కవితలు ఒక కాలానికి చెందిన భావోద్వేగాలుగా మిగిలిపోలేదు. అవి మనిషిని తన గురించి తాను ఆలోచింపజేసే ప్రశ్నలుగా మారాయి. వ్యక్తిత్వ వికాసం, ఆత్మగౌరవం, జ్ఞానాన్వేషణ, సామాజిక చైతన్యం, మానవ విలువలు ఆయన రచనల్లో అంతర్లీనంగా కనిపిస్తాయి.మనిషి తనలోని శక్తిని గుర్తించినప్పుడే వ్యక్తిగత ఎదుగుదల మొదలవుతుంది. సమాజం తన ఆలోచనా శక్తిని మేల్కొల్పినప్పుడే దాని పురోగతికి బాటలు పడతాయి. ఈ రెండు సత్యాలను తన కవిత్వం ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన అక్షర తాత్వికుడు అల్లామా ఇక్బాల్. ఆయన జన్మదినం ఒక మహాకవిని స్మరించుకునే సందర్భం మాత్రమే కాదు, మనలోని ఆలోచనలను మేల్కొలిపి, మనిషిగా మన స్థాయిని పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేసే సందర్భం కూడా.



యం డి. ఉస్మాన్ ఖాన్
9912580645

పరిపూర్ణత

చెరిపూర్ణత


చెరుకు గడకు
తీయ్యదనాన్నిచ్చి..
పూలను ఇవ్వడం
మరిచాడు
బంగారానికి తళతళ
మెరుపులిచ్చి.
సువాసనను ఇవ్వడం
మరిచాడు
చందనానికి సువాసన
ఇచ్చి..
పువ్వు లాంటి అందం
ఇవ్వలేదు
కమలానికి అందానిచ్చి..
బురదలోనే
ఆడుకొమ్మన్నాడు
సముద్రానికి లోతునిచ్చి..
జలానికి తీపి ఇవ్వడం
మరిచాడు
నదీ జలానికి
తియ్యదనాన్ని ఇచ్చి..
నిలకడ ఇవ్వడం
మరిచాడు
వెలుగులు నింపే
సూర్యుడికి..
చల్లదనాన్ని ఇవ్వడం
మరిచాడు
చల్లదనాన్నిచ్చే
చందమామకు..
వెలుగులు నింపే శక్తిని
దూరం చేశాడు
మనిషి కూడా అంతే
కదా..
ఒకటి ఉంటే మరొకటి
ఉండదు
ఏ వ్యక్తికి పరిపూర్ణత
ఇవ్వలేదు
నీ బలహీనతలను
గమనించు..
బలాలుగా మార్చడానికి
ప్రయత్నించు
ఏదో ఒక రోజు 'ఫర్‌ఫెక్ట్'
కాకపోయినా..
'ఎక్స్‌ట్రార్డినరీ' వ్యక్తిగా
పేరు పొందగలవు !



మధుసూదన్ రెడ్డి
9949700037

పండుగల వెనుక పరమార్థం ఏది?

భారతీయ సంస్కృతిలో పండుగలకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే మన దేశంలో ప్రతి పండుగ వెనుక ఒక చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక సందేశం, సామాజిక ప్రయోజనం దాగి ఉంటాయి. కుటుంబ సభ్యులందరినీ ఒకచోట చేర్చడం, బంధుమిత్రుల మధ్య ఆత్మీయతను పెంపొందించడం, సమాజంలో సంతోషాన్ని పంచడం పండుగల ప్రధాన ఉద్దేశం. అయితే నేటి ఆధునిక జీవనశైలిలో పండుగల రూపురేఖలు మారిపోతున్నాయి. ఒకప్పుడు సంప్రదాయాలకు, కుటుంబ అనుబంధాలకు ప్రతీకలుగా నిలిచిన పండుగలు ఇప్పుడు ఆడంబరాలకు, ఖర్చులకు, వాణిజ్య ప్రకటనలకు వేదికలుగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అసలు పండుగల వెనుక ఉన్న పరమార్థం ఏమిటి? వాటి అసలైన పండుగతనం ఎక్కడికి పోతోంది?దీపావళి, దసరా, సంక్రాంతి, ఉగాది, వినాయక చవితి, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్.. ఇలా ప్రతి పండుగకు ప్రత్యేకత ఉంది. ఒక్కో పండుగ ఒక్కో సందేశాన్ని అందిస్తుంది. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీకగా నిలిస్తే, చీకటిపై వెలుగుల విజయాన్ని దీపావళి చాటుతుంది. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని సంక్రాంతి గుర్తుచేస్తుంది. తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధన, మహిళల సామూహిక సృజనాత్మకతకు బతుకమ్మ పండుగ అద్దం పడుతుంది. పండుగలు కేవలం ఆచార వ్యవహారాలు మాత్రమే కావు. అవి తరతరాలుగా కొనసాగుతున్న మన సాంస్కృతిక వారసత్వానికి జీవనాధారాలు.గతంలో పండుగ వచ్చిందంటే ఇళ్లలో సందడే సందడి. పది రోజుల ముందు నుంచే ఇంటిని శుభ్రం చేసుకోవడం, పిండి వంటలు తయారు చేయడం, కొత్త బట్టలు కొనుక్కోవడం, బంధువులను ఆహ్వానించడం వంటి కార్యక్రమాలతో కుటుంబ సభ్యులంతా కలిసి పనిచేసేవారు. ఆర్థిక స్థోమతకు అనుగుణంగా పండుగను జరుపుకునేవారు. పక్కింటివారికి పిండివంటలు పంచడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం వంటి సంప్రదాయాలు సామాజిక బంధాలను బలోపేతం చేసేవి. పండుగ అనేది ఒకరి ఇంటికే పరిమితమయ్యే వేడుక కాదు.. ఊరంతా కలిసి జరుపుకునే సామూహిక సంబరం.కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. పండుగలంటే ముందుగా షాపింగ్, ఖరీదైన దుస్తులు, ఆభరణాలు, విలాసవంతమైన విందులు గుర్తుకొస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో తమ పండుగ వేడుకలు ఇతరులకంటే ఘనంగా కనిపించాలనే పోటీ పెరుగుతోంది. పండుగల పేరుతో వస్త్ర దుకాణాలు, ఆభరణాల సంస్థలు, ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు భారీ ప్రకటనలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ప్రత్యేక రాయితీలు, బహుమతులు, ఆకర్షణీయమైన ఆఫర్లతో కొనుగోళ్లకు ప్రోత్సహిస్తున్నాయి. కొనుగోలు చేయడం తప్పు కాదు. పండుగల సమయంలో వ్యాపారాలు పెరగడం, చేతివృత్తుల వారికి ఉపాధి లభించడం కూడా అవసరమే. అయితే కొనుగోలు శక్తి, ఖర్చు చేసే సామర్థ్యమే పండుగ ఆనందానికి కొలమానంగా మారడం ఆందోళనకరం.మరోవైపు పండుగల పేరుతో సామాజిక హోదాను ప్రదర్శించాలనే ధోరణి పెరుగుతోంది. ఖరీదైన అలంకరణలు, భారీ విందులు, ఆడంబరమైన వేడుకల కోసం అప్పులు చేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. పక్కవారి ఇంట్లో ఎంత ఘనంగా పండుగ జరుపుకున్నారో చూసి తామూ అంతకంటే ఎక్కువగా ఖర్చు చేయాలనే అనవసరమైన పోటీ మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోపుతోంది. పండుగ సంతోషాన్ని ఇవ్వాలి కానీ కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టకూడదు. మన ఆర్థిక పరిస్థితికి తగినట్లుగా జరుపుకున్నప్పుడే పండుగ నిజమైన ఆనందాన్ని అందిస్తుంది. పండుగల నిర్వహణలో పర్యావరణ పరిరక్షణను కూడా విస్మరించలేం. దీపావళి సమయంలో అధిక శబ్దం, వాయు కాలుష్యానికి కారణమయ్యే బాణసంచా వినియోగం, వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలు, రసాయన రంగుల వినియోగం, నిమజ్జనాల వల్ల నీటి కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. బతుకమ్మ పండుగలో సహజమైన పూల వినియోగం మన సంప్రదాయంలో భాగం. అయితే పండుగల నిర్వహణలో ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల నిర్వహణపై తగిన శ్రద్ధ చూపకపోతే ప్రకృతికి హాని కలుగుతుంది. ప్రకృతిని ఆరాధించే పండుగలు ప్రకృతికే ముప్పుగా మారకూడదు.పండుగల అసలు ఉద్దేశం మానవ సంబంధాలను బలోపేతం చేయడమే. కానీ ఉద్యోగాలు, వ్యాపారాలు, వలసల కారణంగా కుటుంబ సభ్యులు ఒకచోట చేరే అవకాశాలు తగ్గుతున్నాయి. ఒకే ఇంట్లో ఉన్నవారు కూడా సెల్‌ఫోన్లలో మునిగిపోతూ పక్కనున్న మనుషులతో మాట్లాడటానికి సమయం కేటాయించలేకపోతున్నారు. పండుగ శుభాకాంక్షలు కూడా వ్యక్తిగతంగా పలకడం కంటే సామూహిక సందేశాలకే పరిమితమవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంలో తప్పులేదు. అయితే అది మనుషుల మధ్య ప్రత్యక్ష అనుబంధాలను భర్తీ చేయకూడదు.ముఖ్యంగా యువతకు పండుగల వెనుక ఉన్న సాంస్కృతిక, చారిత్రక విలువలను తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలపై ఉంది. పండుగ ఎందుకు జరుపుకుంటాం? దాని వెనుక ఉన్న సందేశం ఏమిటి? మన సంప్రదాయాలు సమాజానికి ఏం నేర్పుతున్నాయి? అనే విషయాలను పిల్లలకు వివరించాలి. కేవలం కొత్త దుస్తులు ధరించడం, విందులు చేసుకోవడం, వినోద కార్యక్రమాల్లో పాల్గొనడమే పండుగ కాదని తెలియజేయాలి. పేదలకు సహాయం చేయడం, వృద్ధులను పలకరించడం, అనాథలకు అండగా నిలవడం, పొరుగువారితో సంతోషాన్ని పంచుకోవడం వంటి పనుల ద్వారా పండుగల పరమార్థాన్ని ఆచరణలో చూపాలి.అలాగే పండుగల సందర్భంగా స్థానిక కళాకారులు, కుమ్మరులు, నేత కార్మికులు, చేతివృత్తుల వారికి ప్రోత్సాహం అందించాలి. సంప్రదాయ వస్తువులు, స్థానిక ఉత్పత్తులు కొనుగోలు చేయడం ద్వారా వారి జీవనోపాధికి తోడ్పడవచ్చు. మన సంస్కృతిని కాపాడటం అంటే కేవలం ఆచారాలను కొనసాగించడం మాత్రమే కాదు.. వాటితో ముడిపడిన కళలను, వృత్తులను, జీవన విధానాలను కూడా పరిరక్షించడం.కాలం మారుతున్న కొద్దీ పండుగల నిర్వహణలో మార్పులు రావడం సహజం. ఆధునికతను వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. అయితే ఆధునికత పేరుతో మన సంస్కృతికి మూలమైన విలువలను కోల్పోకూడదు. ఆడంబరాల కంటే ఆత్మీయతకు, ఖర్చుల కంటే సంతోషానికి, పోటీతత్వం కంటే పరస్పర సహకారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పండుగల పేరుతో ప్రకృతిని కలుషితం చేయకుండా, సమాజంలో అసమానతలను పెంచకుండా, అందరినీ కలుపుకొని వేడుకలు జరుపుకోవాలి.



తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి
9948439565



జాతీయం-అంతర్జాతీయం



ఇరాన్ చమురు ఆరోపణలపై భారత దంపతులకు, 9 కంపెనీలకు

2014లో దంపతులు డొమినికా సముద్ర జెండా ప్రాధికార సంస్థగా కనిపించేందుకు ప్రయత్నించగా, 2023లో శర్మ సింగపూర్‌లో సంబంధిత కంపెనీని స్థాపించినట్లు నివేదిక తెలిపింది

వాషింగ్టన్ నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షలను తప్పించుకుని చమురు వ్యాపారం కొనసాగించేందుకు సహకరించారనే ఆరోపణలపై అమెరికా ప్రభుత్వం భారత వ్యాపారి, ఆయన భార్య, భారత్‌కు చెందిన 9 కంపెనీలపై ఆంక్షలు విధించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారికి ఆంక్షల పరిధిలో ఉన్న ఇరాన్ చమురు వ్యాపారాన్ని కొనసాగించేందుకు సాయం చేసినట్లు పేర్కొన్నారు. ఈ చర్యతో భారతీయ దంపతులు, సంబంధిత కంపెనీలు అమెరికా ఆంక్షల ప్రకటనలో నేరుగా ప్రస్తావనకు వచ్చాయి. ఆంక్షలకు గురైన సంస్థల పేర్లు మూల సమాచారంలో వెల్లడించలేదు. అమెరికా ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకారం, మొత్తం వ్యవస్థ సముద్ర మోసాల ద్వారా ఇరాన్‌కు ఆంక్షలు విధించిన చమురును విక్రయించడంలో సహాయపడుతోంది. మంత్రిత్వశాఖ ఈ వ్యవస్థను పెద్ద నేర నెట్‌వర్క్‌గా అభివర్ణించింది. సముద్ర రిజిస్ట్రేషన్లు, జెండాలకు సంబంధించిన ధ్రువపత్రాల్లో మోసపూరిత పద్ధతులు ఉపయోగించి చమురు రవాణా చేసే నౌకలు అంతర్జాతీయ ఆంక్షలు ఉన్నప్పటికీ తమ కార్యకలాపాలు కొనసాగించేలా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సముద్ర సేవల పేరుతో రూపొందించిన పత్రాలు, నమోదు వివరాలే ఈ విధానానికి ప్రధాన ఆధారంగా ఉన్నట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. సునీల్ కుమార్ శర్మ, ఆయన భార్య జస్ప్రీత్ ప్రీతి షాహిద్ ఈ నెట్‌వర్క్‌ను నడిపినట్లు అమెరికా ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇద్దరూ పలు దేశాల సముద్ర పరిపాలనా అధికారుల గుర్తింపును దుర్వినియోగం చేసి నకిలీ సముద్ర రిజిస్ట్రేషన్లు సిద్ధం చేయించారని ఆరోపించింది. ఆ నకిలీ పత్రాల ఉద్దేశం ఇరాన్ చమురును మోసుకెళ్లే నౌకలకు అంతర్జాతీయ ఆంక్షల మధ్య కూడా కార్యకలాపాలు కొనసాగించే వీలు కల్పించడమేనని

'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' ద్వారా ఇరాన్ చమురు ఆదాయాన్ని అడ్డుకోవడం అమెరికా లక్ష్యం



వివరించింది. దంపతులపై ఉన్న ఆరోపణలు ఇంకా ఆరోపణలుగానే ఉన్నాయని ప్రకటన స్పష్టం చేస్తోంది. నెట్‌వర్క్‌కు అనుబంధంగా రూపొందించిన వెబ్‌సైట్లు పలు దేశాల తరపున నౌకల నమోదు, సముద్ర జెండా అందజేత, నావికులకు శిక్షణ, నౌకల వర్గీకరణ వంటి సేవలను అందిస్తున్నట్లు చూపించేవి. అయితే ఆ సేవలకు సంబంధిత దేశాలు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని నివేదిక పేర్కొంది. అనుమతి లేకుండానే అధికారిక సముద్ర సంస్థల మాదిరిగా కనిపించే సేవలను ప్రచారం చేయడం మోసపూరిత విధానంలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంది. దీంతో రిజిస్ట్రేషన్, జెండా ధ్రువపత్రాలు, శిక్షణ, వర్గీకరణ అన్నీ ఒకే వ్యవస్థలో కలిసినట్లు అమెరికా ప్రకటన వివరించింది. ఈ మోసపూరిత వ్యవస్థ ప్రారంభం 2014 నుంచే ఉన్నట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. ఆ సమయంలో దంపతులు కరీబియన్ దేశమైన డొమినికా సముద్ర జెండా ప్రాధికార సంస్థగా తమను తాము చూపించుకునేందుకు ప్రయత్నించారని ఆరోపణలు వచ్చాయి. డొమినికా పేరు, దాని సముద్ర జెండా వ్యవస్థను ఉపయోగించడం ద్వారా నౌకల నమోదు సేవలపై అధికారికత భావన కల్పించేందుకు ప్రయత్నించినట్లు వివరించారు. అయితే ఆ దశలో జరిగినట్లు చెప్పిన చర్యలకు సంబంధించిన మరిన్ని వివరాలు మూల నివేదికలో ఇవ్వలేదు. 2023లో సునీల్ కుమార్ శర్మ సింగపూర్‌లో 'ఎస్పాతిని మారిటైమ్ అఫైర్స్ అండ్ ఇంటర్నేషనల్ షిప్ రిజిస్ట్రీ పీటీఈ లిమిటెడ్' పేరుతో ఒక కంపెనీ స్థాపించారు. ఎస్పాతిని అధికారులు ఈ సంస్థతో తమ సంబంధాన్ని బహిరంగంగా ఖండించినట్లు అమెరికా ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. అధికారుల నిరాకరణ ఉన్నప్పటికీ, ఆ సంస్థ ఇరాన్ చమురును మోసుకెళ్లే నౌకలకు నమోదు సేవలు అందించడం కొనసాగించినట్లు ఆరోపించింది. సంస్థ స్థాపన, అధికారుల ఖండన, సేవల కొనసాగింపు వరుసగా చోటుచేసుకున్న కీలక పరిణామాలుగా నివేదికలో నమోదయ్యాయి. అమెరికా పరిపాలన ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్'లో భాగంగా ఈ చర్య తీసుకుంది. ఈ ప్రచారం లక్ష్యం ఇరాన్ చమురు విక్రయాలు, ఇతర ఆర్థిక కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయాన్ని అడ్డుకోవడమేనని అమెరికా ప్రభుత్వం తెలిపింది. అందువల్ల ఆంక్షలు వ్యక్తులు, కంపెనీలపై మాత్రమే కాకుండా ఇరాన్ చమురు వాణిజ్యానికి తోడ్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సముద్ర సేవల వ్యవస్థపైనా దృష్టి పెట్టాయి. ఆర్థిక ఒత్తిడి ద్వారా ఇరాన్‌కు చేరే చమురు ఆదాయాన్ని నిరోధించాలన్నదే ప్రకటిత ఉద్దేశంగా ఉంది. అమెరికా ఆర్థిక మంత్రిత్వశాఖ వివరాల ప్రకారం, సునీల్ కుమార్ శర్మ, జస్ప్రీత్ ప్రీతి షాహిద్ చండీగఢ్ నుంచి ఈ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నారు. పలు దేశాల అధికారుల గుర్తింపును వినియోగించడం, నకిలీ రిజిస్ట్రేషన్లు సిద్ధం చేయడం, అధికారిక అనుమతి లేని సేవలను వెబ్‌సైట్ల ద్వారా ప్రచారం చేయడం వంటి చర్యల సమాహారమే దర్యాప్తులో కనిపించిన విధానంగా పేర్కొంది. ఆరోపణల ప్రకారం ఈ వ్యవస్థ ఇరాన్ చమురు రవాణా చేసే నౌకలకు పత్రాలు, నమోదు సేవల రూపంలో సహకారం అందించింది. ఈ వివరాల ఆధారంగానే అమెరికా ప్రభుత్వం ఆంక్షల చర్యను ప్రకటించింది.

వాన్స్ యుద్ధంపై

ప్రచార సమయంలో పదేపదే చెప్పడంతో వాన్స్ వైఖరి అధ్యక్షుడి వైఖరికి భిన్నంగా నిలిచింది. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలోనూ ట్రంప్ అదే వాదనను ఇంటర్వ్యూల్లో కొనసాగించారు. ఈ ఏడాది యుద్ధానికి వెళ్లాలన్న నిర్ణయం 'చాలా తెలివైనది' అని మంగళవారం రాత్రి న్యూయార్క్ టైమ్స్‌కు చెప్పారు. పొలిటికోతో మాట్లాడుతూ అది 'పూర్తిగా సరైన నిర్ణయం' అని పేర్కొన్నారు.




వాషింగ్టన్‌లో నవంబర్ 4, 2026న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ యుద్ధంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరి నుంచి బహిరంగంగా దూరమయ్యారు. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి భారీ నష్టం ఎదురైన నేపథ్యంలో వాన్స్ ఈ ప్రకటన చేశారు. అధ్యక్షుడి విధానాన్ని ఓటర్లు స్పష్టంగా తిరస్కరించిన పరిస్థితిలో తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ప్రశ్నల నుంచి దూరంగా నిలవడమే ఆయన ప్రయత్నంగా కనిపించింది. 2028లో అధ్యక్ష పదవికి పోటీ చేయాలా వద్దా అన్నది ఎన్నికల తర్వాత నిర్ణయిస్తానని వాన్స్ గతంలో చెప్పారు. ఇరాన్‌తో జరిగిన ప్రజాదరణ కోల్పోయిన యుద్ధమే రిపబ్లికన్ల ఘోర పరాజయానికి కారణమని ఆయన సామాజిక మాధ్యమంలో సుదీర్ఘ ప్రకటనలో పేర్కొన్నారు. 'యుద్ధం విలువైనదని, వచ్చే ఆరు సంవత్సరాలు సెనెట్‌ను కోల్పోవడం కూడా విలువైనదని మీరు వాదించాలనుకుంటే అలా చేయండి' అని వాన్స్ అన్నారు. ఇరాన్ యుద్ధం రిపబ్లికన్లను ఓటమి వైపు నెట్టిందని వాన్స్ అభిప్రాయపడ్డారు. సాధ్యమైన 2028 అధ్యక్ష ఎన్నికల పోటీకి ముందు యుద్ధం నుంచి తనను తాను వేరుచేసుకునే ప్రయత్నం ఆయన ప్రకటనలో స్పష్టమైంది. అయితే యుద్ధం విలువైనదేనని ట్రంప్

వాన్స్ ప్రకటనపై నవంబర్ 4, 2026న వ్యాఖ్య కోరినప్పటికీ వైట్‌హౌస్ వెంటనే స్పందించలేదు. అమెరికా విదేశీ సైనిక జోక్యాల్లో నియంత్రణ పాటించాలని చాలాకాలంగా వాన్స్ వాదిస్తున్నారు. ఇరాక్‌లో సేవలందించిన మాజీ మెరైన్‌గా ఆయన గతంలోని 'అంతులేని ఘర్షణలకు' సైన్యాన్ని పంపకూడదని ట్రంప్ ప్రభుత్వం చెప్పాలని గతంలో పేర్కొన్నారు. అయినప్పటికీ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధాన్ని ప్రారంభించిన తర్వాత వాన్స్ దానికి గట్టిగా మద్దతు ఇవ్వలేదు. పోరాటాన్ని ముగించేందుకు విఫలమైన ప్రయత్నానికి ఆయన ముఖచిత్రంగా కూడా నిలిచారు. అసోసియేటెడ్ ప్రెస్ ఓటరు సర్వే ప్రకారం, అమెరికాలోని లక్షకు పైగా ఓటర్లలో సుమారు పది మందిలో ఆరుగురు ఇరాన్‌పై సైనిక చర్య తీసుకోవడం 'తప్పు నిర్ణయం' అని చెప్పారు. యుద్ధంపై అసంతృప్తి వ్యక్తం చేసిన వారిలో ఎక్కువ మంది ప్రతినిధుల సభ ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. అయితే చాలా మంది ఓటర్లకు ఇరాన్ యుద్ధం ప్రధాన ఎన్నికల అంశం కాలేదని సర్వే సూచించింది. కాంగ్రెస్ ఎన్నికల్లో తమ ఓటుపై యుద్ధం కీలకమని సుమారు మూడో వంతు మంది మాత్రమే చెప్పారు. జీవన వ్యయం లేదా ప్రభుత్వ అవినీతి గురించి అలా చెప్పిన వారు దాదాపు సగం ఉన్నారు. ప్రతినిధుల సభలో డెమోక్రటిక్ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన దాదాపు ప్రతి ఓటరూ ఇరాన్‌తో యుద్ధానికి వెళ్లడం తప్పు అని పేర్కొనగా, రిపబ్లికన్ అభ్యర్థికి మద్దతు ఇచ్చిన పది మందిలో సుమారు ఎనిమిది మంది అది సరైన నిర్ణయమని చెప్పారు. నవంబర్ 2026 మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు సెనెట్, ప్రతినిధుల సభపై పూర్తి నియంత్రణ సాధించారు.

వ్యయ కోతలు, విద్యా సంక్షోభం నిరసనలకు కారణం

ఫ్రాన్స్‌లో సమ్మెతో వీధుల్లోకి నిరసనకారులు

ఆసుపత్రులు, విమాన నియంత్రణ, తపాలా, విద్య, రైల్వే సిబ్బంది సమ్మెలో చేరే అవకాశం



ఫ్రాన్స్‌లో గురువారం ఉదయం సమ్మెకు మద్దతుగా మార్సెయి, గ్రెనోబుల్, లియోన్ సహా నగరాల్లో వీధి ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా వందల వేల మంది ప్రదర్శనల్లో కదం తొక్కుతారని కార్మిక సంఘాలు అంచనా వేశాయి. ఆసుపత్రి సిబ్బంది, వైమానిక రాకపోకల నియంత్రణ ఉద్యోగులు, తపాలా సిబ్బంది, ఉపాధ్యాయులు, రైల్వే ఉద్యోగులు కూడా సమ్మెలో చేరే అవకాశం ఉందని సంఘాలు తెలిపాయి. ఫ్రాన్స్ అంతటా 70,000 మంది పోలీసులను మోహరించారు. మార్సెయి, గ్రెనోబుల్, లియోన్ నగరాల్లో ప్రదర్శనలు సాగుతుండగా భద్రతా బలగాల భారీ ఏర్పాటుపై హక్కుల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్ పదవీకాలం చివరి నెలల్లో దేశీయ సంక్షోభాలు మరింత ముదిరాయి. జీవన వ్యయం పెరగడం, ప్రభుత్వ వ్యయ కోతలు, బలహీన విద్యా వ్యవస్థపై నిరసనలు వారానికొకసారి కొనసాగుతున్నాయి. బోధనా పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆరోపిస్తూ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనల్లోకి కార్మికులు చేరారు. విభజిత పార్లమెంటులో ఖర్చు తగ్గించే బడ్జెట్‌ను ఆమోదింపజేయడానికి ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. ఆర్థిక ఉత్పత్తిలో ప్రభుత్వ రుణం 120 శాతానికి చేరువైంది. గురువారం సమ్మెకు ముందు దేశంలోని నాలుగు ప్రధాన రైల్వే సంఘాలు ప్రభుత్వ ప్రతిపాదిత బడ్జెట్ కోతలను తీవ్రంగా విమర్శించాయి. ఆ కోతలు పేదరికాన్ని పెంచుతాయని, సామాజిక భద్రతను తగ్గిస్తాయని, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను స్తంభింపజేస్తాయని, పర్యావరణ చర్యలకు అవసరమైన పెట్టుబడులను ఎండగడతాయని సంఘాలు పేర్కొన్నాయి. జీవన వ్యయం, ప్రభుత్వ వ్యయ కోతలు, విద్యా సంక్షోభం చుట్టూ నిరసనలు మళ్లీ ఉధృతమయ్యాయి. ఉన్నత పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలోని తరగతులు, శిథిలమైన భవనాలను వ్యతిరేకిస్తూ పాఠశాలల దిగ్బంధనాన్ని కొనసాగించారు. కొన్ని తరగతుల పరిమాణాన్ని పరిమితం చేయడం, పాఠశాలల మరమ్మతులకు ప్రాంతీయ అధికారులకు రుణ నిధులు ఇవ్వడం సరిపోదని వారు అన్నారు. గురువారం 81 ఉన్నత పాఠశాలలు ప్రభావితమయ్యాయని ప్రభుత్వం చెప్పగా, విద్యార్థి సంఘాలు ఆ సంఖ్య 1,000 అని తెలిపాయి.

పారిస్‌లో గురువారం తెల్లవారుజామున పలు పాఠశాలల వద్ద అడ్డంకులు ఏర్పాటు చేయకుండా పోలీసులు విద్యార్థులను నిలిపివేశారు. మారే జిల్లాలోని ర్యూ దె రివోలీపై పాఠశాలల దిగ్బంధనానికి అనుమతి లభించని విద్యార్థులు ఆకస్మిక వీధి నిరసనలకు దిగారు. ఆ ప్రాంతంలో అల్లర్ల నిరోధక పోలీసులు మోహరించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఫ్యాకల్టీలను దిగ్బంధించారు. ఉన్నత విద్యా సంస్థలలో మూడో వంతు ప్రభావితమయ్యాయని ప్రభుత్వం తెలిపింది. రాజకీయంగా భిన్నమైన కార్మిక సంఘాలు జీవన వ్యయం పెరుగుదలపై సమ్మెలకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయ సంఘాలు కూడా సమ్మెలో చేరాయి. వచ్చే వసంతకాలంలో మాక్రోన్ స్థానాన్ని భర్తీ చేసే 2027 అధ్యక్ష ఎన్నికల కోసం వలస వ్యతిరేక, తీవ్ర కుడిపక్ష అభ్యర్థి మెరిన్ లె పెన్‌కు ప్రజాభిప్రాయ సర్వేల్లో అధిక మద్దతు కనిపిస్తోంది. ప్రదర్శన హక్కును అణచివేసేందుకు మాక్రోన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హక్కుల సంఘాలు ఆరోపించాయి. నగర కేంద్రాల్లో ప్రదర్శనలపై ఆంక్షలు, కొన్ని ప్రాంతాల్లో రాత్రి కర్ఫ్యూలు విధించడాన్ని ఫ్రెంచ్ మానవ హక్కుల లీగ్ విమర్శించింది. సీజీటీ సంఘం నాయకురాలు సోఫీ బినే దీనిని అత్యంత తీవ్రమైన, ప్రమాదకరమైన అధికారవాద మలుపుగా అభివర్ణించారు. సీజీఎఫ్‌డీటీ నాయకురాలు మేరిలీజ్ లియోన్ ప్రదర్శనకు



కనిపించడమే దాని ప్రాథమిక సూత్రమని అన్నారు. జాతీయ రైల్వే సంస్థ ఎస్ఎన్‌సీఎఫ్ ప్రాంతీయ మార్గాలు, ప్యారిస్ మహానగర పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రైలు సేవలకు అంతరాయం ఉంటుందని తెలిపింది. ఫ్రాన్స్ రేవుల్లోనూ అంతరాయం ఉంటుందని డాక్ కార్మికులు చెప్పారు. నర్సరీ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల్లో దాదాపు 18 శాతం సమ్మెలో పాల్గొంటారని విద్యా మంత్రిత్వ శాఖ అంచనా వేసింది; మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయులు కూడా చేరుతారని కార్మిక సంఘాలు తెలిపాయి.

20 విమానాలకు బాంబు బెదిరింపుల ప్రభావం

ఎఫ్రూ, ప్లావ్డివ్, వియన్నాకు కొన్ని విమానాలు మళ్లింపు

యూరప్‌లో వాణిజ్య విమానాలకు బాంబు బెదిరింపులు రావడంతో మొత్తం 20 విమానాలు ప్రభావితమైనట్లు ఉదయం వెల్లడైంది. కొన్ని విమానాలను ప్రత్యామ్నాయ విమానాశ్రయాలకు మళ్లించగా, మరికొన్ని తమ నిర్ణీత మార్గాల్లోనే కొనసాగాయి. డబ్లిన్ నుంచి రోమ్‌కు వెళ్తున్న ఏర్ లింగస్ విమానం ఫ్రాన్స్‌లోని ఎఫ్రూకు మళ్లింది. మాడ్రిడ్-సోఫియా ర్యాన్‌ఏయిర్ విమానం సంఖ్య ఎఫ్ఆర్6410 సమయం 9:55 నుంచి 10:25 మధ్య నమోదైంది. కోపెన్‌హేగన్-సోఫియా ర్యాన్‌ఏయిర్ విమానం ఎఫ్ఆర్3606 సమయం 10:45గా నమోదైంది. లండన్ స్టాన్‌స్టెడ్ నుంచి సోఫియాకు వెళ్తున్న ర్యాన్‌ఏయిర్ విమానం ఎఫ్ఆర్1730ను బల్గేరియాలోని ప్లావ్డివ్‌కు మళ్లించారు. వార్సా-బ్రస్సెల్స్ మార్గంలోని ఎల్ఓ235 విమానం సమయం 10:48గా నమోదైంది.

మిలాన్ మాల్పెన్సా నుంచి వార్సా-ఒకెంచీకి వెళ్తున్న విజ్ఎయిర్ విమానం వ్46387ను ఆస్ట్రియాలోని వియన్నాకు మళ్లించారు. హెల్సింకి నుంచి రోమ్ ఫ్యూమిచినోకు వెళ్తున్న ఫిన్‌ఎయిర్ విమానం ఏవై1761, హెల్సింకి-వియన్నా విమానం ఏవై1471 కూడా జాబితాలో ఉన్నాయి. గ్లాస్గో, న్యూకాసిల్ నుంచి ప్రాగ్‌కు వెళ్లిన ఈజీజెట్ విమానాలు ఉ23179, ఉ25629; డబ్లిన్-ప్రాగ్ ర్యాన్‌ఏయిర్ ఎఫ్ఆర్7326; ఏథెన్స్-ప్రాగ్ స్కై ఎక్స్‌ప్రెస్ జీక్యూ750 విమానాలు వరుసగా 11:16 నుంచి 17:00 మధ్య నమోదయ్యాయి. మిలాన్ మాల్పెన్సా-బుకారెస్ట్ విజ్ఎయిర్ వ్43064, థెస్సలోనికి-మిలాన్ మాల్పెన్సా ఏజియన్ అ3552, పోర్టో-మిలాన్ మాల్పెన్సా ర్యాన్‌ఏయిర్ ఎఫ్ఆర్8953 విమానాలు కూడా ప్రభావిత జాబితాలో ఉన్నాయి. మిలాన్-మాడ్రిడ్, రోమ్-మాడ్రిడ్ ఐబీరియా విమానాలు ఐబీఈ668, ఐబీఈ658 సమయం 15:33గా నమోదైంది. మాడ్రిడ్-పారిస్ ఎయిర్ యూరోపా యూఎక్స్1027, బెల్‌గ్రేడ్-బుకారెస్ట్ ఎయిర్ సెర్బియా జేయూ102, ఏథెన్స్-వియన్నా ఏజియన్ అ3860 కూడా జాబితాలో ఉన్నాయి. చివరి లెక్కను సెంట్రల్ యూరోపియన్ సమయం 17:02కు సవీకరించారు.

ఎన్నికల ఓటమి తర్వాత హెగ్సెత్‌పై ట్రంప్ కఠిన నిర్ణయం పరిశీలన

ఇరాన్ యుద్ధంపై పార్టీ అంతర్గత విమర్శల మధ్య ట్రంప్ సలహాదారుల అభిప్రాయాలు కోరారు; డీసాంటిస్‌కు సెనేట్ ఆమోదం లభించవచ్చని నివేదిక పేర్కొంది



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మంత్రివర్గంలో భారీ మార్పులకు సిద్ధమవుతున్నట్లు నివేదికలు తెలిపాయి. రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌ను పదవి నుంచి తొలగించే అంశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ చర్యపై తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు. సీబీఎస్ న్యూస్ నివేదిక ప్రకారం, రిపబ్లికన్ పార్టీ ఓటమికి ప్రధాన కారణాల్లో ఇరాన్ యుద్ధం ఒకటిగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. యుద్ధంపై ప్రజల్లో, పార్టీ అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిఫలించిందని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రిత్వ శాఖ నాయకత్వంపై చర్చ వేడెక్కింది. ట్రంప్ తన సన్నిహిత సలహాదారులతో ఫోన్‌లో మాట్లాడినప్పుడు హెగ్సెత్ భవిష్యత్తు అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. సలహాదారుల అభిప్రాయాలను ఆయన కోరినట్లు నివేదిక తెలిపింది. చర్చలు కొనసాగుతున్నప్పటికీ, హెగ్సెత్‌ను తొలగించే నిర్ణయం ఖరారైందని చెప్పడానికి ఆధారం లేదు. మంత్రివర్గ మార్పులకే పరిమితం కాకుండా, ఎన్నికల ఫలితాల తర్వాత అమెరికా సైన్యంలోని ఉన్నతాధికారులపైనా ఒత్తిడి పెరగవచ్చని వైట్‌హౌస్ అధికారులు భావిస్తున్నారు. ఇరాన్ యుద్ధంపై తమ సలహాదారు పాత్రకు సంబంధించి సైనిక నేతలు కాంగ్రెస్, ప్రజల నుంచి కఠిన ప్రశ్నలు ఎదుర్కొనే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కేన్ పేర్లు ఈ సందర్భంలో ప్రస్తావనకు వచ్చాయి. యుద్ధానికి సంబంధించిన విధాన నిర్ణయాల్లో వారి సలహాలపై పార్లమెంటరీ పరిశీలన పెరగవచ్చని సమాచారం. ఈ ఇద్దరిపై చర్య తీసుకున్నట్లు మాత్రం నివేదిక చెప్పలేదు. ఇరాన్ యుద్ధంపై రిపబ్లికన్ పార్టీలోనే విభేదాలు బయటపడ్డాయి. మధ్యంతర ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా యుద్ధాన్నే పరాజయానికి కారణంగా పేర్కొన్నారు. సామాజిక మాధ్యమంలో ఆయన చేసిన పోస్టులో, తమ ఓటమికి యుద్ధమే కారణమని రాశారు. హెగ్సెత్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశమున్న పేర్లపై కూడా చర్చ మొదలైంది. మరో నివేదిక ప్రకారం, ఫ్లోరిడా గవర్నర్ రోన డీసాంటిస్ సంభావ్య అభ్యర్థుల్లో ఉన్నారు. డీసాంటిస్ పేరుకు సెనేట్ ఆమోదం లభించే అవకాశం ఉందని అంచనా వ్యక్తమవుతోంది. డీసాంటిస్ జనవరి 5న గవర్నర్ పదవిని విడిచిపెట్టనున్నారు. ఆయన గవర్నర్ పదవీకాలం ముగిసిన తర్వాత రక్షణ శాఖ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఇది అమలైన నియామకం కాదు; పెంటగాన్‌లో సంభావ్య మార్పులపై జరుగుతున్న చర్చల్లో భాగమైన అంచనా మాత్రమే. అయితే హెగ్సెత్‌ను తొలగించే ఉద్దేశం లేదని ట్రంప్ విలేకరుల ప్రశ్నలకు సమాధానమిస్తూ చెప్పారు. హెగ్సెత్ టెన్నెసీలో ఖాళీగా ఉన్న సెనేట్ స్థానాన్ని భర్తీ చేసేందుకు సెనేట్‌కు వెళ్లగలరా అని అడిగినప్పుడు, అలా చేస్తే ఆయనకు మంచి ప్రజాదరణ లభించవచ్చని ట్రంప్ అన్నారు. హెగ్సెత్‌ను రక్షణ మంత్రి పదవి నుంచి తప్పిస్తారా లేదా అనే విషయాన్ని ట్రంప్ స్పష్టంగా చెప్పలేదు. మరోవైపు రక్షణ మంత్రి పదవికి ముప్పు ఉందన్న ఊహాగానాలను వైట్‌హౌస్ తోసిపుచ్చింది. అధ్యక్షుడికి మంత్రి హెగ్సెత్‌పై పూర్తి నమ్మకం ఉందని వైట్‌హౌస్ అధికార ప్రతినిధి అన్నా కెల్లీ అధికారిక ప్రకటనలో తెలిపారు. ఇరాన్, వెనిజులాలో ప్రభుత్వ సైనిక చర్యలను కెల్లీ సమర్థించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన వైవిధ్యం, సమానత్వ కార్యక్రమాలను ముగించేందుకు హెగ్సెత్ చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆమె ప్రశంసించారు. ఎన్నికల నష్టానికి ముందే ప్రతిపక్ష సభ్యులు హెగ్సెత్‌పై అభిశంసన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసినట్లు మూల కథనం తెలిపింది. కాంగ్రెస్‌లోని రెండు సభల్లో డెమోక్రటిక్ పార్టీకి బలమైన మెజారిటీ రావడంతో హెగ్సెత్‌పై పార్లమెంటరీ ఒత్తిడి మరింత పెరగవచ్చని అంచనా. ఆయనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు కూడా పెరిగినట్లు నివేదిక పేర్కొంది. అదే సమయంలో ట్రంప్ తుది నిర్ణయం తీసుకోలేదని, వైట్‌హౌస్ మాత్రం పదవికి ముప్పు లేదని చెబుతోంది.

వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో పికో టెక్నాలజీ కార్యాలయం ప్రారంభం

- మంత్రులు కార్యాలయం ప్రారంభించారు
- యువతకు ఉద్యోగ అవకాశాలు
- కార్యాలయం ప్రారంభమైంది
- యువతకు ఉద్యోగాలు



నల్గొండ జిల్లా నవంబర్ 6 వుదయం ప్రతినిధి
తెలంగాణ ఐటీ రంగంలో కీలక ముందడుగు పడింది. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన పికో టెక్నాలజీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నవంబర్ 6న ప్రారంభించారు. పికో టెక్నాలజీ తొలిసారిగా భారతదేశంలో హైదరాబాద్ను కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుంది. ఆ సంస్థ గత 17 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రముఖ సంస్థలకు సాఫ్ట్‌వేర్ సేవలు అందిస్తోంది. కొత్త కార్యాలయం రాష్ట్ర ఐటీ రంగానికి మరింత గుర్తింపు తీసుకురానుందని ప్రభుత్వం తెలిపింది. పికో టెక్నాలజీ కార్యాలయం ఏర్పాటుతో తెలంగాణ యువతకు నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. అంతర్జాతీయ స్థాయి సంస్థలు హైదరాబాద్లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఆ పరిణామం తెలంగాణను ప్రపంచస్థాయి కంపెనీలకు ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెడుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించడం, పరిశ్రమల అభివృద్ధికి అనుకూల వాతావరణం కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంది. పికో టెక్నాలజీ కార్యాలయ ప్రారంభంతో ఈ లక్ష్యాలకు అనుగుణంగా మరో సంస్థ రాష్ట్ర ఐటీ రంగంలోకి వచ్చింది.

నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తొర్రూరులో హెచ్చరిక

- బస్తాపై 26 కిలోలు, తూకంలో 24 కిలోలే ఉన్నట్లు గుర్తింపు



తొర్రూరు నవంబర్ 6, (వుదయం ప్రతినిధి):
తొర్రూరులో నవంబర్ 6న అధిక ధరలకు నిత్యావసర సరుకుల విక్రయంపై అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని కిరాణా, ఆల్ ఇన్ వన్ దుకాణాలను పరిశీలించారు. పలు దుకాణాల్లో సన్నబియ్యాన్ని నిర్ణయించిన ధరలకంటే ఎక్కువకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. బస్తాపై 26 కిలోలు అని ముద్రించి ఉండగా తూకంలో 24 కిలోలే ఉన్నట్లు తేలింది. స్వదేశీ మార్కెట్లో 25 కిలోల రైస్ బ్యాగ్‌ను స్థానికులకు రూ.3 వేలకు విక్రయించినట్లు గుర్తించారు. స్థానికుల ఫిర్యాదును అధికారులు నమోదు చేసుకున్నారు. పప్పులు, వంట సామగ్రి, నూనెను కూడా కొన్ని దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా చైర్మన్ విజమూరి సుధాకర్, పౌరసరఫరాల శాఖ డీటీ కామేశ్వరరావు మాట్లాడుతూ, ఎల్ నినో సాకుతో పాత సరుకులను కొత్త ధరలకు అమ్మడం, ఎమ్మార్పీకి మించి విక్రయించడం నేరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు సరుకులు విక్రయించాలని అధికారులు స్పష్టం చేశారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యల కోసం పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, లేబర్, ఫైర్ శాఖల అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలు, ఇతర ఉల్లంఘనలను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

జయేశ్ రంజన్ రామప్ప ఆలయాన్ని సందర్శించి కాకతీయుల నిర్మాణ కౌశలాన్ని ప్రశంసించారు

- రామప్పలో సాండ్‌బాక్స్ సాంకేతికత, తేలియాడే ఇటుకల ప్రత్యేకత వివరించారు



ములుగు, నవంబర్ 06 (వుదయం ప్రతినిధి):
ములుగు జిల్లాలోని పాలంపేట రామప్ప దేవాలయాన్ని రాష్ట్ర పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ నవంబర్ 6న సందర్శించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి ఆయన ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఆలయాన్ని పరిశీలించారు. కాకతీయుల కాలం నాటి శిల్పకళ, ఆలయ నిర్మాణ కౌశలం అప్పటి ఇంజినీరింగ్, సాంకేతిక నైపుణ్యానికి ప్రత్యక్ష నిదర్శనమని జయేశ్ రంజన్ అన్నారు. శిల్పి పేరుతో ఆలయం ప్రసిద్ధి చెందడం రామప్ప ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జయేశ్ రంజన్‌కు స్వాగతం పలికారు. ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ ఈఓ ఇమ్మడి భాస్కర్ శాలువాతో సన్మానించారు. పర్యాటక మార్గదర్శి గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయుల చరిత్ర, సాండ్‌బాక్స్ సాంకేతికత, నీటిపై తేలియాడే ఇటుకలు, డోలరైట్ శిల్పాల ప్రత్యేకతలను వివరించారు. ఆనాటి జీవన విధానం, వస్త్రధారణ, కళలను శిల్పాల్లో మలచిన తీరు అద్భుతమని జయేశ్ రంజన్ వ్యాఖ్యానించారు. ఆలయ ప్రాంగణంలో ప్రసాద్ పథకం కింద కొనసాగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని జయేశ్ రంజన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు కల్పిస్తున్న సదుపాయాల వివరాలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీఓ రాజు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరు లేని పాత ఓటర్లకు ఫారమ్ 6తో దరఖాస్తు అవకాశం

- ఫారమ్-6 దాఖలుపై చట్టపరమైన చర్యల భయం వద్దు



హనుమకొండ సిటీ, నవంబర్ 06 (వుదయం ప్రతినిధి)
హనుమకొండలో నవంబర్ 6న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయి కీలక సూచన చేశారు. ఎస్ఐఆర్ 2026లో భాగంగా ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని పాత ఓటర్లు ఫారమ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. చాహత్ బాజ్ పాయి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, ఫారమ్ 6 సమర్పిస్తే తప్పుడు డిక్లరేషన్ ఆరోపణలతో చర్యలు తీసుకుంటారనే భయం అవసరం లేదని స్పష్టం చేశారు. ముసాయిదా జాబితాలో పేరు లేకపోవడం ఒక్కటే దరఖాస్తు చేసుకోకుండా అడ్డంకి కాదని తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 31 కింద చర్యల భయంతో పాత ఓటర్లు వెనక్కి తగ్గాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. దేశంలో మరెక్కడా ఓటు నమోదు లేకపోతే, ముసాయిదా జాబితాలో పేరు కనిపించక ఫారమ్ 6 దాఖలు చేసే వారిపై చర్యలు ఉండవని హామీ ఇచ్చారు. ముసాయిదా జాబితాలో పేరు లేని పాత ఓటర్లు చట్టబద్ధంగా ఫారమ్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఢిల్లీ హైకోర్టు కూడా స్పష్టం చేసిందని చాహత్ బాజ్ పాయి తెలిపారు. కోర్టు వివరణను డబ్ల్యూ.పీ. (సీ) నో. 14955/2026లో పేర్కొన్నట్లు ఆమె వెల్లడించారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగానే ముసాయిదా జాబితా ప్రచురితమైంది.

డిసెంబర్ 31 వరకు తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

- తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి.
- వీబీజీఆర్‌పఎంజీ పనులు నాణ్యంగా ఉండాలి.



యాదాద్రి భువనగిరి జిల్లా వుదయం ప్రతినిధి.
యాదాద్రి భువనగిరిలో శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు. వేసవి ముగిసే వరకు తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి జిల్లాలో తాగునీటి కమిటీని ఏర్పాటు చేసి, వారానికి ఒకసారి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. మండల కమిటీలను నవంబర్ నెలాఖరులోగా ఏర్పాటు చేయాలన్నారు. చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావుల మరమ్మతులను నవంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. వీబీజీఆర్ఏఎ మ్జీలో ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలకు పనులు లభిస్తున్నాయని సీఎస్ తెలిపారు. మార్చి నెలాఖరులోగా 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని, చేపట్టే పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో 43 వేల ఇళ్లకే మంజూరు లభించిందని సీఎస్ పేర్కొన్నారు. మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, సిమెంట్ బస్తాలను రూ.230 చొప్పున అందించాలని సూచించారు. ఒక్కో బస్తాపై రూ.100, మొత్తం సుమారు రూ.50 వేల వరకు లబ్ధి కలిగే అవకాశం ఉందన్నారు.

సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రజాదరణ పెరుగుతోందన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సమావేశం



సూర్యాపేట, నవంబర్ 06: వుదయం ప్రతినిధి
సూర్యాపేటలో నవంబర్ 06న జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రసంగించారు. 2024లో ప్రారంభమైన కాంగ్రెస్ శకం 2034 వరకు కొనసాగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పాలనతో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని మంత్రి చెప్పారు. అర్హులైన కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేయడం సంక్షేమ కార్యక్రమాల్లో మైలురాయి అని పేర్కొన్నారు. ఆర్థికంగా బలహీన కుటుంబాలకు నాణ్యమైన ఆహారం అందడంతో ఆహార భద్రత బలపడుతోందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆందోళనలు, సాగునీటి సవాళ్ల మధ్య కూడా రాష్ట్రంలో గణనీయమైన వరి ఉత్పత్తి నమోదైందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైతుల ప్రయోజనాల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ సంస్థాగత బలాన్ని చాటుకునే అవకాశమని మంత్రి అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఎన్నికల సన్నాహాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి పట్టభద్రులు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. కె. రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్. పద్మావతిరెడ్డి, మందుల సామేల్ సమావేశంలో ప్రసంగించారు.

జనగామ బైపాస్‌పై ప్రతిపాదిత విగ్రహ ఏర్పాటుకు అన్ని శాఖల నివేదికల తర్వాతే తుది నిర్ణయం

- ట్రాఫిక్, డ్రైనేజీ, కొలతలను అధికారులు పరిశీలించాలి



జనగామ, నవంబర్ 06 (వుదయం ప్రతినిధి):
జనగామ పట్టణ ప్రవేశ మార్గంలోని హైదరాబాద్-హనుమకొండ బైపాస్ జాతీయ రహదారిపై శ్రీ తాను నాయక్ విగ్రహం ఏర్పాటు ప్రతిపాదనకు ప్రభుత్వ నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నవంబర్ 06న స్పష్టం చేశారు. నందన గార్డెన్స్ ఎదురుగా బంజారా కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ నిర్ణయం వెలువడే వరకు విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి పనులు చేపట్టరాదని ఆదేశించారు. ప్రతిపాదిత స్థలంలో పరిశీలన పూర్తయ్యే వరకు నిర్మాణ చర్యలు నిలిపివేయాలని ఆయన స్పష్టం చేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ప్రజా వినియోగ స్థలాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతి లేదని కలెక్టర్ గుర్తుచేశారు. జీవో నెం. 18లోని నిబంధనలు, 18022013 తేదీతో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఈ చర్యలకు ఆధారమని తెలిపారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన జీపీఎస్ కోఆర్డినేట్లు, విగ్రహ కొలతలు, ట్రాఫిక్‌కు ఏర్పడే ఆటంకం, డ్రైనేజీ మరియు భూగర్భ వినియోగ వసతుల సమస్యలను అధికారులు పరిశీలించాలి. క్షేత్రస్థాయి తనిఖీ తర్వాత సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్అండ్‌బీ, మున్సిపల్, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖలను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కడకంచి బాలమణి, బంజారా కమ్యూనిటీ చైర్మన్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, ఆర్డీఓ గోపీరామ్, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ సత్య శారద ఆదేశాలతో నవంబర్ 15 నుంచి ప్రత్యేక డ్రైవ్

- ట్యాంకుల శుభ్రత, నీటి నాణ్యత పరీక్షలు



వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి నవంబర్ 6.
వరంగల్ జిల్లాలో నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక పారిశుధ్య, తాగునీటి సరఫరా డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ కమిటీ సమావేశంలో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. తాగునీటి సరఫరా, మిషన్ భగీరథ పనుల పురోగతి, నీటి నాణ్యత పరీక్షలు, గ్రామీణ పారిశుధ్య నిర్వహణపై సమావేశంలో సమీక్ష జరిగింది. నవంబర్ 11న గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మండలాల వారీగా సమీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సరఫరాలో అంతరాయం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వ్యవస్థలో తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, డీఎంహెచ్‌వో రాజిరెడ్డి సమావేశంలో పాల్గొన్నారు. జడ్పీ సీఈవో వసంత, ఆత్మ పీడీ విజయ నిర్మలతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక డ్రైవ్‌లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా చర్యలు కొనసాగనున్నాయి.

సమన్వయంతో జిల్లాను అగ్రగామిగా నిలపాలి అని కలెక్టర్ పిలుపు


- జిల్లా అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ పిలుపు



భూపాలపల్లి,నవంబర్ 06 (వుదయం విలేకరి) జయశంకర్ భూపాలపల్లి జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి సమష్టిగా, సమన్వయంతో అంకితభావంతో పనిచేద్దామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. నవంబర్ 6న కలెక్టర్ జన్మదినం సందర్భంగా ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి వసంతకుమారి, ఆర్డీఓ హరికృష్ణతోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించారు. శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రాహుల్ శర్మ కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు చూపిన ఆప్యాయత, అభిమానంతో సంతోషంగా ఉందన్నారు.

నిధుల వినియోగం లక్ష్యాలపై సీఎస్ కఠిన ఆదేశాలు

- జనవరి మొదటి వారంలోగా పీఎం శ్రీ నిధుల పూర్తి వినియోగం



ద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 6 (వుదయం ప్రతినిధి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ లక్ష్యాల సాధనను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. నవంబర్ 6న అన్ని జిల్లాల కలెక్టర్లతో జరిగిన వీడియో సమావేశంలో పథకాల అమలు, నిధుల వినియోగంపై సమీక్షించారు. సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధులను జనవరి మొదటి వారంలోగా పూర్తిగా ఖర్చు చేయాలని సూచించారు. పీఎం శ్రీ కింద రూ.538 కోట్లు కేటాయించినా, ఇప్పటివరకు పది శాతం కూడా వ్యయం కాలేదని తెలిపారు.

పెండింగ్ సీఎంఆర్ బియ్యం గడువులోగా ఇవ్వాలి


- గడువులోగా పెండింగ్ బియ్యం సరఫరా చేయాలి



ఖమ్మం, వుదయం బ్యూరో నవంబర్ 06:
ఖమ్మం జిల్లాలో పెండింగ్ సీఎంఆర్ బియ్యాన్ని జనవరి 31, 2027లోగా సివిల్ సప్లైస్‌కు అందించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ప్రతి మిల్లర్ నెలకు కనీసం 35 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాలి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో రబీ 202425, ఖరీఫ్ 202526 సీజన్ల సీఎంఆర్ డెలివరీ, మిల్లర్ల వారీ పురోగతి, బకాయి బిల్లులపై అధికారులు, రైస్ మిల్లర్లతో చర్చించారు. గడువులోగా సరఫరా చేయని మిల్లర్లను నిబంధనల ప్రకారం డిఫాల్ట్ మిల్లర్లుగా పరిగణిస్తామని శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్ నిల్వలను తగ్గిస్తూ డెలివరీని వేగవంతం చేయాలని సూచించారు. మిల్లింగ్, రవాణా ఛార్జీల బిల్లులను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

కాలేజీలో కలెక్టర్ తనిఖీ

- సేవలు 24 గంటలు కొనసాగాలి



డెస్క్ నివేదిక దిలీప్ కుమార్ యాదవ్ శుక్రవారం బుందేల్‌ఖండ్ మెడికల్ కాలేజీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాలు, వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించి, రక్తపరీక్షలు, సీటీ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ రిపోర్టులు సమయానికి ఇవ్వాలని, ఫీజుల విధానాన్ని పారదర్శకంగా ఉంచాలని ఆదేశించారు. ఓపీడీ, ఐపీడీ పనితీరు, రోజువారీ రోగుల సంఖ్య, ప్రసవాల రిజిస్టర్లు, బెడ్ల వివరాలు, 24 గంటల వైద్య సేవలపై కలెక్టర్ సమాచారం కోరారు. షెడ్యూల్ పాటించాలని, సేవలను 24 గంటలు నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.

కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

అభివృద్ధి కార్యక్రమాలపై మండల స్థాయి సమీక్ష సమావేశం

ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



జగిత్యాల నవంబర్ 06 (వుదయం ప్రతినిధి)

జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో అర్బన్ మండల అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎల్ నీనో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వరిసాగు విషయంలో రైతులు ఆలోచన చేయాలని అవగాహన కల్పించాలని ఆరుతడి పంటలు పండించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు .వరి కోతలు ప్రారంభం అయ్యాయని అదనపు కలెక్టర్ తో మాట్లాడడం జరిగిందని మధ్య వర్తులను నమ్మి రైతులు మోసపోవద్దు మద్దతు ధర మార్కెట్ డిమాండ్ ధరపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గతంలో మార్క్ ఫెడ్ 10వేల కోట్ల నష్టాల్లో ఉంది గత ఏడాది కొంత లాభాలు వచ్చాయని గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని రోగాలు రాకుండా అరికట్టాలన్నారు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ఉపయోగించుకోవాలని ప్రతి రోగానికి క్రిటికల్ కేర్ అవసరం లేదని చుట్టూ పక్క జిల్లాల నుండి సైతం రోగుల తాకిడి పెరిగిందన్నారు. పంట పొలాలకు నీరు ఇచ్చే పరిస్థితి ప్రస్తుతం లేదని త్రాగు నీటి అవసరాలకు మాత్రమే నీరు ఉందని సెర్ప్ విషయంలో జగిత్యాల మండలానికి జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని మహిళలకు న్యాయం చేస్తానన్నారు. జగిత్యాల మండల మహిళ సంఘం భవనానికి జిల్లా కేంద్రంలో స్థలం కేటాయిస్తానని విబిజిఆర్ఏఎం లో రైతు పంట పొలాలు కాలువల్లో నీటి సరఫరా కు పనులు ప్రాధాన్యం ఇవ్వాలని విబిజిఆర్ఏఎం లో నిర్మాణ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తూ సీసీ రోడ్లకు 20శాతం మాత్రమే నిధుల కేటాయింపు చేయడం జరుగుతుందని విబిజిఆర్ఏఎంలో 40శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు పై ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు గ్రామ కార్యదర్శిల అవగాహన కల్పించాలని ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డిఎంఓ షాబొద్దీన్ ఇంచార్జి ఎంపిడిఓ వాసవి మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి తహసీల్దార్ రామ్మోహన్ పాక్స్ చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు సర్పంచులు సంగేపు మహేష్ గోడిసెల గంగాధర్ దావా తిరుపతి శీలం సురేందర్ దమ్మ రాజవ్వ మల్లారెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి – కలెక్టర్

పెద్దపల్లి, నవంబర్ 06 (వుదయం ప్రతినిధి)

ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. జిల్లాలో ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వీబీజీ రామ్‌జీ పథకం కింద మంజూరైన గ్రామాల్లో వీవో భవనాల నిర్మాణాల పురోగతిపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వానికి, అధికారులకు, సంబంధిత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను ఏ విధంగా చేపట్టాలనే అంశంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి చట్టపరమైన అంశాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, రిజిస్ట్రేషన్



ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను విశ్లేషిస్తూ సమగ్ర నివేదిక సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు.

భూముల రిజిస్ట్రేషన్ విషయంలో స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని, ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచిం చారు. ప్రభుత్వ ప్రయోజనాలకు భంగం కలగకుండా, అర్హులైన ప్రజలకు ఇబ్బం దులు తలెత్తకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అనంతరం వీబీజీ రామ్‌జీ పథకం కింద జిల్లాలో మంజూరైన గ్రామాల్లో వీవో భవనాల నిర్మాణాల పురోగతిని సమీక్షిస్తూ, మంజూరైన అన్ని భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకొని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వీవో భవనాల నిర్మాణాలకు అవసరమైన నిర్మాణ సామగ్రి, ఇతర అనుబంధ పనులకు సంబంధించిన నిధులను వీబీజీ రామ్‌జీ పథకం నిబంధనల మేరకు సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఏవైనా అడ్డంకులు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, పూర్తయిన భవనాలను వెంటనే సంబంధిత సంఘాలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ కాళిందిని, డీ.సీ.ఓ.శ్రీ మాల, ట్రైని డిప్యూటీ కలెక్టర్ వనజ,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

కోటిలింగాల ఆలయాల సర్వాంగ సుందర అభివృద్ధికి పెద్దపీట

పునర్నిర్మాణ పనులు, పుష్కరాల ఏర్పాట్లపై సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దిశానిర్దేశం

భక్తులకు అసౌకర్యం కలగకుం డా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం



ధర్మపురి నవంబర్ 6 (వుదయం ప్రతినిధి):

తెలంగాణలోని ప్రసిద్ధ ఆధ్యాత్మి క క్షేత్రాలైన ధర్మపురి శ్రీ ఉగ్రనరసింహ స్వామి, కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణం, రానున్న పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక దృష్టిసారించారు. సచివాలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లాకలెక్టర్ సత్యప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ రెండు పుణ్య క్షేత్రాలను భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అద్భుతంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాలకు కేవలం రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారని మంత్రి అడ్లూరి గుర్తుచేశారు. ఈ నేపథ్యం లో ఆలయాల ప్రాచీనత, చారిత్రక వైభవం, సంప్రదాయాలు ఆగమ శాస్త్ర నిబంధనలకు ఎక్కడా భంగం కలగకుండా పునర్నిర్మా ణ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రానున్న పుష్కరాల వేళ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ఘాట్ల అభివృద్ధి, సురక్షిత స్నానపు ఏర్పాట్లతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన రహదారులు, వైద్య సదుపాయాలు, విశాలమైన పార్కింగ్ స్థలాలు, పటిష్టమైన భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు ఉండేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి పనులు పుష్కరాల నిర్వహణను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. భక్తులకు దివ్యమైన ఆధ్యాత్మిక అనుభూతిని అందించడంతో పాటు, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి పునరుద్ఘాటించారు.

ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలి

నిర్మల్ జిల్లా వుదయం ప్రతినిధి 6 నవంబర్ 2026

బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రుణ, సబ్సిడీ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బ్యాంకింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజల ఆర్థిక అభివృద్ధికి బ్యాంకులు మరింత చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందించే రుణాలను అర్హులకు

అర్హులైన లబ్ధిదారులకు రుణాలు, సబ్సిడీ పథకాలు చేరాలి: కలెక్టర్



సకాలంలో మంజూరు చేయాలని, తద్వారా ప్రజల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని అన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ప్రతికూల పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులకు వ్యవసాయ రుణాలు, ఇతర సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం రూపొందిస్తున్న విధానాలు, పథకాలపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా రైతులకు మారటోరియం అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించి, వారికి అవసరమైన బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకట మాధవరావు, రాథోడ్ రమేష్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఆర్బీఐ ఏజీఎం రాములు, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, నవంబర్ 06 :

జిల్లాలోని వివిధ క్వారీల నుండి నిబంధనలకు అనుగుణంగానే ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతోందని, ఈ విషయంలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి ఇసుక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, మైనింగ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇసుక రీచ్ లను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ ద్వారా ఇసుక కేటాయింపులు జరగాలని, ఇసుక రవాణా విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తూచ తప్పకుండా అమలయ్యేలా చూడాలని, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తూ అక్రమాలకు తావు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయం భవన సముదాయాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను నిర్దేశిత ఇసుక రీచ్ ల నుండి తరలించేందుకు అనుమతించినందున ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ గీత, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, మైనింగ్ అధికారి బాలు, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట బందోబస్తు: కలెక్టర్



ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి)

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను నెలవారీ తనిఖీల్లో భాగంగా సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన సీల్స్, రిజిస్టర్లు, సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. భద్రతా చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు సాయి, శ్యాంలాల్, సీనియర్ అసిస్టెంట్ ముసాఫిర్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల పని తీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్

కామారెడ్డి, నవంబర్ 6 (వుదయం ప్రతినిధి):

కామారెడ్డి జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో విద్యాశాఖ,



పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, గృహ నిర్మాణ శాఖ, భూసేకరణ విభాగం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. ముఖ్యంగా వికసిత్ భారత్ – గ్రామీణ ఉపాధి, చేయూత పింఛన్లు, గృహ నిర్మాణాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, భూసేకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డిఇఓ మల్లికార్జున్, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, హౌసింగ్ విజయ్ పాల్ రెడ్డి తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాలు ముందుండాలి

- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ సంజయ్ జాజు

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, నవంబర్ 6:

ప్రభుత్వపథకాల లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. విద్య,ఉపాధిహామీ, తాగు నీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో పథకాల అమలు, నిధులవినియోగంపై సమీక్షించారు. కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రా, ఎస్.రాజేశ్వర్ తో కలిసి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.

విద్యా నిధుల వినియోగం వేగవంతం

సమగ్ర శిక్ష, పీఎం శ్రీ పథకాల కింద కేటాయించిన నిధులను జనవరి మొదటి వారంలోగా గరిష్ట స్థాయిలో ఖర్చు చేయాలని సీఎస్ సూచించారు. పీఎం శ్రీ పథకానికి రూ.538 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు 10 శాతం కూడా ఖర్చు చేయలేదని, సమగ్ర శిక్షకు కేటాయించిన రూ.1,763 కోట్లలో ఇప్పటివరకు రూ.79 కోట్లు మాత్రమే వ్యయం చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడంపై దృష్టి పెట్టాలన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక నిఘా

వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నవంబర్ 15లోగా చేతిపంపులు, బోర్లు, బహిరంగ బావులకు మరమ్మతులు పూర్తి చేయాలని, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి వారం సరఫరా పరిస్థితిని సమీక్షించాలన్నారు.

12 కోట్ల పనిదినాల లక్ష్యం

VB–GRAMG పథకం ద్వారా మార్చి నెలాఖరులోగా 12కోట్ల పనిదినాలు




కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుతం రోజు కు సగటున 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లకు రాయితీలు అందించాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందిం చేలా 'మన ఇసుక–మన వాహనం' యాప్‌ను సమర్థంగా వినియోగించాలన్నారు. రవాణా ఖర్చులు మాత్రమే వసూ లు చేయాలని, సిమెంట్ బస్తాను రూ.230కే అందించే ప్రయోజనం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో చేరేలా చూడా లని సూచించారు. వీడియో కాన్ఫ రెన్స్‌లో ఆర్డీఓ జగదీశ్వర్‌రావు, జెడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్‌రాథోడ్, డీఈఓ మాధవి, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాల భవనం కోసం తీర్మానం



ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రత్యేక అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని పాతసోమిని గిరిజన ప్రాథమిక పాఠశాల నూతన భవనం నిర్మాణం కోసం పద్మశాలి సంఘం అధ్యక్షులు సామల తిరుపతి అధికారులకు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. స్పందించిన అధికారులు మండల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు.మండలంలోని సర్పంచులు ఉపాధి హామీ పథకంలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలు, వివో భవనాలు, అంగన్వాడి భవనా లు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి నెలలు గడుస్తున్న సంబంధించిన బిల్లులు రాకపోవడంతోఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుకుడ సర్పంచ్ తొర్రెం చిరంజీవి, కుషన్ పల్లి సర్పం చ్ వడ్డేపల్లి లావణ్య శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్చిలోగా పనులు పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి తేవడంతో అప్పులు చేసి మరి పనులు పూర్తిచేసిన పైసలు మాత్రం అడిగితే పట్టించుకోవడంలేదని ఇది ఎంతవరకు సమంజసమని అధికారులను నిలదీశారు. మండలంలోని పలువురు సర్పంచులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండల వ్యవసాయ, గృహనిర్మాణశాఖ, విద్యుత్శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, ఇరిగేషన్, ఆర్టికల్చర్ తదితర శాఖల అధికారులు తమ తమ నివేదికలను చదివి వినిపించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రత్యేక అధికారి అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసిల్దార్ రామ్మోహన్ రావు, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఓం ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో దత్తత వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం

చిన్నారి శ్రేయస్సు ఉజ్వల భవిష్యత్తే ప్రధాన లక్ష్యంగా మానవతా దృక్పథంతో నిర్ణయం

హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం–1956 ప్రకారం దత్తత ప్రక్రియ పూర్తి

చిన్నారి చట్టపరమైన హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

జగిత్యాల నవంబర్ 06 (వుదయం ప్రతినిధి)

చిన్నారుల సంక్షేమం వారి భవిష్యత్తు భద్రత చట్టపరమైన హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ స్పష్టం చేశారు జగిత్యాల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన దత్తతకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో మానవతా దృక్పథంతో చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా సామరస్యపూర్వకంగా పరిష్కరించారు చిన్నారి భవిష్యత్తును ప్రభావితం చేసే సున్నితమైన అంశం కావడంతో ఈవ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పరిగణించారు దత్తతకు సంబంధించిన వివాదం కొనసాగడం వల్ల చిన్నారి సంక్షేమం కుటుంబ వాతావరణం భవిష్యత్తు భద్రతపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. చిన్నారి ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యత దత్తతకు సంబంధించిన అంశాల్లో కేవలం సాంకేతిక పరిపాలనాపరమైన విషయాలకే పరిమితం కాకుండా చిన్నారి శ్రేయస్సు మానసిక ప్రశాంతత కుటుంబ భద్రత విద్య ఆరోగ్యం భవిష్యత్తు అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ భావించారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ దత్తత వివాదానికి చట్టబద్ధమైన పరిష్కారం లభించే విధంగా చర్యలు చేపట్టారు.

చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి

హిందూ దత్తత మరియు నిర్వహణ చట్టం (హిందూ అడాప్షన్స్ అండ్ మైంటెనెన్సు యాక్ట్ – హేమ) 1956 ప్రకారం దత్తత ప్రక్రియను చట్టబద్ధంగా స్థానిక జగిత్యాల సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో పూర్తి చేశారు. సంబంధిత బాలల సంక్షేమ అధికారుల సమక్షంలో దత్తతకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా చిన్నారి భవిష్యత్తుకు చట్టపరమైన భరోసా కల్పించే దిశగా ముఖ్యమైన ముందడుగు పడింది. దత్తత ప్రక్రియలో చట్టపరమైన నిబంధనల అమలు చిన్నారి ప్రయోజనాల పరిరక్షణ సంబంధిత కుటుంబాల మధ్య సామరస్యపూర్వక పరిష్కారం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు.

వివాదానికి శాంతియుత పరిష్కారం

గతంలో వివాదాస్పదంగా మారిన ఈ దత్తత వ్యవహారం జిల్లా కలెక్టర్ చొరవతో శాంతియుతంగా పరిష్కారమైంది చిన్నారి ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని సంబంధిత వర్గాల మధ్య నెలకొన్న వివాదానికి పరిష్కారం లభించేలా జిల్లా యంత్రాంగం వ్యవహరించింది ఈ పరిణామంతో చిన్నారి కుటుంబ వాతావరణంలో భద్రంగా పెరిగేందుకు విద్యాభ్యాసం కొనసాగించేందుకు భవిష్యత్తులో చట్టపరమైన హక్కులను పొందేందుకు మార్గం సుగమమైంది.

రిట్ అప్పీల్ ఉపసంహరణకు నిర్ణయం

దత్తతకు సంబంధించిన సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారం కావడంతో ఈ వ్యవహారానికి సంబంధించి గతంలో దాఖలు చేసిన రిట్ అప్పీల్‌ను ఉపసంహరించుకోవాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. చిన్నారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివాదాన్ని కొనసాగించకుండా చట్టబద్ధమైన పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.



మానవతా దృక్పథంతో కూడిన పరిపాలనకు నిదర్శనం

ప్రభుత్వ పరిపాలనలో చట్టబద్ధతతో పాటు మానవతా విలువలకు కూడా సముచిత ప్రాధాన్యత ఉండాలనే విషయాన్ని ఈ పరిణామం ప్రతిబింబిస్తోంది ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన సున్నితమైన సమస్యలను పరిష్కరించే సందర్భంలో వారి భవిష్యత్తు భద్రత సంక్షేమం అన్నింటికంటే ముఖ్యమని ఈ వ్యవహారం స్పష్టం చేస్తోంది. చిన్నారి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేయడానికి జిల్లా కలెక్టర్ తీసుకున్న ప్రత్యేక చొరవ పట్ల పెంపుడు తల్లిదండ్రులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించి చిన్నారి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేసిన జిల్లా కలెక్టర్ చర్యలను పలువురు అభినందించారు.

మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

సంగారెడ్డి 12వ వార్డులో యూఐడీఎఫ్ నిధులతో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

- రూ.55 లక్షలతో సీసీ రోడ్డు పనులు
- 12వ వార్డులో రూ.55 లక్షల సీసీ రోడ్డు పనులు

సంగారెడ్డి, నవంబర్ 6:వు దయం. సంగారెడ్డిలో నవంబర్ 6న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ 12వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యూఐడీఎఫ్ నిధుల నుంచి రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వార్డుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చింతా ప్రభాకర్ తెలిపారు. కాలనీల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయడమే అభివృద్ధి పనుల లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ కోటి రూపాయల వరకు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. ప్రస్తుతం వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకొని వార్డుల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డాక్టర్ శ్రీహరి, నవీన్, జీవీ శ్రీనివాస్, విఠల్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు స్పీకర్ హామీ

- ఇందిరమ్మ ఇళ్లకు హామీ
- ప్రత్యేక కాలనీకి విజ్ఞప్తి
- దివ్యాంగులకు ఇళ్ల హామీ
- ఇందిరమ్మ ఇళ్లపై హామీ
- ఇళ్ల మంజూరుకు హామీ



వికారాబాద్ నవంబర్ 07 (వుదయం బ్యూరో) వికారాబాద్‌లో నవంబర్ 7న తెలంగాణ శాసనసభాపతి, ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రజల సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. సిద్దులూరు గ్రామంలో పోచమ్మ తల్లి మూడో వార్షిక జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ప్రజాభవన్‌లో దివ్యాంగుల సమస్యలను స్వయంగా విన్నారు. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుర్కొనే శక్తిని అమ్మవారు ప్రసాదించాలని ప్రార్థించినట్లు స్పీకర్ తెలిపారు. కరువు నుంచి రాష్ట్రం బయటపడాలని, రైతులు పంటలు పండించి సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర ప్రజలందరిపై పోచమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని కోరారు. పోచమ్మ తల్లి జాతరను గ్రామస్తులు ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామ ప్రజలకు అభినందనలు తెలిపారు. గ్రామంలో ఐక్యత, శాంతి, సంతోషం కొనసాగాలని జాతర శుభాకాంక్షలు చెప్పారు. ప్రజాభవన్‌లో బీవీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ ఆధ్వర్యంలో దివ్యాంగులు తమ సమస్యలను వివరించారు. సొంత ఇళ్లు లేని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, పట్టణ పరిధిలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, ర్యాంపులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వర్కూర్ రైతుల కోసం వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

◆ వర్కూర్‌లో పీఏసీఎస్ వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించింది.



మాగనూర్ నవంబర్ 06(వుదయం మాగనూర్ మండలం వర్కూర్ గ్రామంలో నవంబర్ 6న వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ రవీందర్, పీఏసీఎస్ అధ్యక్షుడు కే. వెంకట్ రెడ్డి, కార్యదర్శి కే. గోవర్ధన్ రెడ్డి కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని నాయకులు తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడమే కేంద్రం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి, యాకూబ్ అలీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కేంద్ర ఇన్‌చార్జి వెంకటేష్, రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాజు కుటుంబానికి ఎస్పీ కోటి రూపాయల బీమా చెక్కు అందజేత

◆ రాజు కుటుంబానికి ఎస్పీ కోటి రూపాయల బీమా చెక్కు అందించారు.

నాగర్ కర్నూల్, నవంబర్ 06 (వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్ రాజు కుటుంబానికి ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ కోటి రూపాయల బీమా చెక్కును అందజేశారు. నవంబర్ 6న జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించిన పోలీస్ శాలరీ ప్యాకేజీ ఇన్సూరెన్స్ పరిహారం కుటుంబ సభ్యులకు అందింది. గత ఆగస్టులో కొల్లాపూర్ సీఎం బందోబస్తు విధులు ముగించుకుని నాగర్ కర్నూలుకు తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురై రాజు అక్కడికక్కడే మృతి చెందారు. విధి నిర్వహణలో జరిగిన ఈ మరణంతో కుటుంబం ప్రధాన ఆదాయ వనరును కోల్పోయింది. రాజుకు ఎస్‌బీఐలో పోలీస్ శాలరీ ప్యాకేజీ ఖాతా ఉండటంతో సంబంధిత బీమా నిబంధనల ప్రకారం బ్యాంకు యాజమాన్యం కోటి రూపాయల పరిహారాన్ని మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని బీమా చెక్కు రూపంలో జిల్లా ఎస్పీ కుటుంబ సభ్యులకు అందించారు. కానిస్టేబుల్ రాజు లేని లోటును ఎలాంటి పరిహారం తీర్చలేదని ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు. క్లిష్ట సమయంలో పోలీస్ శాఖ రాజు కుటుంబానికి అండగా ఉంటుందని, ఎస్‌బీఐ పరిహారం వారికి కొంత ఆర్థిక ఆసరా కల్పిస్తుందని చెప్పారు. ప్రతి పోలీసు సిబ్బంది పోలీస్ శాలరీ ప్యాకేజీతో పాటు ఆరోగ్య బీమా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో కృష్ణయ్య, ఆర్ఐ రాఘవ రావు, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, జిల్లా పోలీస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ ప్రతినిధులు, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రాజు కుటుంబానికి అందించిన చెక్కు పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద లభించిన బీమా పరిహారం. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందినప్పటికీ, రాజు మరణంతో ఏర్పడిన లోటు భర్తీ కాదని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, ఎస్‌బీఐ ప్రతినిధులు, రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



జ్ఞానం, మంచి, ఆశల విజయానికి దీపావళి ప్రతీక: శివకుమార్ గౌడ్ వివరణ

◆ దీపావళి చీకటిపై కాంతి, చెడుపై మంచి విజయానికి ప్రతీకగా జరుపుకుంటారు

శివ్వంపేట వుదయం మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరు గ్రామానికి చెందిన శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వ్యవస్థాపకుడు పెద్ద గౌని శివకుమార్ గౌడ్ దీపావళి ప్రాముఖ్యతను వివరించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది, శ్రీశ్రీశ్రీ విశ్వ యోగి విశ్వంజి మహారాజ్ ప్రియశిష్యుడైన ఆయన దీపావళిని హిందువుల ప్రధాన పండుగగా పేర్కొన్నారు. శివకుమార్ గౌడ్ వివరణ ప్రకారం దీపావళి చీకటిపై కాంతి, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, నిరాశపై ఆశ సాధించిన విజయానికి ప్రతీక. ఇళ్లలో దీపాలు వెలిగించడం మనసులోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానవెలుగును ఆహ్వానించే ఆధ్యాత్మిక భావనను సూచిస్తుంది. సంపద, సౌభాగ్యాలకు ఆదిదేవతగా భావించే లక్ష్మీదేవిని దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా పూజిస్తారు. రాముడు 14 ఏళ్ల వనవాసం ముగించుకుని రావణాసురుడిని సంహరించి అయోధ్యకు తిరిగివచ్చినప్పుడు ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారనే విశ్వాసంతో ఈ పండుగకు దీపావళి పేరు వచ్చిందని ఆయన తెలిపారు. శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుడిని సంహరించిన సందర్భాన్ని గుర్తుచేసే నరక చతుర్దశిని కూడా దీపావళి వేడుకల్లో ప్రధానంగా జరుపుకుంటారు. అందువల్ల దీపావళి ఒక్కరోజుకే పరిమితమైన పండుగ కాదని, సంప్రదాయంగా ఐదు రోజుల పాటు కొనసాగుతుందని శివకుమార్ గౌడ్ వివరించారు. ధన్వంతరి జయంతి సందర్భంగా కొత్త వస్తువులు, బంగారం కొనుగోలు చేయడం శుభప్రదంగా భావిస్తారు. బంధుమిత్రులకు మిఠాయిలు పంచుకోవడం, కొత్త బట్టలు ధరించడం, ఇళ్లను రంగవల్లులు, ముగ్గులతో అలంకరించడం పండుగ ఆచారాల్లో భాగమని ఆయన చెప్పారు. దీపాలు, అలంకరణలు, కుటుంబ సభ్యుల భాగస్వామ్యంతో ఇళ్లలో సంతోషం నిండుతుందని శివకుమార్ గౌడ్ పేర్కొన్నారు.



వుదయం ఎడిటర్ సిరికొండ అగస్టిన్ రిపోర్టర్లతో సమావేశం

◆ పత్రికా విస్తరణ, వార్తా సేకరణపై చర్చ



హైదరాబాద్ వుదయం. హైదరాబాద్‌లో వుదయం దినపత్రిక ఎడిటర్ సిరికొండ అగస్టిన్ శుక్రవారం సంగారెడ్డి జిల్లాకు చెందిన రిపోర్టర్లతో సమావేశం నిర్వహించారు. పత్రిక ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీ జిల్లా వార్తా కవరేజీపై దృష్టి పెట్టింది. సిరికొండ అగస్టిన్ మాట్లాడుతూ జిల్లాలో పత్రికా విస్తరణకు సంబంధించిన అంశాలను చర్చించారు. వార్తా సేకరణ విధానం, రిపోర్టర్ల పనితీరు, భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో అభిప్రాయాలు పంచుకున్నారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న రిపోర్టర్లు సమావేశానికి హాజరయ్యారు. కార్యాలయ నిర్వహణ, డెస్క్ బాధ్యతలు చేపట్టే ఇన్‌చార్జిలు కూడా చర్చల్లో పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శరత్ బాబుతో పాటు ఆఫీస్ ఇన్‌చార్జిలు, డెస్క్ ఇన్‌చార్జిలు, ఇతర ప్రాంతాల రిపోర్టర్లు పాల్గొన్నవారిలో ఉన్నారు.

గ్రామాలు, పట్టణాల్లో వేసవి ముగిసే వరకు తాగునీటి సమస్యలు రాకుండా ఖీమ్య నాయక్ చర్యలు ఆదేశించారు

> మరమ్మతులు నవంబర్ 15లోగా పూర్తిచేయాలి



వనపర్తి నవంబర్ 6 (వుదయం ప్రతినిధి) వనపర్తిలో నవంబర్ 6న జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ పథకాల లక్ష్యాలను గడువులోగా సాధించాలని అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్ ఆదేశించారు. సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో పథకాల అమలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధులను జనవరి మొదటి వారంలోగా వినియోగించాలని సూచించారు. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించడంతోపాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, హాజరు పెంచాలని ఆదేశించారు. వేసవి ముగిసే వరకు గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంజయ్ జాజు తెలిపారు. చేతిపంపులు, బోర్‌వెల్లు, బహిరంగ బావుల మరమ్మతులను నవంబర్ 15లోగా పూర్తి చేసి, జిల్లా తాగునీటి కమిటీలు ప్రతి వారం సరఫరాను సమీక్షించాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో నీటి వృథా, అక్రమ కనెక్షన్లను అరికట్టాలని ఆదేశించారు. వి బి జి రామ్ జి పథకంలో కూలీల నమోదును పెంచి లక్ష్యాలను సాధించాలని, గ్రామీణ ఉపాధి అవకాశాలు మరియు అభివృద్ధి పనుల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, రెండో విడత మంజూరు ప్రక్రియను ప్రజాప్రతినిధులు, కమిటీల సమన్వయంతో పూర్తిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 'మన ఇసుకమన వాహనం' యాప్ ద్వారా ఉచిత ఇసుక అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు.

ప్రజలు, రైతుల హాజరుతో రేవంత్ రెడ్డి కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు

> బస్సులు ఉదయం 9 గంటలలోపు ప్రాంగణానికి చేరాలి



నారాయణపేట టౌన్ నవంబర్ 6(వుదయం ప్రతినిధి) నారాయణపేటలో నవంబర్ 6న జిల్లా కలెక్టర్ ప్రియాంక సమీక్ష నిర్వహించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోస్గి, కొడంగల్ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, రైతుల వివరాలను ముందుగానే సేకరించి గ్రామాల వారీగా తుది జాబితా రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవోలు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీకరణ బాధ్యతలను పర్యవేక్షించాలన్నారు. బస్సుల వివరాలు, నంబర్లు, పోలీస్ సిబ్బంది సంప్రదింపు నంబర్లు, బయలుదేరే సమయాలను ప్రత్యేక ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలు, రైతులతో వచ్చే బస్సులు ఉదయం 9 గంటలలోపు కార్యక్రమ ప్రాంగణానికి చేరుకునేలా ప్రయాణ సమయాలను ముందే నిర్ణయించాలని సూచించారు. హాజరయ్యే వారికి అల్పాహారం, భోజనం అందించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని, ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించి శుభ్రమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం వినియోగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆహార నాణ్యతను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మున్సిపల్ అధికారులు ప్రాంగణం, పరిసరాల సుందరీకరణ, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, విద్యుత్, తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను ముందే పరిశీలించాలని ఆదేశించారు.

రమాదేవి పరిశీలనలో డిజిటల్ రీసర్వే పనులు

◆ 189 ఎకరాల భూమి రీసర్వే పూర్తయింది.



పాపన్నపేట, నవంబర్: 6 మెదక్ ఆర్డీఓ రమాదేవి పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామంలో భూముల డిజిటల్ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించిన ఆమె పనుల పురోగతిని పర్యవేక్షించారు. రమాదేవి వివరాల ప్రకారం, గ్రామ పరిధిలోని మొత్తం 405 ఎకరాల సాగుభూమికి సంబంధించిన రీసర్వే 188 మంది రైతులకు శాశ్వత ప్రయోజనం కలిగించేలా కొనసాగుతోంది. ఇప్పటివరకు 189 ఎకరాల భూమి రీసర్వే పూర్తయింది. పూర్తయిన రీసర్వే రికార్డులు, డిజిటల్ మ్యాపులను ఆర్డీఓ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మిగిలిన భూముల రీసర్వేను పొరపాట్లు, భవిష్యత్తు భూవివాదాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతులకు గిట్టుబాటు ధర కోసం రామాయంపేటలో రెండు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన మైనంపల్లి


> రెండు వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మెదక్, నవంబర్ 07 (వుదయం ప్రతినిధి): మెదక్, నవంబర్ 07న రామాయంపేట, నిజాంపేట మండలాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించారు. రామాయంపేట పట్టణంలోని పీఏసీఎస్ మార్కెట్ యార్డులో, పెద్దమ్మ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామాయంపేట బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ, మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భారం తగ్గించడమే ఈ పథకాల లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సంక్షేమం, పేదలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. పర్యటనలో భాగంగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులకు అందించడంతో పాటు రైతుల ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కూడా జరిగినట్లు సమాచారం.

అద్దె భవనంలో నడుస్తున్న ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీని కలెక్టర్ ఖుష్బూ గుప్తా పరిశీలించారు

> కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని విద్యార్థుల విజ్ఞప్తి



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ కళాశాలను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం సందర్శించారు. రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నడుస్తున్న కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి విద్యాభ్యాసం, బోధన ప్రమాణాలు, హాస్టల్ వసతులు, ఇతర సమస్యలను ఆమె తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ అంశాలపై ప్రశ్నలు వేశారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాల ఆధారంగా వారి విద్యా ప్రమాణాలు, విషయ పరిజ్ఞానాన్ని ఆమె పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రవణ్ కుమార్, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని ఆధునిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఖుష్బూ గుప్తా విద్యార్థులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని పరిమితం చేయాలని తెలిపారు. విలువైన సమయాన్ని విద్యాభ్యాసం, నైపుణ్యాభివృద్ధికి కేటాయించాలని కలెక్టర్ హితవు పలికారు. విద్యార్థుల అభ్యాసం, క్రమశిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆమె దృష్టి సారించారు. కళాశాలలో విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న అనంతరం వసతుల పరిస్థితిపై వివరాలు సేకరించారు. కళాశాలకు సొంత భవనం లేదని విద్యార్థినీ, విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం అద్దె భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శాశ్వత భవనం నిర్మించి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

సురక్ష హాస్పిటల్ ప్రారంభం

◆ సదాశివపేటలో సురక్ష హాస్పిటల్ ప్రారంభోత్సవం జరిగింది.



సంగారెడ్డి, నవంబర్ 6: సంగారెడ్డిలో నవంబర్ 6న సదాశివపేట పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన సురక్ష హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి కార్యక్రమానికి నిర్మల జయప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమం సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ శిరీషలకు నిర్మల జయప్రకాష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆసుపత్రి ఏర్పాటుతో నిర్వాహకులైన వైద్యులు రాజ్‌కుమార్, శిరీషలకు అభినందనలు అందాయి. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ సురక్ష హాస్పిటల్ మరింత అభివృద్ధి చెందాలని కార్యక్రమంలో ఆకాంక్షించారు. ప్రారంభోత్సవంతో ఆసుపత్రి సేవలపై స్థానికంగా దృష్టి నిలిచింది.

కిచ్చెనపల్లి దేవస్థాన పునరుద్ధరణకు టీటీడీ రూ.1.09 కోట్లు

- టీటీడీ నిధుల మంజూరు
- నిర్మాణాల కొలతల నమోదు
- చైర్మన్‌కు నివేదిక సమర్పణ
- టీటీడీ రూ.1.09 కోట్ల నిధులు మంజూరు చేసింది



జోగిపేట, వుదయం: జోగిపేట వుదయం మండలంలోని కిచ్చెనపల్లి గ్రామంలో పురాతన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రామకృష్ణ శర్మ శుక్రవారం పరిశీలించారు. ఆలయ పునరుద్ధరణకు టీటీడీ రూ.1.09 కోట్ల నిధులను మంజూరు చేసింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశాల మేరకు రామకృష్ణ శర్మ దేవస్థానాన్ని సందర్శించారు. పునరుద్ధరణలో భాగంగా నిర్మించాల్సిన రాజగోపురం, ప్రహరీ గోడ, పోటు, కార్యాలయ గది తదితర నిర్మాణాలను ఆయన పరిశీలించారు. రాజగోపురం, ప్రహరీ గోడ, పోటు, కార్యాలయ గది నిర్మాణాలకు సంబంధించిన కొలతలను రామకృష్ణ శర్మ తీసుకున్నారు. ప్రతిపాదిత పనుల పరిధిని నిర్ణయించేందుకు ఈ కొలతలు నమోదు చేశారు. ఆలయ అభివృద్ధి పనులపై నివేదికను టీటీడీ చైర్మన్‌కు అందజేస్తామని రామకృష్ణ శర్మ తెలిపారు. నివేదిక సమర్పించిన అనంతరం టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. పునరుద్ధరణ పనులకు టీటీడీ రూ.1.09 కోట్లను కేటాయించింది. నిధుల మంజూరు తర్వాత నిర్మాణాల కొలతలు తీసుకోవడం, నివేదిక సమర్పించడం, టెండర్ ప్రక్రియ ప్రారంభించడం తదుపరి క్రమంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బిక్షపతి, జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా జగనాథ్ గుప్తా, ఎం.

గాజులపల్లి రైతుల ధాన్యం విక్రయానికి ప్రభుత్వ కేంద్రం ప్రారంభం


- గాజులపల్లిలో ప్రభుత్వ వడ్ల కేంద్రం ప్రారంభం
- రైతులు దళారులను ఆశ్రయించకూడదు
- నాణ్యతా ప్రమాణాలతో ధాన్యం తీసుకురావాలి
- గాజులపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది
- రైతులు ప్రభుత్వ కేంద్రాలను వినియోగించాలి



దౌల్తాబాద్,నవంబర్ 6(వుదయం): దౌల్తాబాద్ మండలం గాజులపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ పంజ స్వామి ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో ఇది కూడా అందుబాటులోకి వచ్చింది. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని పంజ స్వామి సూచించారు. రైతులకు విక్రయ ప్రక్రియలో ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా సంబంధిత సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించి పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సర్పంచ్ తెలిపారు. ప్రభుత్వ కేంద్రాల ద్వారా విక్రయ ప్రక్రియలో రైతులకు ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా సూచనలు చేశారు. నవంబర్ 6న దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ గాజులపల్లి ప్రేమ్ కుమార్, ఫాక్స్ కార్యదర్శి మల్లేశం, పంచాయతీ కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు. కర్ణాకర్ రెడ్డి, దుర్గారెడ్డి, ప్రతాపరెడ్డి, అజయ్, సాయికుమార్, నర్సింలు, నవీన్, రాజ్ కుమార్, గంగులు, గుట్టయ్య, ప్రవీణ్ తదితరులు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని నిర్వాహకులు సూచించారు.

ధార రఘుపతి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన స్నేహితులు

- యువత అభివృద్ధికి ధార రఘుపతి కృషి
- ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు



రాజాపూర్ నవంబర్ 6, వుదయం రాజాపూర్‌లో నవంబర్ 6న గుండ్ల పొట్లపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కమ్యూనిటీ అధ్యక్షుడు ధార రఘుపతి జన్మదిన వేడుకలను స్నేహితులు, యువజన నాయకులు, కమ్యూనిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధార రఘుపతికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ధార రఘుపతి సమాజ ఐక్యతను పెంపొందించడంతో పాటు యువత అభివృద్ధికి కృషి చేస్తున్నారని పలువురు కొనియాడారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ఆయన చేస్తున్న కృషిని వారు ప్రస్తావించారు. యువతలో సామాజిక చైతన్యం పెంచుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక డ్రైవ్

- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి మౌలిక వసతుల తనిఖీలు



సంగారెడ్డి, నవంబర్ 6:★వుదయం. సంగారెడ్డిలో నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులు, రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూగర్భ జలాలు, నీటి వనరుల నిర్వహణ, పర్యవేక్షణ, తాగునీటి సరఫరాపై జిల్లా స్థాయి కమిటీ సమీక్ష నిర్వహించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్నందున సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో గ్రామాల తాగునీటి వ్యవస్థలు, పైపులైన్లు, నీటి వనరులు, పంపులు, మోటార్ల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. లీకేజీలు, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలు, సరఫరా లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోని గ్రామాల్లో రోజువారీ తనిఖీలకు షెడ్యూల్ రూపొందించి నివేదికలు సమర్పించాలి. ఇంట్రా, గ్రిడ్ విభాగాల ఏఈఈలు, ఎంపీఓలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో బృందాలు ఏర్పాటు చేయాలి. వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలను ప్రోత్సహించాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లకు మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలి. పైపులైన్లు, వాల్వ్‌ల లీకేజీలను అరికట్టి, ఓహెచ్ఎస్ఆర్, జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు, సంపులను శుభ్రం చేయాలి. క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా చూసి బ్లీచింగ్ పౌడర్ నిల్వలు ఉంచాలి. నీటి కొరతకు అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ వనరులు, నీటి నాణ్యత, నిల్వ సామర్థ్యాన్ని అంచనా వేయాలి. అవసరమైన చోట అనుమతులతో ప్రత్యామ్నాయ సరఫరా, నీటి ట్యాంకర్లను సిద్ధం చేయాలి. విద్యుత్, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

పథకాల అమలును వేగవంతం చేయాలని సంజయ్ జాజు ఆదేశం

రైల్వే, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేసి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.





నాగర్ కర్నూల్, నవంబర్ 06 (వుదయం బ్యూరో): నాగర్ కర్నూలు జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. నవంబర్ 6న హైదరాబాద్ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, శాఖల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్య, గ్రామీణాభివృద్ధి, వీబీజీ రామ్ జీ, తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, రైల్వేలు, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. నాగర్ కర్నూలు నుంచి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు. హేమంత కేశవ్ పాటిల్ జిల్లాలోని పథకాలు, తాగునీటి ముందస్తు చర్యలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, బుల్లెట్ రైల్వే, రోడ్లు, సాగునీటి పనులు, భూసేకరణ వివరాలను సంజయ్ జాజుకు వివరించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, అల్పాహారం, యూనిఫారాల పంపిణీ, భవన నిర్మాణాలను కలెక్టర్ తరువాత సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఇబ్బందులు రాకుండా గ్రామీణ, పట్టణ అవసరాలను అంచనా వేసి ట్యాంకులు, బోర్లు, ఇతర వనరులను పరిశీలించాలని సంజయ్ జాజు సూచించారు. దెబ్బతిన్న బోర్లను మరమ్మతు చేసి సరఫరా ఏర్పాట్లు ముందుగానే పూర్తిచేయాలని ఆదేశించారు. వీబీజీ రామ్ జీ కింద గ్రామాల్లో పనులను గుర్తించి కూలీలకు ఎక్కువ ఉపాధి కల్పించాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

పనికి వెళ్లకుండా ఇంట్లో ఉన్న యువతి అదృశ్యం

- పోలీసులు యువతి ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు
- 3న ఇంట్లో ఉన్న యువతి కనిపించలేదు



బాలానగర్: నవంబర్ 6, వుదయం బాలానగర్ మండలంలో అనారోగ్యంగా ఉందని ఇంట్లోనే ఉన్న యువతి అదృశ్యమైంది. నవంబర్ 6 ఉదయం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై ఎస్సై నరేందర్ రెడ్డి వివరాలు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాకు చెందిన అనిత, హరేంద్ర దంపతులు బాలానగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నారు. వారికి 19 ఏళ్ల కుమార్తె ఉంది. ఈ నెల 3న అనారోగ్యంగా ఉందని చెప్పి యువతి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయింది. తల్లిదండ్రులు ఇంటికి తిరిగి వచ్చేసరికి యువతి కనిపించలేదు.

కొనుగోలు కేంద్రాలు తెరిచినా ప్రభుత్వ సేకరణ లేక రైతులు ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడుతున్నారు

- లారీలు, గన్నీ సంచులు లేవు
- వర్షంతో ఆరబెట్టిన ధాన్యం తడిసింది



దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 6, వుదయం: మిరుదొడ్డి, నవంబర్ 6: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా అనుమతులు, గోదాములు, రైస్‌మిల్లుల కేటాయింపులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మిరుదొడ్డి, అక్బర్‌పేటభూంపల్లి మండలాల్లోని అల్మాజిపూర్, జంగపల్లి, వీరారెడ్డిపల్లి, అక్బర్‌పేట, కూడవెల్లి, ధర్మారం గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నా లారీలు, గన్నీ సంచులు అందుబాటులో లేవని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఆరబోసిన ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోళ్లు మొదలుకాకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరలకు ధాన్యం కొంటూ రైతులకు నష్టం కలిగిస్తున్నారని కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ గోదాముల్లో ధాన్యం ఆరబోసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవడం విచారకరమన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలకు వెంటనే అనుమతులు మంజూరు చేసి గోదాములు, రైస్‌మిల్లులు, లారీలు, గన్నీ సంచులు కేటాయించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసనలు చేపడతామని కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శల ప్రకారం, పంటను అమ్ముకునేందుకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కొనుగోలు వ్యవస్థలోని లోపాలే కారణమయ్యాయి.

పొగాకు రహిత సమాజం కోసం వుదయం పాఠశాల విద్యార్థుల ప్రతిజ్ఞ

- వ్యక్తిగత సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలి.



నవాబుపేట, నవంబర్ 6, వుదయం నవాబుపేటలోని వుదయం మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 6న పొగాకు రహిత సమాజంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ నాగ్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని వారు ప్రకటించారు. ఉపాధ్యాయులు విద్యార్థి దశ ఎంతో కీలకమని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివిస్తున్నారని ఉపాధ్యాయులు గుర్తుచేశారు. వారి ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. పొగాకు, మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా భవిష్యత్తును నాశనం చేస్తుందని ఉపాధ్యాయులు హెచ్చరించారు. అలాంటి అలవాట్లకు విద్యార్థి దశలోనే దూరంగా ఉండాలని చెప్పారు. వ్యక్తిగత సమస్యలు ఎదురైనప్పుడు వాటిని మనసులో దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. వారి సలహాలు తీసుకుని సమస్యలను పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలని తెలిపారు. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కావని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ధైర్యంగా సమస్యలను ఎదుర్కొంటూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు.

పగటిపూట వెలుగుతున్న దీపాలతో విద్యుత్ వృథా

- దీపాల పగటి వెలుగుతో విద్యుత్ వృథా



కోయిలకొండ .నవంబర్ 6, వుదయం

కోయిలకొండలో నవంబర్ 6న వుదయం మండలంలోని రామన్న పల్లి తండా పంచాయతీ పరిధిలో వీధి దీపాలు పట్టపగలే వెలిగాయి. రాత్రివేళ ప్రజలకు వెలుతురు అందించాల్సిన దీపాలు పగటిపూట కూడా ఆన్‌లో ఉండటంతో విద్యుత్ వృథా అవుతోంది. దీపాల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటమే పరిస్థితికి కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాల్సిన అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పగటి సమయంలో దీపాలు వెలగడం వల్ల అవసరం లేని విద్యుత్ వినియోగం కొనసాగుతోందని గ్రామస్థులు చెబుతున్నారు.

నారాయణపేట జిల్లా స్థాయి బాలల విజ్ఞాన సదస్సు పోటీల్లో మూడు బృందాలు విజయం సాధించాయి

- మూడు విద్యార్థి బృందాలు విజేతలయ్యాయి
- జాజాపూర్ పాఠశాలలో పోటీలు జరిగాయి



నారాయణపేట నవంబర్ 6(వుదయం ప్రతినిధి) నారాయణపేటలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవంబర్ 6న జిల్లా స్థాయి జాతీయ బాలల విజ్ఞాన సదస్సు పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తి, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగింది. జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు వివిధ మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 48 విద్యార్థి బృందాలు హాజరయ్యాయి. పోటీల్లో విజేతలుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోగారానికి చెందిన ప్రియాంక, స్వప్న, జడ్పీహెచ్ఎస్ మద్దూరుకు చెందిన చందు, మనోహర్షిత్, జడ్పీహెచ్ఎస్ మరికల్‌కు చెందిన అఖిల, అక్షయ నిలిచారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా చుట్టూ ఉన్న సమస్యలను శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలని సూచించారు. సమస్యలపై పరిశీలనతో నూతన ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ఆయన చెప్పారు. విజేతలకు గోవిందరాజులు బహుమతులు అందజేశారు. స్ఫూర్తి డిగ్రీ కళాశాల అధ్యాపకులు కావేరి, మానస న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేత విద్యార్థి బృందాలను నిర్వాహకులు అభినందించారు.

13 మండలాల్లో కరువు. రైతులకు రుణ సడలింపులు

- పాత రుణాల వసూళ్లకు ఒత్తిడి వద్దు
- రైతులకు కొత్త రుణాలు తక్షణమే అందించాలి



మహబూబ్ నగర్:నవంబర్ 6, వుదయం నవంబర్ 6న మహబూబ్‌నగర్ జిల్లాలోని 13 మండలాలను ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా బ్యాంకర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక బ్యాంకర్ల సమీక్షా సమావేశంలో ఖుష్బూ గుప్తా ఈ సూచనలు చేశారు. కరువు తీవ్రత, మండలాల వివరాలు, నమోదైన వర్షపాతం, పంటల నష్టాన్ని పరిశీలించి మండలాలను రెండు వర్గాలుగా విభజించినట్లు ఆమె తెలిపారు. చిన్నచింతకుంట, కోయిల్ కొండ మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా వర్గీకరించారు. జిల్లాలోని మరో 11 మండలాలను మధ్యస్థ కరువు ప్రాంతాలుగా గుర్తించారు. ఈ వర్గీకరణ కరువు ప్రభావం మండలాలవారీగా ఉన్న తేడాను స్పష్టం చేసింది. కరువు బారినపడిన అర్హులైన రైతుల పంట రుణాలను 12 నెలల మారటోరియంతో పునర్వ్యవస్థీకరించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. రుణాల పునర్వ్యవస్థీకరణ ద్వారా పంట రుణాల చెల్లింపులకు తాత్కాలిక విరామం కల్పించాలన్నది ఆదేశాల ఉద్దేశం. ప్రస్తుత పరిస్థితుల్లో పాత రుణాల వసూళ్ల కోసం రైతులపై ఎలాంటి ఒత్తిడి తేవద్దని బ్యాంకర్లకు ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాత బకాయిల వసూళ్లలో ఒత్తిడి చేయకూడదని పేర్కొన్నారు. తదుపరి వ్యవసాయ పనులు, జీవనోపాధికి ఇబ్బంది లేకుండా రైతులకు కొత్త రుణాలు తక్షణమే అందించాలని బ్యాంకర్లకు సూచించారు.

విజయ్ సేతుపతి తొలి భారతీయ నటుడు

- విజయ్ సేతుపతి తొలి భారతీయ ఎమ్మీ ప్రజెంటర్



డెస్క్ విలేఖరి

న్యూయార్క్‌లో 2026 నవంబర్ 23న జరగనున్న 54వ అంతర్జాతీయ ఎమ్మీ అవార్డుల వేడుకలో తమిళ నటుడు విజయ్ సేతుపతి అవార్డు అందించే ప్రజెంటర్లలో ఒకరిగా పాల్గొనున్నారు. ఈ వేడుకలో అవార్డు అందించే తొలి భారతీయ నటుడిగా ఆయన గుర్తింపు పొందనున్నారు. విజయ్ సేతుపతి ఈ ఘనతతో అంతర్జాతీయ ఎమ్మీ వేదికపై కొత్త రికార్డు నెలకొల్పనున్నారు. 2016లో లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ వేడుకలో ప్రియాంకా చోప్రా, టామ్ హిడిల్‌స్టన్‌తో కలిసి అవార్డు అందించారు. అంతర్జాతీయ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అకాడమీ బోర్డు సభ్యురాలు, నిర్మాత కవితా గుప్తా భారతీయ ప్రతిభకు ఈ వేదికపై అవకాశాలు కల్పించడంలో కీలకంగా ఉన్నారు.

మిగిలిపోయిన ఆహారాన్ని వేడి చేసి తింటున్నారా..



మిగి
లిపోయిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసి తినడం చాలా మందికి రోజువారీ అలవాటు. ఇలా చేయడం వల్ల సమయం ఆదా కావడంతోపాటు ఆహార వృథా కూడా తగ్గుతుంది. అయితే వండిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసే విధానం కూడా వంట చేసినంతే ముఖ్యమని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (FSSAI) సూచిస్తోంది. సరైన పద్ధతిలో వేడి చేయకపోతే ఆహారంలో బ్యాక్టీరియా పెరిగి ఫుడ్ పాయిజనింగ్ వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. చాలామంది క్రితం రోజు కూర లేదా పప్పును వేడి చేస్తూ దానిలో తాజాగా వండిన కూర లేదా పప్పును కలిపేస్తుంటారు. అయితే ఇలా చేయకూడదని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచిస్తోంది. తాజాగా వండిన ఆహారం, మిగిలిన ఆహారం ఉష్ణోగ్రతలు, తాజాదనం వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి రెండింటినీ విడివిడిగా బాగా వేడి చేసి, అవసరమైతే తర్వాత మాత్రమే కలపడం మంచిది. ఒకే ఆహారాన్ని పదే పదే వేడి చేసి మళ్లీ ఫ్రిజ్‌లో పెట్టడం కూడా మంచిది కాదు. ప్రతిసారి ఫ్రిజ్ నుంచి బయటకు తీసి వేడి చేసి, మళ్లీ చల్లబరిచి నిల్వ చేయడం వల్ల బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు ఎక్కువవుతాయి. అందుకే ఒకసారి మాత్రమే వేడి చేసి తినేలా ముందుగానే అవసరమైన పరిమాణాన్ని తీసుకోవడం ఉత్తమం. మిగిలిన ఆహారాన్ని మొత్తం వేడి చేయకుండా, తినాల్సినంత మాత్రమే తీసుకుని వేడి చేయాలి. మిగతా ఆహారాన్ని ఫ్రిజ్‌లో అలాగే ఉంచడం వల్ల దాని

నాణ్యత
సురక్షితంగా ఉంటుంది. ఉదాహరణకు నలుగురికి సరిపడే పులావ్ మిగిలి ఉండి ఒక్కరే తినాల్సి వస్తే, మొత్తం కాకుండా ఒక్క సర్వింగ్ మాత్రమే వేడి చేసుకోవాలి. మైక్రోవేవ్‌లో ఆహారం వేడి చేసేటప్పుడు మధ్య మధ్యలో బాగా కలపాలి. చాలాసార్లు పైభాగం మాత్రమే వేడిగా ఉండి, లోపల మాత్రం చల్లగానే ఉంటుంది. ఇలా సమానంగా వేడి కాకపోతే కొన్ని ప్రాంతాల్లో బ్యాక్టీరియా జీవించే అవకాశం ఉంటుంది. అందుకే ఆహారం మొత్తం సమానంగా వేడెక్కేలా కలుపుతూ వేడి చేయడం అవసరం. ఫ్రిజర్‌లో నిల్వ చేసిన ఆహారాన్ని నేరుగా స్టవ్‌పై లేదా మైక్రోవేవ్‌లో వేడి చేయకూడదు. ముందుగా పూర్తిగా కరిగిన తర్వాత మాత్రమే వేడి చేయాలి. లేదంటే బయట భాగం ఎక్కువగా వేడెక్కి, లోపల చల్లగా ఉండే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఆహారం సురక్షితంగా మారదు. సరిగా వేడి చేయని ఆహారం చూసేందుకు లేదా వాసనకు బాగానే అనిపించినా, అందులో బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. అలాంటి ఆహారం తీసుకుంటే కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి ఫుడ్ పాయిజనింగ్ లక్షణాలు కనిపిస్తాయి. మిగిలిన ఆహారాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేసి, అవసరమైనంత మాత్రమే ఒక్కసారి వేడి చేసి తీసుకోవడం ద్వారా ఆహార వృథాను తగ్గించడంతోపాటు కుటుంబ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని ఆహార భద్రత నిపుణులు సూచిస్తున్నారు.

చక్కని ఆరోగ్యం

ప్రెగ్నెన్సీలో డయాబెటిస్ వస్తే భవిష్యత్తులో ప్రమాదమా?

గర్భధారణ సమయంలో మహిళ శరీరంలో ఎన్నో హార్మోన్ల మార్పులు జరుగుతాయి. ఈ మార్పుల కారణంగా కొందరిలో రక్తంలో చక్కెర స్థాయిలు తాత్కాలికంగా పెరుగుతాయి. ఈ పరిస్థితినే గర్భధారణ మధుమేహం అంటారు. సాధారణంగా ప్రసవం తర్వాత ఈసమస్య తగ్గిపోతుంది. అయితే, భవిష్యత్తులో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని ఇది పెంచే అవకాశం ఉందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. స్వీడన్‌లో నిర్వహించిన ఒక అధ్యయనంలో 10 లక్షలకు పైగా మహిళల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. ఈ పరిశోధన ఫలితాలు జర్నల్ ఆఫ్ క్లినికల్ మెడిసిన్‌లో ప్రచురితమైంది. గర్భధారణకు ముందు పూర్తిగా ఆరో గ్యంగా ఉన్న మహిళలకు కూడా గర్భధారణ మధుమేహం వస్తే, భవిష్యత్తులో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం పెరుగుతుందని పరిశోధకులు గుర్తించారు. గర్భధారణ సమయంలో విడుదలయ్యే కొన్ని హార్మోన్లు ఇన్సులిన్ సరిగా పనిచేయకుండా ప్రభావితం చేస్తాయి. దీంతో శరీరంలో ఇన్సులిన్ నిరోధకత పెరిగి, రక్తంలో చక్కెర స్థాయిలు అధికమవుతాయి. ఈ పరిస్థితినే గర్భధారణ మధుమేహం అంటారు. చాలా సందర్భాల్లో దీనికి బయటకు కనిపించే ప్రత్యేక లక్షణాలు ఉండవు. గర్భధారణ సమయంలో చేసే సాధారణ రక్త పరీక్షల ద్వారానే దీన్ని గుర్తిస్తారు. సరైన ఆహారం, వ్యాయామం, అవసరమైతే వైద్యుల సూచనలతో దీనిని నియంత్రించవచ్చు. ఈ పరిశోధనలో గర్భధారణ సమయంలో మధుమేహం వచ్చిన మహిళలకు, తర్వాత జీవితంలో టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని గుర్తించారు. ఊబకాయం ఉన్న మహిళల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉన్నప్పటికీ, సాధారణ బరువు ఉన్న మహిళలు కూడా ఈ ప్రమాదం నుంచి పూర్తిగా బయటపడలేరని అధ్యయనం వెల్లడించింది. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. గర్భధారణ అనేది మహిళకు ఒక రకమైన ఒత్తిడి వంటిది.



దోమలు కొందరినే ఎక్కువగా ఎందుకు కుడతాయో తెలుసా?

దోమలు 'నన్నే ఎందుకు ఎక్కువగా కుడుతున్నాయి?' అనే సందేహం చాలామందికి ఉంటుంది. అయితే దీనికి యాదృచ్ఛికం మాత్రమే కారణం కాదు. మన శరీరం నుంచి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్, చెమటలోని రసాయనాలు, శరీర ఉష్ణోగ్రత, బ్లడ్ గ్రూప్, చర్మంపై ఉండే బ్యాక్టీరియా వంటి అనేక అంశాలు దోమలను ఆకర్షిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. అందుకే ఒకే గదిలో ఉన్నప్పటికీ కొందరినే దోమలు ఎక్కువగా కుడుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. మనం శ్వాస తీసుకుని వదిలినప్పుడు కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. దోమలు ఈ వాయువును దూరం నుంచే గుర్తించగలవు. వ్యాయామం చేసే వారు లేదా శారీరకంగా ఎక్కువ శ్రమించే వారు ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ విడుదల చేస్తారు. అందుకే వారివైపు దోమలు ఎక్కువగా ఆకర్షితమవుతాయి. మన చెమటలో ఉండే లాక్టిక్ యాసిడ్, అమ్మోనియా వంటి రసాయనాలు దోమలను ఆకర్షిస్తాయి. అలాగే శరీర ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే వారిని కూడా దోమలు త్వరగా గుర్తిస్తాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం.. 'O' బ్లడ్ గ్రూప్ ఉన్నవారిని దోమలు ఎక్కువగా ఆకర్షించే అవకాశం ఉందని గుర్తించారు. 'A' బ్లడ్ గ్రూప్ ఉన్నవారితో పోలిస్తే, 'O' గ్రూప్ ఉన్నవారిని దోమలు ఎక్కువగా ఆకర్షిస్తాయని పరిశోధనల్లో వెల్లడైంది. 'B' బ్లడ్ గ్రూప్ ఉన్నవారు ఈ రెండింటి మధ్యస్థంగా ఉన్నట్లు చెబుతున్నారు. కొంతమంది శరీర లక్షణాలు దోమలను ఎక్కువగా ఆకర్షించేలా ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి.



అమ్మా, స్కూల్లో టీచర్ సోషల్ బుక్ తీయమంటే... సైన్స్ పుస్తకం తీస్తున్నా. ఇంట్లో నా రూమ్‌కి వెళ్లబోయి మాస్టర్ బెడ్‌రూమ్‌కి వెళ్లిపోతున్నా... ఏమైంది అమ్మా నాకు? ఇలా మీ పిల్లలూ అడు

అది మెదడు ఆడే ఆటేనట..!




గుతున్నారా? కంగారు పడకండి. వాళ్లు కావాలని ఈ పొరపాట్లు చేయడం లేదని సైకాలజీ నిపుణులు చెబుతున్నారు. సైన్స్‌లో దీన్నే 'యాక్షన్ స్లిప్' అంటున్నారు. మనకు బాగా అలవాటైన పనులను మెదడు ఆటోపైలట్ మోడ్‌లో చేసుకుంటూ వెళ్తుందట. అలాగే సోషల్ పుస్తకానికి బదులుగా సైన్స్ బుక్ తీయడాన్ని 'డిస్క్రిప్షన్ ఎర్రర్' అంటున్నారు. అంటే ఒకేలాంటి వస్తువులు ఉన్నప్పుడు ఏకాగ్రత కాస్త పక్కకు మళ్లినా మెదడులో ఇలా అయోమయం నెలకొంటుందట. ఈ రెండు స్థితుల్ని కలిపి 'ఆబ్సెంట్ మైండెడ్‌నెస్' అని చెబుతున్నారు నిపుణులు. ఈ లోపాలను సవరించాలంటే... పిల్లలకి మనం ఏదైనా పని చెప్పినప్పుడు... 'నేను ఏం చెప్పానో ఒకసారి మళ్లీ చెప్పు' అని మృదువుగా అడగాలి. తన నోటితోనే మీరు చెప్పిన విషయాన్ని మరోసారి చెప్పించాలి. ఇలా చేస్తే ఆ విషయం వాళ్ల మెదడులో రిజిస్టరవుతుంది. ఇక, పుస్తకాల విషయంలో సబ్జెక్టుని బట్టి పుస్తకాలకు బ్లూ, గ్రీన్ వంటి రంగుల అట్టలు వేయాలి. రంగులను మన మెదడు త్వరగా గుర్తిస్తుంది కాబట్టి, వాళ్ల ధ్యాస మళ్లదు. వీటితోపాటు ఏకాగ్రతను పెంచడానికి పజిల్స్, చదరంగం వంటి మైండ్‌ఫుల్ గేమ్స్ ఆడిస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెబుతున్నారు.

పేపర్ బ్యాగే ఎందుకు?



మన ఇంట్లో మామిడి, అరటి పండు వంటివి సరిగా పండకపోతే పేపర్ బ్యాగ్‌లో పెట్టడం చూస్తున్నాం. కానీ, ఎప్పుడైనా అది ఎలా సాధ్యమవుతుందో గమనించారా? మనలో చాలామంది గొప్ప చెఫ్స్, సెలెబ్రిటీలు చెప్పిన చిట్కాలు చదవడానికి ఆసక్తి చూపిస్తున్నాం. కానీ, ఒక్కసారి మన ఇంట్లో మన నానమ్మ, అమ్మ చేసే ఈ చిన్ని మ్యాజిక్‌ను గమనించారా? కొన్ని దశాబ్దల నుంచి ఇలా చేస్తూ వస్తున్నారు. కాలక్రమేణ 'ఎలా.. ఎందుకు' అనే ప్రశ్నలు అడగకపోవడం వల్ల మర్చిపోయిన ఈ మ్యాజిక్ వెనుక రహస్యాన్ని తెలుసుకుందాం. పండ్లలో రెండు రకాలు ైక్లెమెటిక్, నాన్ ైక్లెమెటిక్ అని ఉంటాయి. ఎథిలీన్ విడుదల చేసేవి.. విడుదల చేయనివి. ఎథిలీన్ విడుదల చేసే పండ్లు ైక్లెమెటిక్ కోవకు చెందినవి. ఇవి పండటానికి చెట్టుకే ఉండనవసరం లేదు. చెట్టు నుంచి కోసిన తరువాత కూడా ఇలా పేపర్ బ్యాగ్‌లో ఉంచితే గ్యాస్ విడుదల చేసి పండుతాయి. కానీ, పుచ్చకాయ, నిమ్మ, చెర్రీ, దోసకాయ వంటి నాన్ ైక్లెమెటిక్ పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత పక్వానికి రావు. ఎథిలీన్‌ను విడుదల చేయవు కాబట్టి, వీటిపై ఈ చిట్కా పనిచేయదు. అవి పండాలంటే కచ్చితంగా చెట్టుకే ఉండాలి. లేకపోతే తగిన రుచి, పక్వం, తీపిని సమకూర్చుకోలేవు. పేపర్ బ్యాగ్‌లోనే ఎందుకంటే ఆపిల్, మామిడి, కివీ, పీచ్, అవకాడో వంటి పండ్లు పక్వం చెందే సమయంలో 'ఎథిలీన్' అనే సహజ వాయువును విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలో కార్బన్ డయాక్సైడ్, ఆక్సిజన్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. కార్బన్ డయాక్సైడ్‌ను బంధించకుండా దానికి తగిన తోవను చూపడంలోనూ, ఆక్సిజన్ లోపలికి వచ్చే వెసులుబాటును పేపర్ బ్యాగ్ కల్పిస్తుంది. ఈ పండ్లను ప్లాస్టిక్ కవర్‌లో ఉంచితే కార్బన్ డయాక్సైడ్ బయటికి వెళ్లే అవకాశం లేక, ఆక్సిజన్ లోనికి వచ్చే మార్గం లేక.. పండ్లు కుళ్లిపోతాయి.

ప్రొటీన్‌కు ప్లేస్ ఇవ్వండి..



పప్పులు, వేయించిన శనగలు, మొలకెత్తిన విత్తనాల్లో పుష్కలంగా ప్రొటీన్ దొరుకుతుంది. పాలు తీసుకుంటే కాల్షియంతోపాటు ప్రొటీన్ వస్తుంది. పెరుగుతో మంచి బ్యాక్టీరియా అందుతుంది. అలానే కేవలం గోధుమ పిండికి బదులుగా రాగి, శనగ, సోయాబీన్స్ కలిపిన మల్టీగ్రెయిన్ గోధుమపిండిని ఉపయోగించండి. పల్లీలు, బాదం, నువ్వులు, ఫ్లాక్‌సీడ్స్, గుమ్మడి గింజలను సలాడ్స్‌లో, ఓట్స్‌లో చేర్చి తీసుకోండి. ఇక మాంసాహారులు గుడ్లు, చికెన్, చేపలు, సోయా ఉత్పత్తులు రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడంతో అందుబాటు ధరలో ఉండే అధిక ప్రొటీన్‌ను పొందవచ్చు. ప్లేట్‌లో ప్రొటీన్ రిచ్ ఫుడ్‌ని చేర్చుకోవడం వల్ల కావాల్సిన శక్తి లభిస్తుంది. దాంతోపాటు ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉంటుంది. దీనివల్ల చిరుతిళ్ల గొడవ ఉండదు. మరెందుకు ఆలస్యం మీ డైట్‌లో తగినంత ప్రొటీన్ ఉండేలా ప్రణాళికలు అమలు చేయండి.

కడుపుబ్బరం.. ఇవీ కారణం కావచ్చు..!

ఇష్టమైన ఆహారం ఎక్కువగా లాగించినా, మలబద్ధకం ఉన్నా, కడుపులో గ్యాస్ ఏర్పడినా, నీళ్లు ఎక్కువగా తాగినా, నెలసరి సమయంలో.. ఇలా పలు సందర్భాల్లో కడుపు ఉబ్బరంగా అనిపించడం సహజమే! దాంతో తలెత్తే అసౌకర్యం వల్ల ఇతర పనులపై దృష్టి పెట్టలేం.. మరి, ఈ సమస్యను తగ్గించుకోవాలంటే కొన్ని చిన్న చిన్న చిట్కాలు పాటించాలంటున్నారు నిపుణులు. పీచు, ద్రవాహారం తక్కువగా తీసుకోవడం.. వ్యాయామం చేయకపోవడం.. వంటివి మలబద్ధకానికి దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఈ సమస్య వల్ల కడుపుబ్బరం సమస్య తలెత్తవచ్చని చెబుతున్నారు. అందుకే పీచు అధికంగా ఉండే ఆహార పదార్థాల్ని రోజూ తీసుకోవడం మంచిదని సలహా ఇస్తున్నారు. ఈ క్రమంలో మహిళలు రోజూ తాము తీసుకునే ఆహారంలో పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలి. తృణధాన్యాలు, పండ్లు, కాయగూరలు, పప్పులు, నట్స్, గింజల్లో.. పీచు అధికంగా ఉంటుంది. వీటితో పాటు ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలంటున్నారు నిపుణులు. సమయం లేదనో, ఇతర కారణాల రీత్యానో కొంతమంది గబగబా భోజనం చేసేస్తుంటారు.



కడుపులో గ్యాస్, ఉబ్బరానికి ఇది కూడా ఓ కారణమే అంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇలా త్వరత్వరగా తినడం వల్ల ఆహారంతో పాటు గాలి కూడా కడుపులోకి వెళ్లిపోయి ఈ సమస్యల్ని తెచ్చిపెడుతుందట! అందుకే భోజనానికి కనీసం అరగంటైనా కేటాయించమంటున్నారు. అలాగే ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినడమూ ముఖ్యమే! ఈ క్రమంలో పదార్థం రుచిని ఆస్వాదించడంతో పాటు జీర్ణవ్యవస్థ కూడా చురుగ్గా ఉంటుందని, మరీ ఎక్కువ ఆహారం తీసుకోకుండానూ జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. కడుపులోని మంచి బ్యాక్టీరియా ఉబ్బరాన్ని తగ్గిస్తుందట! ఇందుకోసం ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు, మజ్జిగ.. వంటివి రోజువారీ ఆహారంలో భాగం చేసుకోమంటున్నారు నిపుణులు. రాత్రుళ్లు ఆలస్యంగా తినడం, అర్ధరాత్రి దాటాక పడుకోవడం వల్ల నిద్ర సరిపోదు. తద్వారా ఆహారం అరక్కపోవడం, గ్యాస్, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. అందుకే త్వరగా తినడం, వేళకు పడుకోవడం మంచిదని చెబుతున్నారు.

ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలకు తమ ఆరోగ్యంపైన దృష్టిపెట్టే అవకాశమే ఉండట్లేదు. ముఖ్యంగా ఇల్లు, ఆఫీసు బాధ్యతల మధ్య జిమ్‌కు వెళ్లడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటప్పుడు ఈ 'మినీ వర్కౌట్లు'

విరామంతో వ్యాయామం చేద్దాం..

ఎంచుకోండి. కోరుకున్న ఫలితాల్ని సులువుగా అందు కోవచ్చు అంటున్నారు నిపుణులు. ఉదయం లేచిన వెంటనే నేరుగా వంట గదిలోకి పరుగెత్తడం మనలో చాలామందికి అలవాటు. బదులుగా ఓ ఐదు నిమిషాల పాటు శరీరాన్ని స్ట్రెచ్ చేయండి. ఆ తర్వాతే పనిలోకి దిగండి. దీనివల్ల రోజంతా చురుగ్గా పని చేసుకోగలరు. చిన్న మార్పే కానీ పెద్ద ప్రయోజనం ఇస్తుంది. మధ్యాహ్నమో లేదా సాయంత్రం వేళలోనో కాస్త సమయం దొరికితే... స్క్వాట్స్, మెట్లు ఎక్కి దిగడం వంటి సులువైన వ్యాయామాలు చేయండి. ఇవి కాళ్లు, నడుము కండరాలను బలోపేతం చేస్తాయి. వంటింట్లో పనులు చేసుకునేటప్పుడు కాసేపు కాలి వేళ్లపై నిలబడండి. దీని వల్ల కాళ్ల నరాలు ఉత్తేజితమవుతాయి. కుర్చీని ఆధారంగా చేసుకుని డిప్స్ చేయడం వల్ల చేతుల కండరాలు దృఢంగా తయారవుతాయి. గోడ కుర్చీ కూడా వేయొచ్చు. అలానే, హృదయ స్పందన రేటు మెరుగుపడటానికి ఇంట్లోనే కాసేపు వేగంగా నడవడం, స్పాట్ జాగింగ్ వంటివి చేసినా మంచిదే. రక్తప్రసరణ సజావుగా సాగడానికి ఈ కసరత్తులు తోడ్పడతాయి. అధిక బరువు సమస్యనూ అదుపులో ఉంచుతాయి. చిన్న చిన్న విరామాలతో ఈ వర్కవుట్లు చేయడం వల్ల అలసటా రాదు. పైగా శారీరకంగానే కాదు... మానసికంగానూ దృఢంగా మారుస్తాయి. మీరూ ప్రయత్నించి చూడండి.



చాక్లెట్లు రుచి కోల్పోకుండా ఉండాలంటే ..

చాక్లెట్ అంటే చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన తీపి పదార్థం. అయితే దానిని సరైన విధంగా నిల్వ చేయకపోతే రుచి, సువాసన, మెత్తదనం తగ్గిపోవడమే కాకుండా తెల్లని మచ్చలు కూడా కనిపిస్తాయి. కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటిస్తే ప్యాకెట్‌లో ఉండే చాక్లెట్ బార్లు ఎక్కువకాలం తాజాగా, రుచికరంగా ఉంటాయి. చాక్లెట్‌లో ఉండే కోకో బటర్ ఉష్ణోగ్రత మార్పులకు చాలా సున్నితంగా స్పందిస్తుంది. అధిక వేడి లేదా తరచూ మారే ఉష్ణోగ్రతల కారణంగా కోకో బటర్ పైకి వచ్చి చాక్లెట్‌పై తెల్లని పొర ఏర్పడుతుంది. దీనిని ఫ్యాట్ బ్లూమ్ అంటారు. ఇది ఆరోగ్యానికి హానికరం కాకపోయినా చాక్లెట్ రుచి, నాణ్యతపై ప్రభావం చూపుతుంది. అలాగే చాక్లెట్ చుట్టుపక్కల ఉన్న ఆహార పదార్థాల వాసనను సులభంగా పీల్చుకునే స్వభావం కలిగి ఉంటుంది. చాక్లెట్‌ను 15 నుంచి 20 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలో, చల్లగా, పొడిగా ఉండే ప్రదేశంలో నిల్వ చేయడం ఉత్తమం. నేరుగా ఎండ తగలని అల్మరా, డ్రాయర్ లేదా ప్యాంట్రీలో ఉంచడం మంచిది. ఒకే రకమైన ఉష్ణోగ్రత ఉండే ప్రదేశంలో నిల్వ చేస్తే చాక్లెట్ నాణ్యత ఎక్కువకాలం నిలుస్తుంది. సాధారణ పరిస్థితుల్లో చాక్లెట్‌ను ఫ్రిజ్‌లో ఉంచాల్సిన అవసరం ఉండదు. ఫ్రిజ్‌లోని తేమ కారణంగా చాక్లెట్‌పై షుగర్ బ్లూమ్ అనే తెల్లని పొర ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాగే ఫ్రిజ్‌లో ఉన్న ఇతర ఆహార పదార్థాల వాసనను కూడా చాక్లెట్ పీల్చుకుంటుంది. అయితే వేసవిలో లేదా అధిక వేడి, తేమ ఉండే ప్రాంతాల్లో గది ఉష్ణోగ్రత 20 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటే ఫ్రిజ్‌లో నిల్వ చేయడం మంచి ఎంపికగా ఉంటుంది. చాక్లెట్‌ను ఫ్రిజ్‌లో ఉంచాల్సి వస్తే ముందుగా దానిని అసలు ప్యాకెట్ లేదా అల్యూమినియం ఫాయిల్‌తో బాగా చుట్టాలి. అనంతరం గాలి చొరబడని డబ్బాలో ఉంచాలి. ఉల్లి, వెల్లుల్లి వంటి ఘాటైన వాసన వచ్చే ఆహార పదార్థాలకు దూరంగా నిల్వ చేయాలి. ఫ్రిజ్ నుంచి బయటకు తీసిన వెంటనే ప్యాకెట్‌ను తెరవకుండా, ముందుగా అది గది ఉష్ణోగ్రతకు చేరుకునే వరకు వేచి ఉండాలి. ఇలా చేయడం వల్ల చాక్లెట్‌పై నీటి బిందువులు ఏర్పడకుండా ఉంటాయి. చాక్లెట్‌ను స్టవ్, ఓవెన్ వంటి వేడి ఎక్కువగా ఉండే ప్రాంతాల దగ్గర ఉంచకూడదు. నేరుగా సూర్యకాంతి తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయకూడదు. తేమ ఎక్కువగా ఉండే ప్రదేశాలను కూడా నివారించాలి. అలాగే తరచూ వేడి నుంచి చల్లదనం, చల్లదనం నుంచి వేడి వాతావరణానికి మార్చడం కూడా చాక్లెట్ నాణ్యతను దెబ్బతీస్తుంది. డార్క్ చాక్లెట్‌లో పాల పదార్థాలు తక్కువగా ఉండటం వల్ల అది మిల్క్ చాక్లెట్ లేదా వైట్ చాక్లెట్‌తో పోలిస్తే ఎక్కువకాలం నిల్వ ఉంటుంది. సరైన విధంగా భద్రపరిస్తే చాలా చాక్లెట్ బార్లు నెలల తరబడి మంచి నాణ్యతతో ఉంటాయి.




వాహన సొల్యూషన్స్‌లోకి ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా

అగ్రగామి గృహోపకరణాలు, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా, వాహన సొల్యూషన్స్ వ్యాపారంలోకి అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. దీంతో భారత్‌లోకి దక్షిణ కొరియా మాతృసంస్థ నిర్వహిస్తున్న గ్లోబల్ బీ2బీ ఆటోమోటివ్ వ్యాపారం రానుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ఉన్న ఎల్‌జీ ఇండియా 3వ ప్లాంట్ నుంచి ఈ వాహన సొల్యూషన్స్ ఉత్పత్తులను తయారు చేసి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేయనున్నారు. మార్కెట్ పరిస్థితులు, సాంకేతికత ఆధారంగా విడతల వారీగా పెట్టుబడులు పెట్టనున్నారు. సెప్టెంబరు త్రైమాసికంలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ నికర లాభం 25.65% వృద్ధితో రూ.489.34 కోట్లకు, ఆదాయం 19.53% పెరిగి రూ.7,380.04 కోట్లకు చేరుకున్నాయి.

బిజినెస్

భారీ లాభాల్లో ముగిసిన సూచీలు..



దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. వరుసగా ఏడో రోజూ లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు ఉన్నా.. మన మార్కెట్లు రాణించాయి. ఇన్నాళ్లూ ఏఐ పెట్టుబడులు లేవన్న కారణంగా ఏ మదుపర్లయితే భారతీయ స్టాక్ మార్కెట్‌ను పక్కన పెట్టారో.. ఇప్పుడు 'యాంటీ ఏఐ' సెంటిమెంట్‌తో వారే కొనుగోళ్లకు దిగడం సూచీలకు కలిసొచ్చింది. ఈ క్రమంలో సెన్సెక్స్ ఏకంగా 1700 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 25వేల మార్కు దాటింది.

సెన్సెక్స్ ఉదయం 79,413.66 (క్రితం ముగింపు 79,310.01) పాయింట్ల వద్ద స్వల్ప లాభాలతో ప్రారంభమైంది. కాసేపటికే భారీ లాభాల్లోకి వచ్చింది. చివరికి 1718.01 పాయింట్ల లాభంతో ఇంట్రాడే గరిష్ఠమైన 81,028.02 వద్ద ముగిసింది. నిఫ్టీ 493.75 పాయింట్ల లాభంతో 25,030 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.89గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ మినహా మిగిలిన స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు భారీగా లాభపడ్డాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు విజయం సాధించడంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగానికి సంబంధించిన నిబంధనలు కఠినతరం కానున్నాయన్న ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో దీనివల్ల భారత్ 'యాంటీ-ఏఐ' ప్రయోజనాన్ని పొందుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. విదేశీ సంస్థాగత మదుపర్లు (FII) గురువారం ఒక్కరోజే ఏకంగా రూ.14,975 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. గత ఆరు సంవత్సరాలలో ఒక్క రోజులో ఈ స్థాయిలో విదేశీ పెట్టుబడులు రావడం ఇదే మొదటిసారి. దీంతో మార్కెట్ సెంటి మెంట్ బలపడింది. కంపెనీల రెండో త్రైమాసిక ఫలితాలు అంచ నాల కంటే మెరుగ్గా ఉండటం మార్కెట్‌కు దన్నుగా నిలిచింది. దీనికి తోడు లార్జ్ క్యాప్ షేర్లు గత కొంతకాలంగా పతనం కావడంతో ప్రస్తుతం అవి ఆకర్షణీయంగా మారాయి. దీంతో వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటం మార్కెట్ పెరుగుదలకు దోహదం చేసిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఎల్ఐసీ లాభం రూ.12,076 కోట్లు



ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో రూ.12,076 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.10,053 కోట్లతో పోలిస్తే ఇది 20 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.2,39,614 కోట్ల నుంచి రూ.2,62,739 కోట్లకు చేరింది. నికర ప్రీమియం ఆదాయం రూ.1,26,479 కోట్ల నుంచి రూ.1,47,018 కోట్లకు చేరింది. రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ.64,996 కోట్ల నుంచి రూ.68,375 కోట్లకు పెరిగింది. తొలి ఏడాది ప్రీమియం రూ.10,836 కోట్ల నుంచి స్వల్పంగా తగ్గి రూ.10,432 కోట్లకు పరిమితమైంది. మొత్తం వ్యయాలు రూ.2,30,160 కోట్ల నుంచి రూ.2,52,116 కోట్లకు చేరాయి. 2026 సెప్టెంబరు 30తో ముగిసిన 6 నెలల కాలానికి ఎల్ఐసీ వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ (వీఎన్‌బీ) 33.95 శాతం పెరిగి రూ.6,846 కోట్లకు చేరింది. గత ఏడాది కాలంలో ఇది రూ.5,111 కోట్లుగా ఉంది. వచ్చే 3, 4 త్రైమాసికాల్లో ఇది మరింత మెరుగయ్యే అవకాశం ఉందని ఎల్ఐసీ ఎండీ, సీఈఓ ఆర్.దొరైస్వామి అంచనా వేశారు. ఓపెన్ ఆర్కిటెక్చర్ విధానం వల్ల ఐడీబీఐ బ్యాంక్‌లో వాటా అమ్మకం తర్వాత కూడా వ్యాపార భాగస్వామ్యం కొనసాగుతుందని, అలాగే ఆర్‌బీఎల్ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లతో ఎల్ఐసీ కుదుర్చుకున్న కొత్త ఒప్పందాల ప్రభావం ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో కనిపిస్తుందని ఎండీ పేర్కొన్నారు. ఎల్ఐసీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.59,60,941 కోట్లకు పెరిగింది.

ఎండీఆర్ ఛార్జీలను వ్యాపారులు

వినియోగదార్లపై మోపడానికి వీల్లేదు



కొత్త యూపీఐ ధరల నిబంధనల ప్రకారం వ్యాపారులు ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్) ఛార్జీలను వినియోగదారులపై వేయడానికి వీల్లేదని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన, వ్యక్తుల నుంచి వ్యాపారులకు జరిగే నిర్దిష్ట యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు విధించే నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై, సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్‌పీసీఐ వంటి ఇతర సంస్థల నుంచి స్పందనలను కోరింది. అయితే ఈ అంశాన్ని పరిశీలించే వరకు సదరు నిర్ణయాన్ని నిలిపివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినప్పటికీ, సవరించిన విధానంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. నవంబరు 3న దాఖలు చేసిన ప్రతిస్పందన అఫిడవిట్‌లో యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు వినియోగదార్లపై యూపీఐ అప్లికేషన్ ప్రొవైడర్లు ప్లాట్‌ఫామ్ ఫీజులు లేదా ఇతర ఛార్జీలను విధించకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనానికి ఎన్‌పీసీఐ తెలిపింది.

భారీగా పతనమైన అమెరికా మార్కెట్లు



మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత భారీగా ర్యాలీ అయిన అమెరికా మార్కెట్లు.. మరుసటి రోజు ఢమాల్‌న కింద పడ్డాయి. వాల్‌స్ట్రీట్‌లో మదుపర్లు అమ్మకాలకు దిగడంతో 19 నెలల్లో ఎన్నడూలేనంత పతనాన్ని చవిచూశాయి. నాస్‌డాక్ సూచీ 5.52 శాతం పడిపోగా.. గత 19 నెలల్లో రోజువారీ అత్యధిక నష్టం ఇదే. ఎస్‌అండ్‌పీ 4.36 శాతం, డోజోన్స్ 3.4 శాతం చొప్పున క్షీణించాయి. గతేడాది ఏప్రిల్ తర్వాత ఈ ప్రధాన సూచీలు ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, స్పేస్ ఎక్స్ షేర్లు భారీగా పతనమయ్యాయి.

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత వాల్‌స్ట్రీట్‌లో ఉత్సాహం కనిపించింది. మార్కెట్లు హైజంప్ చేశాయి. ఆ వెంటనే మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో కృత్రిమ మేధ, సెమీకండక్టర్ చిప్స్ తయారుచేసే కంపెనీల షేర్లు భారీగా పడ్డాయి. అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్, మైక్రాన్ టెక్నాలజీ, ఎన్విడియా స్టాక్స్ పతనమయ్యాయి. టెక్, ఏఐ రంగాల షేర్లు విలువకు మించి పెరిగాయని మదుపర్లు ఆందోళన చెందడమే ఇందుకు కారణమైంది. మరోవైపు అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల్లో డెమోక్రాట్లకే ఆధిపత్యం రావడంతో తొలుత మదుపర్లు ఆనందపడ్డారు. కానీ.. తర్వాత వారిని మరో విషయం ఆందోళనకు గురిచేసింది. ఏఐ డేటా సెంటర్ల విస్తరణను పలువురు డెమోక్రాట్లు వ్యతిరేకించారు. ఆ సెంటర్ల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని, విద్యుత్ వినియోగం పెరుగుతుందనేది వారి వాదన. తాజా రాజకీయ పరిణామాలతో కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులపై నిబంధనలు కఠినతరం కావొచ్చని మదుపర్లు భయపడుతున్నారు.

పసిడి రుణాల్లో 'ఒత్తిడి' పెరుగుతోంది

మస్క్ కంపెనీలకు భారీ నష్టాలు..

మిడ్‌టర్మ్ ఫలితాల తర్వాత ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ (Elon Musk) కు చెందిన టెస్లా (Tesla), స్పేస్‌ఎక్స్ (SpaceX) కంపెనీలు భారీ నష్టాలను చవిచూశాయి. కేవలం రెండు రోజుల్లోనే ఈ కంపెనీల మార్కెట్ విలువ 420 బిలియన్ డాలర్లకుపైగా తుడిచిపెట్టుకుపోయింది. ఆ మొత్తం మన దేశ కరెన్సీలో రూ.39 లక్షల కోట్లకుపైనే. మస్క్ తొలి నుంచి ట్రంప్ మద్దతుదారుడు. మధ్యంతర ఫలితాల్లో అమెరికాలో బ్లూవేవ్ వీచింది. దాంతో మస్క్ (Elon Musk) కంపెనీలపై విచారణలు, నిబంధనలు కఠినతరం చేసే అవకాశం ఉందని మదుపరులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఏఐ ప్రాజెక్టులు, ప్రభుత్వ కాంట్రాక్టులు సహా టెస్లా, స్పేస్‌ఎక్స్ విలీన ప్రయత్నాలకు ఇబ్బందులు ఎదురుకావొచ్చని మదుపర్లు భావిస్తున్నారు.

టెస్లా, స్పేస్‌ఎక్స్ ప్రధాన కార్యాలయాలు ఉన్న టెక్సాస్‌లో రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ తగిలింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన డెమోక్రాట్లు డేటా సెంటర్ల వేగవంతమైన విస్తరణకు అడ్డుకట్ట వేయొచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో మస్క్ భారీగా నిధులు వెచ్చించినప్పటికీ.. ఆయన మద్దతు ఇచ్చిన అభ్యర్థులు ఓడిపోయారు. ఈ కారణాలతో మార్కెట్ ప్రతికూలంగా స్పందించింది.

క్రీడలు

ప్రాక్టీస్ రద్దు.. రెండో వన్డేకూ వర్షం ముప్పు తప్పదా?



న్యూజిలాండ్ – భారత్ జట్ల మధ్య రెండో వన్డే శనివారం జరగనుంది. ఈ మ్యాచ్‌కూ వర్షం ముప్పు ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ప్రస్తుతం వెల్లింగ్టన్‌లో వర్షం పడుతూనే ఉంది. దీంతో భారత్ తన ప్రాక్టీస్ సెషన్స్‌ను రద్దు చేసుకుంది. మరోవైపు సిరీస్‌లో వెనుకబడిన న్యూజిలాండ్ మాత్రం ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసింది. మ్యాచ్ సమయానికీ వర్షం ముప్పు ఎక్కువేనని సమాచారం. తొలి వన్డేకూ వరుణుడు అటంకం కలిగించిన సంగతి తెలిసిందే. అప్పటికి రెండుసార్లు డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం టార్గెట్‌ను కుదించారు. టీమ్ఇండియా విజయం సాధించి ఐదు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. తొలి వన్డేకు ముందు ట్రైనింగ్ సమయంలో కివీస్ బ్యాటర్ డేవన్ కాన్వే గాయపడ్డాడు. దీంతో అతడు ఆ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు సిరీస్ నుంచి వైదొలిగాడు. అతడికి బదులు కంకషన్ ఆటగాడిగా నిక్ కెల్లీ జట్టులోకి వచ్చాడు. డేవన్ కాన్వేతో ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన మ్యాట్ హెన్రీ ఫిట్‌నెస్ సాధించడంతో సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నట్లు కివీస్ బోర్డు తెలిపింది.

కోహ్లీ క్యాచ్.. రోహిత్ సూపర్ త్రో వెనక సీక్రెట్ ఇదే: ఫీల్డింగ్ కోచ్

న్యూజిలాండ్ వేదికగా భారత్ వన్డే సిరీస్ ఆడుతోంది. తొలి మ్యాచ్‌లో సీనియర్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మెరుపు ఫీల్డింగ్‌తో అదరగొట్టారు. స్లిప్‌లో విరాట్ డైవింగ్ క్యాచ్ అందుకోగా.. రోహిత్ శర్మ సూపర్ త్రో విసిరి డేంజరస్ బ్యాటర్ పెవిలియన్‌కు చేరడంలో కీలక పాత్ర పోషించాడు. వీరిద్దరూ మైదానంలో చురుగ్గా ఉండటంపై భారత ఫీల్డింగ్ కోచ్ శుభదీప్ ఘోష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "తొలి వన్డేలో భారత ఆటగాళ్లు అద్భుతంగా ఫీల్డింగ్ చేశారు. మంచి క్యాచ్‌లు పట్టారు. బంతిని ఆపడంలోనూ అదరగొట్టారు. మ్యాచుల్లో కొన్నిసార్లు క్యాచ్‌లను వదిలేయడం సాధారణమే. వాటికి మేం బాధ్యత తీసుకుంటాం. ప్రాక్టీస్ సెషన్స్‌లో వర్కౌట్ చేస్తాం. న్యూజిలాండ్ గడ్డపై బంతిని సరిగ్గా అంచనా వేయడం చాలా ముఖ్యం. డ్రెస్సింగ్ రూమ్‌లోనూ చర్చించుకుంటాం. ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు బంతి గమనాన్ని త్వరగా పసిగట్టాలి. విరాట్ కోహ్లీ కవర్స్, పాయింట్ వద్ద ఎక్కువగా ఫీల్డింగ్ చేస్తుంటాడు. బంతి ఎలా వస్తుందో అతడికి బాగా తెలుసు. ఇతరుల కంటే త్వరగా బంతిని అంచనా వేసి అందుకొంటాడు. రోహిత్ త్రో కూడా అంతే. అనుభవం వల్ల వచ్చేదిదే. ఇలాంటి ఫీట్లను తరచూ చేస్తూ ఉంటారు. ఇక్కడి పిచ్‌లు చాలా చిన్నవి. ఫీల్డర్‌కు తగినంత సమయం కూడా ఉండదు. వెంటనే స్పందించాలి. మజిల్ మెమొరీ చాలా కీలకం. ఇది శారీరకంగా సవాల్‌తో కూడుకున్నదే. అయితే, వారిద్దరికి ఉన్న అనుభవంతోనే చేయగలిగారు" అని ఘోష్ తెలిపాడు. వచ్చే ఏదాది వన్డే ప్రపంచ కప్ ముంగిట.. విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు రోహిత్ సుముఖంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.



కోహ్లీ విషయంలో మాత్రం స్పష్టత లేదు. అయితే, కోహ్లీ కనీసం తమ డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చున్నా బాగుంటుందని మాజీ క్రికెటర్, దిల్లీ కోచ్ విజయ్ దహియా సూచించారు. కుర్రాళ్లతో మాట్లాడి వారికి విలువైన సూచనలు చేస్తాడని వెల్లడించాడు.

వన్డే ప్రపంచ కప్‌నకు ముందు ఈ సిరీస్ అత్యంత కీలకం: శుభ్‌మన్



వచ్చే ఏదాది జరిగే మెగా టోర్నీకి ఇప్పుడీ న్యూజిలాండ్ సిరీస్‌ను సన్నాహకంగా ఉపయోగించుకుంటున్నట్లు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఇక్కడి వాతావరణ పరిస్థితులే దక్షిణాఫ్రికాలోనూ ఉండటం తమకు కలిసి వచ్చే అంశం అని గిల్ పేర్కొన్నాడు. "దక్షిణాఫ్రికా,న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనలకు సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో వెళ్తుంటాం. వన్డే ప్రపంచకప్ అక్టోబర్ – నవంబరులో జరగనుంది. ప్రస్తుతం న్యూజిలాండ్‌లో ఉన్న పరిస్థితులే ప్రపంచకప్‌ను ఆడే సఫారీ గడ్డపైనా ఉంటాయి. కాబట్టి ఈ సిరీస్ మాకు మంచి అనుభవాన్ని ఇస్తుంది" అని గిల్ చెప్పాడు. "న్యూజిలాండ్ పిచ్‌లపై బంతి స్వింగ్ అవుతూ మంచి బౌన్స్ లభిస్తుంది. భారత పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్ ఇక్కడి పరిస్థితులకు తగిన నైపుణ్యం కలిగి ఉన్నారు. తొలి మ్యాచ్‌లోనే చూశాం. ఈ సిరీస్‌లో వారు రాణిస్తారనే నమ్మకం ఉంది" అని గిల్ చెప్పాడు. కివీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకోవడంపై గిల్ సంతోషం వ్యక్తం చేశాడు. "పొట్టి సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ జట్టును అద్భుతంగా నడిపించాడు. చివరి రెండు టీ20ల్లో ఓటమి తరువాత మేం వన్డే సిరీస్‌లో తలపడ్డాం. మొదటి మ్యాచ్‌లోనే గొప్ప విజయం సాధించడంతో ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ విజయాలతో జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో సానుకూల వాతావరణం ఏర్పడింది" అని గిల్ వెల్లడించాడు.

భార్య క్యాన్సర్ పోరాటం.. నా జీవితాన్ని మార్చేసింది: క్రికెటర్




న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో చివర్లో వచ్చిన బ్లెయిర్ టిక్నర్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. గుర్నూర్ బ్రార్ కాస్త రెచ్చగొట్టేలా చేసినా అతడు మాత్రం నవ్వుతూనే సమాధానం ఇచ్చాడు. ఔటైన తర్వాత కూడా అలాగే డగౌట్‌కు వెళ్లాడు. బౌలింగ్ సమయంలోనూ చాలా కూల్‌గా ఉన్నాడు. అయితే, కెరీర్ ఆరంభంతో పోలిస్తే ఇప్పుడు చాలా మారిపోయినట్లు తాజాగా ఓ ఇంటర్వ్యూలో టిక్నర్ వెల్లడించాడు. దానికి కారణం.. తన భార్య రెండేళ్లపాటు క్యాన్సర్‌తో పోరాడిన తర్వాత.. జీవితంపై తన దృక్పథం మారిపోయిందని తెలిపాడు. 2019లో అరంగేట్రం చేసిన అతడు ఇప్పటి వరకు కేవలం 19 వన్డే మ్యాచులు మాత్రమే ఆడటం గమనార్హం. "నా జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నా. ఇప్పుడు నా ఆటను ఆస్వాదిస్తున్నా. కెరీర్ ఆరంభంలో చాలా ఒత్తిడి ఉండేది. ప్రతి చిన్న విషయానికీ దూకుడుగా ఉండేవాడిని. కానీ, నా భార్య సారా క్యాన్సర్ బారిన పడిన సమయంలో నేను చాలా మారిపోయా.

అదరగొట్టిన సెహ్వాగ్ కుమారుడు..

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. దర్ సోనార్ (43), ఆషిష్ లుహార్ (29), నీరజ్ కుమార్ యాదవ్ (20) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అర్జున్ రాజ్‌పుత్, యశ్‌వీర్ గౌడ్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ నష్ట పోకుండా విజయం సాధించింది. వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (70★), మరో ఓపెనర్ లక్ష్య రాజేశ్ రాయ్‌చందాని (53★) హాఫ్ సెంచరీలు సాధించారు.



'సండియార్'.. పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



వుదయం సినిమా: యూనివర్సల్ హీరో కమల్ హాసన్ ప్రస్తుతం ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫుల్ లెంగ్త్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్ఐ), టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో కమల్ హాసన్ గతంలో ఎన్నడూ చూడని రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నారు.ఈ చిత్రానికి పవర్‌ఫుల్‌గా 'సండియార్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కమల్ హాసన్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో, గ్రే గడ్డంతో, చిన్నగా కత్తిరించిన హెయిర్‌స్టైల్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. డార్క్ బ్రౌన్ షర్ట్ ధరించిన ఆయన ఓ వాహనం కిటికీకి ఆనుకుని, నేరుగా ముందుకు చూస్తూ ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో కనిపిస్తున్నారు. ఆ వాహనంపై కనిపిస్తున్న రక్తపు మరకలు పోస్టర్‌కు రా అండ్ గ్రిట్టీ ఫీల్ తీసుకొచ్చాయి. వైలెన్స్ మధ్య సాగే ఓ బలమైన పాత్రలో కమల్ హాసన్ కనిపించబోతున్నారనే ఆసక్తిని ఈ పోస్టర్ కలిగిస్తోంది.'సండియార్' అనే టైటిల్ వినగానే భయంలేని, ధైర్యవంతమైన, శక్తిమంతమైన వ్యక్తి గుర్తుకొస్తాడు. కమల్ హాసన్ పోషిస్తున్న పాత్రకు ఈ టైటిల్ పర్ఫెక్ట్. ఆయన ఇంటెన్స్ లుక్, ప్రశాంతంగా కనిపిస్తూనే భయపెట్టే బాడీ లాంగ్వేజ్.. రాజీ పడని మనస్తత్వం, బలమైన వ్యక్తిత్వం ఉన్న పాత్రను సూచిస్తున్నాయి. ఈ ఫస్ట్ లుక్‌తోనే సినిమాలోని పాత్రకు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చారు. దీంతో యాక్షన్‌తో నిండిన ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.'సేతుపతి', 'చిత్తా' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు.ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. సునీల్ కె.ఎస్. సినిమాటోగ్రాఫర్‌గా, అన్బరివ్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌గా, అమృతా రామ్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. సి.ఎస్. బాలచందర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, ఎస్. డిస్నీ కో–ప్రొడ్యూసర్‌గా ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు.ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు, కమల్ హాసన్ పవర్‌ఫుల్, ఫియర్స్ అవతార్‌లో కనిపించడంతో 'సండియార్' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

వుదయం సినిమా

'టైసన్ నాయుడు' నుంచి ఫోక్ బ్యాంగర్

వుదయం సినిమా: ప్రామిసింగ్ స్టార్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, హరీష్ కట్టా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో సాయి శ్రీనివాస్ మునుపెన్నడూ చూడని మాస్ మేకోవర్‌తో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన సినిమా టైటిల్, గ్లింప్స్‌కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ఎనర్జిటిక్‌గా ప్రారంభిస్తూ మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'మదరాసి రబ్బరు బొమ్మ'ను విడుదల చేశారు.భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాట ఇన్ఫెక్షియస్ రిథమ్స్, ఎలక్ట్రిఫైయింగ్ బీట్స్, ఇన్‌స్టంట్ మాస్ అప్పీల్‌తో ఆకట్టుకునే ఫోక్ నంబర్‌గా నిలిచింది. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే ఫోక్ కంపోజిషన్స్, మాస్ నంబర్స్ అందించడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న భీమ్స్ సిసిరోలియో.. ఆకట్టుకునేలా ఈ ఫోక్ బ్యాంగర్‌ను రూపొందించారు. డైనమిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఉర్రూతలూగించే మ్యూజిక్ అరేంజ్‌మెంట్స్, హై ఎనర్జీ కంపోజిషన్ ఈ పాటకు అదిరిపోయే సెలబ్రేషన్ వైబ్‌ను తీసుకొచ్చాయి. సురేష్ గంగుల అందించిన లిరిక్స్ పాటకు ఎంటర్‌టైనింగ్ మాస్ ఫ్లేవర్‌ను జోడించాయి. హీరో, హీరోయిన్ మధ్య సరదాగా సాగే రొమాంటిక్ సంభాషణలను తన పదాలతో అందంగా ఆవిష్కరించారు. హీరో తన ప్రేమను 'మదరాసి రబ్బరు బొమ్మ' అంటూ ముద్దుగా పిలుస్తూ ఆమెను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తాడు. అందుకు అమ్మాయి అంతే చమత్కారంగా సమాధానమిస్తూ వారి మధ్య మ్యూజికల్ బాంటర్‌ను మరింత సరదాగా మార్చింది. నల్గొండ గద్దర్ నర్సన్న, రోహిణి సొరట్ తమ పవర్‌ఫుల్ వాయిస్‌తో పాటకు అద్భుతమైన ఎనర్జీని అందించారు.పాట విజువల్స్ కూడా ఎంతో కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నేహా శెట్టి ఆకట్టుకునే ఫోక్ ఇన్‌స్పైర్డ్ కాస్ట్యూమ్స్‌లో కనిపించారు.



డిసెంబర్ 10 సాయి దుర్గ తేజ్, కిరణ్ ల వివాహం



వుదయం సినిమా: నటుడు సాయి దుర్గ తేజ్ మరియు కిరణ్ ల నిశ్చితార్థం గురువారం (నవంబర్ 5, 2026) నాడు ★హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్★లో జరిగింది.ఈ జంట తమ కుటుంబ సభ్యులు మరియు ఆత్మీయుల సమక్షంలో నిశ్చితార్థం చేసుకున్నారు.కొణిదెల మరియు అల్లు కుటుంబాలకు చెందిన సభ్యులు, అలాగే సన్నిహిత బంధుమిత్రులు ఈ వేడుకలో పాల్గొని, తమ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్న ఈ జంటను ఆశీర్వదించారు.సాయి దుర్గ తేజ్ మరియు కిరణ్ ల వివాహం ★డిసెంబర్ 10, 2026★న హైదరాబాద్‌లో జరగనుంది.ఈ నిశ్చితార్థ వేడుకకు సాయి దుర్గ తేజ్ తల్లిదండ్రులు డాక్టర్ శివ ప్రసాద్ మరియు విజయ దుర్గ, సోదరుడు వైష్ణవ్ తేజ్ హాజరయ్యారు. వీరితో పాటు చిరంజీవి మరియు సురేఖ కొణిదెల; రామ్ చరణ్; అల్లు అర్జున్ మరియు స్నేహా రెడ్డి; అల్లు బాబీ మరియు నీలా షా; వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి మరియు వాయువ్ తేజ్; నాగబాబు మరియు పద్మజ; నిహారిక కొణిదెల; అల్లు అరవింద్ మరియు అల్లు నిర్మల; అల్లు శిరీష్ మరియు నయనిక రెడ్డి; అలాగే అకీరా నందన్ మరియు అద్య కూడా పాల్గొన్నారు.వీరితో పాటు మంచు మనోజ్ మరియు భూమా మౌనిక రెడ్డి; నవీన్ విజయ కృష్ణ; హర్ష చెముడు; వెంకీ కుడుముల; నవదీప్; మరియు హర్షిత్ రెడ్డి వంటి సన్నిహిత మిత్రులు మరియు సహచరులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

'ఇట్లు అర్జున'లో యూత్‌ఫుల్ క్యారెక్టర్ చేశా

వుదయం సినిమా: కింగ్ నాగార్జున సమర్పణలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇట్లు అర్జున'. 'ఇట్లు అర్జున' నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనస్వర రాజన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఇట్లు అర్జున్ మీరు తెలుగులో సైన్ చేసిన ఫస్ట్ సినిమా అని విన్నాం. ఇందులో కీర్తి క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?

–తెలుగులో నేను ఫస్ట్ సైన్ చేసిన సినిమా 'ఇట్లు అర్జున'. కాకపోతే 'ఛాంపియన్' సినిమా ఫస్ట్ రిలీజ్ అయింది.

ఇందులో హీరోకి మాటలు ఉండవు కదా! మీరు కలిసి నటించేటప్పుడు ఎలా ఉండేది?

–నాకు కథలో ఆకర్షించిన విషయాల్లో అది ఒకటి. ఇలాంటి క్యారెక్టర్స్ చాలా అరుదుగా వస్తుంటాయి. ఈ సినిమా కోసం నేను, అనీష్ కలిసి వర్క్ షాప్స్ చేశాం. సీన్స్ సీన్స్ ను చాలా ప్రాక్టీస్ చేశాం. మా ఇద్దరి క్యారెక్టర్స్ అద్భుతంగా వచ్చాయి.

ఇందులో ప్రేమకథ చాలా కొత్తగా ఉంటుందని విన్నాను?

'ఇట్లు అర్జున'లో మెయిన్ కోర్ ప్రేమకథ. ఇందులో అర్జున్ క్యారెక్టర్‌కు మాటలు రావు. తను ప్రేమను ఎలా ఎక్స్‌ప్రెస్ చేస్తాడు అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. అర్జున్, కీర్తి పాత్రని కచ్చితంగా గుర్తుపెట్టుకుంటారు.

డైరెక్టర్ గురించి చెప్పండి?

ఈ సినిమా చేయడానికి ఒక కారణం డైరెక్టర్ మహేష్ గారు. ఆయన విజన్ నాకు చాలా నచ్చింది. అర్జున్, కీర్తి క్యారెక్టర్స్‌ను అద్భుతంగా రాసుకున్నారు. అది నాకు చాలా నచ్చింది. కీర్తి క్యారెక్టర్ ఎలా ఉండాలో ఆయనకు ఫుల్ క్లారిటీ ఉంది. ఆయన ఏం చెప్తే అది ఫాలో అయిపోయాను. చాలా ఫ్రెండ్లీగా వర్క్ చేశాం.

అనీష్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?

–హీరోగా అనీష్‌కు ఇది ఫస్ట్ సినిమా. తొలి సినిమాకే ఒక మూగవాడి పాత్ర చేయడం చాలా డేరింగ్ అండ్ రిస్కీ. ఈ విషయంలో తనని అభినందిస్తున్నాను.

నాగార్జున గారు ఈ సినిమాని ప్రజెంట్ చేయడం ఎలా అనిపించింది?

–నాగార్జున గారు ఈ సినిమాని ప్రజెంట్ చేయడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇది నేను తెలుగులో సైన్ చేసిన తొలి సినిమా. అలాగే అనీష్ హీరోగా చేస్తున్న తొలి సినిమా.

వెంకీ కుడుముల గారి గురించి?

వెంకీ గారు స్వయంగా ఒక దర్శకుడు. ఆయన ప్రతి విషయాన్ని చాలా బాగా అర్థం చేసుకుంటారు. చాలా మంచి వ్యక్తి. ఆయన నిర్మిస్తున్న తొలి సినిమా ఇది.



మాకు చాలా మంచి సపోర్ట్ చేశారు.

తమన్ మ్యూజిక్ గురించి?

–తమన్ గారు చాలా హ్యాపీ పర్సన్. ఆయనతో ఉన్నప్పుడు చాలా హ్యాపీగా ఉంటుంది. ప్రమోషన్స్‌లో కూడా చాలా సపోర్ట్ చేశారు. ఇందులో మూడు పాటలకు కూడా చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

12 నుంచి రెగ్యులర్ షూటింగ్ 'ఫన్'



వుదయం సినిమా: వింధ్యా ఫిల్మ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జి. సంతోషి రెడ్డి నిర్మాణంలో హేమంత్ కృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ హారర్ కామెడీ చిత్రం "ఫన్" నేడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ నవంబర్ 12 నుంచి ప్రారంభం కానుంది.ఈ సినిమాని వచ్చే ఏడాదిలో రిలీజ్ చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు. కళ్యాణ్ పడాల హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సాహితి, అజయ్ ఘోష్, రవి శివ తేజ, వి.యశోర, సోనియా నాయుడు, జె.డి.వి ప్రసాద్, బేబీ జస్విత, మాస్టర్ హనీష్ ముఖ్య పాత్రలను పోషించానున్నారు.ఈ సినిమాకి సంగీతం రామ్ గోపాల్ అందించనున్నారు. జి.ఎల్ బాబు కెమెరామెన్‌గా, క్రాంతి (ఆర్.కె.) ఎడిటర్‌గా పని చేయనున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వరుస అప్డేట్‌లను అందించేలా మేకర్స్ ప్లాన్స్ చేస్తున్నారు. నటీనటులు : కళ్యాణ్ పడాల, సాహితి, అజయ్ ఘోష్, రవి శివ తేజ, వి.యశోర, సోనియా నాయుడు, జె.డి.వి ప్రసాద్, బేబీ జస్విత, మాస్టర్ హనీష్ తదిత రులు.

"చంద్రయాన్" సినిమా ట్రైలర్ రిలీజ్



వుదయం సినిమా: రాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో "చంద్రయాన్" టైటిల్ తో మరో ఇంట్రెస్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రంలో శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సింబ స్క్రీన్ స్టోరీస్ బ్యానర్ పై ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. హిలేరియస్ అడ్వెంచర్ స్టోరీతో తెరకెక్కిన "చంద్రయాన్" సినిమా ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు "చంద్రయాన్" సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు.ఈ ప్రపంచంలో కేవలం 5 దేశాలు మాత్రమే చంద్రుడి మీదకు తమ స్పేస్ క్రాఫ్ట్ లను పంపగలిగాయి. అలాంటి ప్రయత్నం మందమర్రి అనే చిన్న గ్రామంలో లెక్కలు, ఎక్కాలు రాని నలుగురు కుర్రాళ్లు చేస్తే ఎంత ఫన్నీగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఆ హ్యూమర్ ను సిల్వర్ స్క్రీన్ మీద చూపించబోతోంది "చంద్రయాన్" మూవీ. ఆ ఫన్ కు చిన్న శాంపిల్ ఇచ్చింది ట్రైలర్. "చంద్రయాన్" ట్రైలర్ ఎలా ఉందో చూస్తే – గూగుల్ సాయంతో రాకెట్ తయారుచేసి చంద్రుడి మీదకు వెళ్లేందుకు నలుగురు కుర్రాళ్లు ప్రయత్నాలు ప్రారంభిస్తారు. ఈ దెబ్బతో ఊరంతా తమ వైపు, ప్రపంచమంతా తమ ఊరి వైపు చూడాలనుకుంటారు. ఆ రాకెట్ లో ఇంధనం కోసం తవుడు, ఆ వాతావరణంలో బతుకుతుందో లేదో టెస్ట్ చేసేందుకు కోడిని అద్దెకు తీసుకొస్తారు. సైన్స్ కే ట్విస్టులు ఇచ్చే ఈ సైంటిస్టులు చేసే రాకెట్ ప్రయోగం ఊరికి కీడుగా గ్రామస్థులు భావిస్తారు. ఈ క్రమంలో ఊరిలో హత్య కేసు ఉదంతం వెలుగులోకి రావడం, బాబా భాస్కర్ క్యారెక్టర్ ను పరిచయం చేయడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఎవరూ తమ ప్రయత్నాన్ని నమ్మని, ప్రోత్సహించని పరిస్థితుల్లో తమకు దొరికిన వస్తువులతో ఈ నలుగురు కుర్రాళ్లు రాకెట్ ఎలా తయారుచేశారు? చంద్రయానం ఎలా చేశారు? అనే అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

నటీనటులు – శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ, తదితరులు

"యద్భావం తద్భవతి" చిత్ర టీజర్ విడుదల

వుదయం సినిమా: రమేష్ జక్కుల దర్శకత్వంలో ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి నిర్మాతగా ప్రసన్న భూమి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "యద్భావం తద్భవతి". వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇనయ సుల్తానా, రేణు శ్రీ హీరోయిన్స్ గా నటిస్తుండగా సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగర్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సినిమాటోగ్రఫీ చేసిన ఈ చిత్రానికి మిహిరామ్ సంగీతం అందించగా ఈ చిత్ర పాటలను కే మ్యూజిక్ ద్వారా చిత్ర బృందం విడుదల చేస్తుంది. విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా "యద్భావం తద్భవతి" చిత్ర టీజర్ ను ప్రముఖ చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ చేతుల మీదగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. ఇప్పుడే యద్భావం తద్భవతి చిత్ర టీజర్ చూసాను. ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి నిర్మించిన ఈ చిత్ర టీజర్ చూస్తుంటే చిన్న సినిమా అయినప్పటికీ ప్రొడక్షన్ వాల్యూస్ చాలా బాగున్నట్లు అనిపిస్తుంది. అలాగే ఒక పాట కూడా చూడటం జరిగింది. రమేష్ జక్కుల దర్శకత్వం, మిహిరామ్ గారి సంగీతం చాలా బాగున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కళ పట్ల ఉన్న అభిమానంతో సినిమా తీయడం చాలా పెద్ద విషయం. ఈ సినిమాలో నటించిన వరుణ్ సందేశ్ అలాగే ఇతర నటీనటులకు చిత్ర బృందానికి నా అభినందనలు. లోహిత్, శ్రీకాంత్ అయ్యంగర్ వంటి ఎంతో సీనియర్ నటులు కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాను ప్రేక్షకులు అందరూ ఆదరించి నిర్మాత మరో సినిమా తీసేలా ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను" అన్నారు. నటీనటులు : వరుణ్ సందేశ్, ఇనయ సుల్తానా, రేణు శ్రీ, సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగర్ తదితరులు.



మిమ్మల్ని గౌరవించిన చిత్ర పరిశ్రమలను మీరు గౌరవించండి



వుదయం సినిమా: తెలుగు చిత్ర పరిశ్రమను, దక్షిణాది ఫిలిం ఇండస్ట్రీని విమర్శిస్తూ మాట్లాడుతుండటం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక్కడే అవకాశాలు పొంది ఇదే పరిశ్రమలను కించపరిచేలా మాట్లాడుతున్న నాయికలను ఉద్దేశించి తనదైన శైలిలో పోస్ట్ చేశారు ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్.ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ స్పందిస్తూ – టాలీవుడ్ లో, సౌత్ ఇండియా సినీ పరిశ్రమలో అవకాశాలు పొంది, గుర్తింపు తెచ్చుకున్న కొందరు నాయికలు కొన్నేళ్ల తర్వాత ఇదే పరిశ్రమను విమర్శించడం తగదు. సదరు నాయికలు ఇక్కడి కథలు, సంప్రదాయాలను తప్పుగా పేర్కొంటున్నారు. ప్రతి యాక్టర్ కు తమ అభిప్రాయాలు వెల్లడించే స్వేచ్ఛ ఉంటుంది. కానీ సద్విమర్శలు చేయకుండా మిమ్మల్ని ఆహ్వానించిన పరిశ్రమనే చిన్న చూపు చూసేలా మాట్లాడటం సరికాదు. తెలుగు సినిమా, దక్షిణాది సినిమా పరిశ్రమలు కథల్లో తమదైన సంప్రదాయాలను, సంస్కృతులను ప్రదర్శిస్తాయి. బయటి వాళ్లకు అవి అసాధారణంగా అనిపించవచ్చు. మాకు మాత్రం ఆ సంప్రదాయాలు, సంస్కృతులు పరిచితమే. గౌరవం అనేది ఇచ్చిపుచ్చుకునేది. అవకాశాలు వచ్చినప్పుడు ఎంతో అపురూపంగా భావించిన మీరు ఇప్పుడు వాటిని కించపరచడం అంగీకారం కాదు.

వుదయం సినిమా: ఇటీవల కొందరు నాయికలు

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.